సాహిత్య
గత నెలరోజులపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కర్నూలు
: fb.com/vaartha Digital
Published from Kurnool, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
2-7-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 151 పేజీలు: 10+4 వెల: 6.50

ముంబయి ఎన్నికల్లో ఎవరికి వారే!

కేంద్రంలో అధికారం వస్తే ఆర్ఎస్ఎస్‌పై నిషేధం: కాంగ్రెస్

5లో

# పింఛన్ల పంపిణీతో పల్లెలు కళకళ

గత ప్రభుత్వంలో దివ్యాంగుల పింఛన్లు కూడా దోచేశారు

మెగా డిఎస్సీకి అడ్డంకులు సృష్టించారు

అనువ్యారీతిలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తాం: సిఎం చంద్రబాబు



మంగళవారం కొవ్వూరు నియోజకవర్గం మలకపల్లి ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు, మంత్రులు

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో జూలై, 1 ప్రభాతవార్త:** ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేయడంతో పల్లెలన్నీ కళకళలాడుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వంలో దివ్యాంగుల పేరుతో పింఛన్లు దోచేశారని అన్నారు. అమ్మఒడి పేరుతో మోసం చేస్తే... ప్రజా ప్రభుత్వం వచ్చాక ఇంట్లో ఎందరు పిల్లలున్నా తల్లికి వందనం అందిస్తోందని చెప్పారు. కొవ్వూరు నియోజకవర్గం మలకపల్లిలో పేదల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. సానమాండ్ర పోశిబాబు ఇంటికి వెళ్లి చర్మకార పింఛను అందజేశారు. అనంతరం పోశిబాబు కుటుంబసభ్యులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మరో లబ్ధిదారు గెడ్డం కృష్ణదుర్గ నివాసానికి వెళ్లి వితంతు పెన్షన్ అందజేశారు. అనంతరం ప్రజావేదిక సభలో ప్రజలను ఉద్దేశించి సీఎం చంద్రబాబు ప్రసంగించారు.

"గత ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతాలు కూడా సరిగా వచ్చేవికావు. రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు వచ్చేవి కావు. కానీ మన ప్రభుత్వం వచ్చాక ఒకటవ తేదీనే ఇస్తున్నాం. రూ.200 పింఛన్‌ను రూ.2 వేలకు పెంచాను. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.4,000 వేలు చేశాను. డయాలసిస్ రోగులకు రూ.10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు ఇస్తూ మానవత్వాన్ని నిరూపించుకున్నాం. ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇచ్చినట్టే పింఛన్లూ అందిస్తున్నాము. గత ప్రభుత్వం పింఛను పెంచుతామని ఏం చేసిందో చూశారుగా. పెద్ద పెద్ద రాష్ట్రాలు పెన్షన్ పంపిణీలో మన దరిదాపుల్లో లేవు. ఏ

>>2



## 'సుప్రీం' సిబ్బందికి రిజర్వేషన్లు

చరిత్రాత్మక నిర్ణయం..

### జూన్ 23 నుంచే అమల్లోకి

**న్యూఢిల్లీ,జులై 1:** దేశ సర్వోన్నత న్యాయస్థానం 75ఏళ్ల చరిత్రలో ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నది. తొలిసారిగా సిబ్బందికి రిజర్వేషన్లు అమలు చేయబోతున్నది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సిబ్బంది ప్రత్యక్ష నియామకం, పదోన్నతులను కల్పించేందుకు మొదటిసారిగా అధికారిక రిజర్వేషన్లు ప్రవేశపెట్టింది. దాంతో సుప్రీంకోర్టులో నాన్‌జ్యుడీషియల్ పోస్టులకు ప్రత్యక్ష నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ల ప్రయోజనాన్ని పొందనున్నారు. సుప్రీం కోర్టు రిజర్వేషన్ విధానం 23 జూన్

>>2



## రాష్ట్ర బిజెపి చీఫ్‌గా మాధవ్ ఏకగ్రీవం

పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతానని వెల్లడి

### పురందేశ్వరి సారథ్యంలో రెండేళ్లుగా పార్టీ బలోపేతమైందని వ్యాఖ్య

**విజయవాడ,జులై1,ప్రభాతవార్తప్రతినిధి:** బిజెపి ఎపి రాష్ట్ర అధ్యక్ష పదవి బాధ్యతలను మాజీ ఎమ్మెల్సీ పోకల వంశీ నాగేంద్ర మాధవ్ స్వీకరించారు. ఈపదవికి మాధవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు ఎపి బిజెపి అధ్యక్ష బాధ్యతలను మాధవ్‌కు రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అప్పగించారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మాధవ్‌కు బిజెపి జాతీయ, ఎపి నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పివిఎన్ మాధవ్ మీడియాతో మాట్లాడారు. తాను ఇప్పుడు ఎపి అధ్యక్ష

>>2

## వల్లభనేనికి షరతులతో బెయిలు

సుప్రీంలో సవాల్ చేసిన ప్రభుత్వం

**విజయవాడ.జులై1, ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ ఇళ్ల పట్టాల కేసుకు సంబంధించి వైఎస్సార్సీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌కి షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది.. ఈ కేసుపై మంగళవారం నూజివీడు కోర్టులో వాదోపవాదాలు జరిగాయి. అనంతరం వంశీకి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. లక్ష రూపాయలకు 2 పూచికత్తులు,, వారానికి రెండుసార్లు స్టేషన్ కి రావాలంటూ కోర్టు షరతులు పెట్టింది. వల్లభనేని వంశీ ఈ కేసులో ఇప్పటివరకూ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తాజాగా

>>2

## ప్రజా సమస్యలపై తక్షణమే స్పందిస్తాం

66వ రోజు ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేష్

### మెడికల్ సీటుపై సజ్జల స్నేహితుడు మోసం చేశాడంటూ లోకేష్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు



వీల్‌చైర్‌లో కూర్చున్న ఓ మహిళ అర్జీని స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేష్

**విజయవాడ, జులై1,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా సమస్యలపై ఏ సమయంలోనైనా స్పందిస్తాం, పరిష్కరిస్తామని మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.ఎటువంటి ఇబ్బందైన ,ఆపద ఏదైనా ప్రజలకు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను త్వరితగతిన ప్రజా దర్బార్‌లో విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్ పరిష్కరిస్తున్నారు. మంగళవారం ఉదయం తన నివాసంలో 66వ రోజు ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న వారు స్వయంగా మంత్రి లోకేష్‌ను కలిసి విన్నవించారు. ప్రతిఒక్కరి అర్జీ పరిశీలించిన మంత్రి.. ఆయా సమస్యల పరిష్కారం కోసం అప్పటికప్పుడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రతిఒక్కరికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన విజ్ఞప్తులు మెడికల్ సీటు ఇప్పిస్తామంటూ సజ్జల సన్నిహితుడు మోసం చేశాడు.

తమ కుమారుడికి పిజి మెడికల్ సీటు ఇప్పిస్తామంటూ అప్పటి వైసీపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అండతో తూర్పు గోదావరి జిల్లా కొత్తపేట, వాడపాలెంకు చెందిన సజ్జల సన్నిహితుడు అడపా ప్రేమ్‌చంద్, గుత్తుల అవినాష్, కట్టెవాటి బాలిరెడ్డి రూ.1.20 కోట్లు తీసుకుని మోసం చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన మన్నె సుబ్బారావు మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తాను మెడికల్ సీటు గురించి ప్రశ్నించగా.. అప్పటి సీఎంవో అధికారి ధనుంజయరెడ్డి ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో సీటుఇప్పిస్తానంటూ రెండు కోట్లు డిమాండ్ చేశారు. అంత సొమ్ము చెల్లించలేమని చెప్పడంతో తాము కట్టిన నగదుకు బెంగళూరులోని రామయ్య మెడికల్ కాలేజీలో

>>2

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో డాక్టర్ల పాత్ర అద్వితీయం

-మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,జులై1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఆర్థిక ప్రగతికి, ప్రజల ఆరోగ్యానికి నడుమ అవినాభావ సంబంధం ఉందని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు శ్రమించే వైద్యులను సమాజంలోని అన్ని వర్గాల వారు గౌరవించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కోరారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా విజయవాడలో డా.యన్.టి.ఆర్.వైద్య విజ్ఞాన విశ్వ విద్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో వైద్యుల పాత్ర కీలకమని, ఈ దిశగా నిరంతరం ప్రజా సేవ పట్ల చిత్త శుద్ధి, అంకితభావంతో పనిచేసే వైద్యులకు మంత్రి అభినందనలు తెలిపారు. ఎంతో ప్రయాస పడి ఉన్నత వైద్య విద్యను అభ్యసించి వ్యక్తి గత, కుటుంబపరమైన పలు ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రజల ఆరోగ్య ప్రమాణాలను పెంచటానికి కృషి చేసే వైద్యుల పట్ల ప్రజలు, నాయకుల ధోరణిలో మార్పు రావాలని అన్నారు. ఆఖరి క్షణం వరకు రోగుల ప్రాణాలు కాపాడేందుకు శ్రమించే వైద్యులపై దాడులు, జులుం చేయటం ప్రజాస్వామ్యంలో సరికాదన్నారు.

అకారణంగా అనుమానిస్తూ డాక్టర్ల పట్ల దురుసుగా వ్యవహరించవద్దన్నారు. చికిత్సలో వైద్యులు నిర్లక్ష్యం చేసినట్లు భావిస్తే వాటిని ప్రభుత్వం, అయా యాజమాన్యాల దృష్టికి తీసుకువెళ్ళటం మంచిదన్నారు.పవిత్రమైన వైద్య వృత్తిని చేపట్టిన వైద్యుల్లో అధిక భాగం రోగుల పట్ల సానుభూతి, అంకిత భావంతో పనిచేస్తారంటూ...దీనికి భిన్నంగా క్రమ శిక్షణా రాహిత్యం, బాధ్యతా రాహిత్యంతో పనిచేసే వైద్యులుకు తమ వైఖరి మార్చుకోవాలంటూ మంత్రి హెచ్చరించారు. ప్రజారోగ్యం పట్ల నిర్లక్ష్య వైఖరిని కూటమి ప్రభుత్వం సహించదని, అట్టివారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామ న్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది పనితీరు పట్ల నిఘా పెంచామని, తప్పు చేసేవారిపై చర్యలు ఉంటాయన్నారు.




మంగళవారం జ్యోతి ప్రజ్వలనతో వైద్యుల దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

**గాడిన పడ్డ ప్రజారోగ్యం**

జగన్ ప్రభుత్వం ఐదేళ్ల ప్రభుత్వ నిర్వాకాలు, నిర్లక్ష్యంతో ప్రజారోగ్య రంగం గాడి తప్పిందని, అస్తవ్యస్తమైన వైద్య రంగాన్ని కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది పాలనలో తిరిగి పట్టాలెక్కించిదన్నారు. కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన విషయాల్లో గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని మంత్రి వివరాలతో సహా వెల్లడించారు. ఆ ఐదేళ్ళ కాలంలో ప్రజారోగ్య రంగంలో క్రమశిక్షణారాహిత్యం, అవినీతి, రాజకీయజోక్యంవలన వైద్య

>>2



ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు

## బివి పట్టాభిరామ్ కన్నుమూత

ఇంద్రజాలం, హిప్నటిజంలోనూ ప్రఖ్యాతి

### నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు

**హైదరాబాద్, జులై 1 ప్రభాతవార్త:** ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బివి పట్టాభిరామ్ (75) కన్నుమూశారు. హైదరాబాద్‌లో సోమవారం రాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. ప్రముఖ ఇంద్రజాలికుడు, మానసిక వైద్యుడిగానూ పట్టాభిరామ్ ప్రసిద్ధి.ఆయనకు భార్య జయ, కుమా

>>2

## సిట్ అదుపులో చెవిరెడ్డి, వెంకటేష్

**విజయవాడ,జులై 1.ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేష్ నాయుడులను సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నేటి నుంచి మూడు రోజుల పాటు చెవిరెడ్డిని విచారించేందుకు ఏసీబీ కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈరోజు ఉదయమే చెవిరెడ్డితో పాటు వెంకటేష్ నాయుడును కూడా సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకుని సిట్ కార్యాలయానికి తరలించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విచారించేందుకు సిట్‌కు కోర్టు అనుమతించింది. కస్టడీలోకి తీసుకునే సమయంలో మరోసారి జైలు వద్ద చెవిరెడ్డి హల్‌చల్ చేశారు. సిట్ కార్యాలయానికి తరలించే సమయంలో నా పై తప్పుడు కేసు పెట్టారంట్టూ అరుస్తూ వచ్చారు. ఎవ్వరినీ వదిలేది లేదంటూ హెచ్చరిస్తూ చెవిరెడ్డి పోలీసు జీపుఎక్కారు. లిక్కర్ స్కాంలో

>>2

## డబులింజిన్ సర్కార్‌తోనే ఎపి అభివృద్ధి

- కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



**విజయవాడ,జూలై1.ప్రభాతవార్తప్రతినిధి:** డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే ఎపి అభివృద్ధి సాధ్యమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వ్యాఖ్యానించారు. కూటమి నేతలతో సమన్వయం చేస్తూనే.. ఏపీ బిజెపిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మనం ఐదు శాతం సీట్లు తీసుకోవడం కాదని.. మనమే మరో పార్టీకి సీట్లు ఇచ్చే స్థాయికి ఎదగాలని కోరుకున్నారు. మంగళవారం విజయవాడ బిజెపి కార్యాలయంలో శ్రీనివాస వర్మ మీడియాతో మాట్లాడారు. ఎపి బిజెపి రథసారథిగా ఎంపికైన పివిఎన్ మాధవ్‌కు శ్రీనివాస వర్మ శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నేతలతో సమన్వయం చేస్తూనే.. ఏపీ బిజెపిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మనం ఐదు శాతం సీట్లు తీసుకోవడం కాదని.. మనమే మరో పార్టీకి సీట్లు ఇచ్చే స్థాయికి ఎదగాలని కోరుకున్నారు.ఏపీ బీజేపీ రథసారథిగా ఎంపికైన పీవీఎన్ మాధవ్‌కు శ్రీనివాస వర్మ శుభాకాంక్షలు తెలిపారు

పురంధేశ్వరి ఎపి బిజెపీ అధ్యక్షురాలిగా పార్టీ కోసం ఎంతో పని చేశారని శ్రీనివాస వర్మ కొనియాడారు. తాను ఎంపీగా, కేంద్రమంత్రిగా పురంధేశ్వరి సహకారంతో ఎదిగానని ఉద్ఘాటించారు. పివి ఎన్ మాధవ్ కూడా నిత్యం పార్టీ కోసం పని చేస్తారని అన్నారు. మాధవ్ తండ్రి చలపతిరావు కూడా పార్టీ కోసం పరితపించే వారని గుర్తుచేసుకున్నారు.

ఇప్పటి నాయకులకు చలపతిరావు సేవల గురించి తెలియదని చెప్పారు. 1980 నుంచి 1986 వరకు బీజేపీ ఏపీ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి వ్యక్తి చలపతిరావే అనిగుర్తుచేసుకున్నారు. ఆ కుటుంబం నుంచి వచ్చిన మాధవ్ కూడా సొంతంగా ఎదిగారని కొనియాడారు. మాధవ్ ఏపీ బీజేపీని బలోపేతం చేస్తారనే నమ్మకం తమకు ఉందని ఉద్ఘాటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే గమ్యంగా కార్యకర్తలు పనిచేసేలా పీవీఎన్ మాధవ్ చూడాలని కోరారు. కింది స్థాయి కార్యకర్తలతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించేలా మాధవ్ పని చేయాలని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ సూచించారు.

**బిజెపిని నమ్ముకున్న వారికి న్యాయం**

ఎపి బిజెపి అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చిన్న వయసు నుంచే రాజకీయాల్లో ఉన్నారని ఎమ్మెల్సీ, బిజెపి సీనియర్ నేత సోము వీర్రాజు పేర్కొన్నారు. పివిఎన్ మాధవ్‌కు ఏపీ బీజేపీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన కేంద్ర పెద్దలకు సోము వీర్రాజు ధన్యవాదాలు తెలిపారు. పీవీఎన్ మాధవ్ ఎపి బిజెపి అధ్యక్ష బాధ్యతలు

>>2

## రూ. 99,446 కోట్లతో రెండేళ్లలో 3.5 కోట్లమందికి ఉపాధి లక్ష్యం

రూ. లక్ష కోట్ల కార్పస్‌తో ఆర్‌డిఐ స్కీం

జాతీయస్థాయి కొత్త క్రీడా విధానం 2025కు ఆమోదం

### ప్రధాని మోడీ అధ్యక్షతన కేబినెట్ నిర్ణయాలు



**న్యూఢిల్లీ,జులై 1:** దేశంలో పరిశోధన అభివృద్ధితో పాటు సృజనాత్మక ఒరవడిని మరింత పెంచేందుకు వీలుగా లక్ష కోట్ల రూపాయల కార్పస్ ఫండ్‌తో ఆర్‌డిఐ స్కీంను కేంద్రం ఏర్పాటుచేస్తోంది. ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థికవ్యవహారాల కేబినెట్‌కమిటీ ఈ ప్రతిపాదనలను ఆమోదించింది. తక్కువ వడ్డీ లేదా అసలు వడ్డీరహిత ఆర్థికసాయం దీర్ఘకాలిక ప్రాతిపదికన అందించడంతోపాటు రంగాల్లో పరిశోధనాఫలాలను సత్వరమే అమలుకు కృషిచేసేందుకు ప్రైవేటు రంగంలో పెట్టుబడులు మరింతగా పెంచేందుకు వీలు కలుగుతుందని కేబినెట్ వివరాలను రైల్వే సమాచార మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ప్రైవేటురంగానికి ఆర్థిక సాయం అందించేక్రమంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు ఈ కొత్తస్కీంను తెచ్చారు. కొత్త స్కీంవల్ల ప్రైవేటురంగంలో పరిశోధన అభివృద్ధి, ఇన్నొవేషన్‌ను మరింత ప్రోత్సహించేందుకు దోహదంచేస్తుంది. అంతేకాకుండా స్వయం సమృద్ధి చేకూరుతుందని అంచనావేసింది. టెక్నాలజీ రెడీ స్థాయిల్లోనే ఉన్నతస్థాయికి పరివర్తనం అనుకూల ప్రాజెక్టులకు ఈ నిధులు అందిస్తుంది. ఇందుకోసం డీప్‌టెక్ ఫండ్‌ఆఫ్ ఫండ్స్ ఏర్పాటుచేస్తారు. కేబినెట్ కార్యదర్శి అధ్యక్షతన ఉన్న కొన్ని శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఈస్కీం మంజూరుచేస్తారు.

ఇక కేంద్ర శాస్త్రసాంకేతిక శాఖ ఇందుకు నోడల్ శాఖగా వ్యవహరిస్తుంది. మొదటిస్థాయిలో ఒక ప్రత్యేక ప్రయోజన నిధి(ఎస్‌పిఎఫ్)ను ఏర్పాటు చేస్తారు. అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎఎన్‌ఆర్ఎఫ్)కు ఒక విభాగంగానే పనిచేస్తుంది. ఇక రెండోస్థాయిల్లో ఫండ్‌మేనేజర్లు దీర్ఘకాలిక రుణాలను తక్కువ వడ్డీ లేదా వడ్డీ

>>2

## వాతావరణం అనుకూలించక చంద్రబాబు హెలికాప్టర్ గన్నవరంలో ల్యాండింగ్..

**విజయవాడ జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** వాతావరణం అనుకూలించకపోవడంతో సిఎం చంద్రబాబు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ గన్నవరం ఎయిర్ పోర్టులో ల్యాండ్ అయ్యింది. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో చంద్రబాబు రాజమహేంద్రవరం వెళ్లనున్నారు. అక్కడి నుంచి కొవ్వూరు చేరుకోనున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించేందుకు తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో పర్యటించనున్నారు.



మండి జిల్లాలో బియాస్, సుకేతి నదుల సంగమం వద్ద వరద ఉద్ధృతిలో చిక్కిన మహాదేవ ఆలయం

# పల్లెలు కళకళ

>> రాష్ట్రంలోనూ ఇంతపెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వడం లేదు. పింఛన్ల కోసం నెలకు రూ.2,750 కోట్లు వెచ్చిస్తున్నాము. తెలంగాణలో కేవలం రూ. 8 వేల కోట్లు, కేరళలో రూ.7,200 కోట్లు పింఛను కోసం ఖర్చు చేస్తున్నారు అని సీఎం వివరించారు.

**కనీవిని ఎరుగని రీతిలో పుష్కరాలు..**

వైసీపీ నేతలు మెగా డీఎస్సీకి అడ్డంకులు సృష్టించారు. అయినప్పటికీ నెలలోగా ఉపాధ్యాయుల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. ఎవరైనా డగ్స్, గంజాయి అమ్మితే తాట తీస్తా. గంజాయి బ్యాచ్‌ను పరామర్శించే వారిని ఏమనాలి? ప్రజలను కాపాడుకోడానికి నేరస్తులతో రాజకీయం చేయాల్సి వస్తోంది. సమైక్యాంధ్రలో, నవ్యాంధ్రలో ముఖ్యమంత్రిగా నా ఆధ్వర్యంలో గోదావరి పుష్కరాలు నిర్వహించాను. ఈసారి కనీవినీ ఎరుగని రీతిలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తాం.నేను, నా మిత్రుడు పవన్ కళ్యాణ్ చెప్పినట్టే మాట నిలబెట్టుకుంటున్నాం. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తున్నాం. విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తున్నాం. ఏదైనా పాలన పూర్తి చేసి సుపరిపాలనలో తొలి అడుగు వేశాం. సీఎం పదవి నాకు కొత్త కాదు. సమైక్యాంధ్రలో 9 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్నాను. 10 ఏళ్ల ప్రతిపక్ష నేతగా పనిచేశాను. కానీ గత ఐదేళ్ల జరిగిన విధ్వంసం నా జీవితంలో చూడలేదు. వ్యవస్థలు పడకేశాయి. ఆర్థిక వ్యవస్థ విధ్వంసమైంది. ప్రభుత్వ విభాగాలు పనిచేయలేదు. వాటన్నింటినీ అధ్యయనం చేయడానికి నాకే ఏడాది పట్టింది. 204 అన్నా క్యాంటీన్ల ద్వారా పేదలకు నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. దీపం పథకం ద్వారా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఒక్క తల్లికి వందనం పథకం ద్వారా రూ. 10 వేల కోట్లు తల్లుల ఖాతాల్లో వేశాం. 1, 11వ తరగతి విద్యార్థులకు అడ్మిషన్లు అవగానే వారికీ వేస్తాం అని ముఖ్యమంత్రి అన్నారు.

**త్వరలోనే నిరుద్యోగ భృతికి శ్రీకారం**

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఎంతో సహకరిస్తోంది. అమరావతికి కేంద్రం రూ.15 వేల కోట్లు సాయం చేసింది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,400 కోట్లు కేటాయించింది. 9.5 లక్షల కోట్ల మేర పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నాం. వీటి ద్వారా 8 లక్షల 50 వేల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఇప్పటికే రూ. 5 లక్షల కోట్ల పనులు ప్రారంభమయ్యాయి. వాటి ద్వారా 4 లక్షల 50 వేల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఐదేళ్లలో ఎంత పెట్టుబడులు వచ్చాయో ఒక్క ఏడాదిలో అంతకంటే ఎక్కువ పెట్టుబడులు తెచ్చాం. వీలైనంత త్వరలో నిరుద్యోగ భృతికి శ్రీకారం చుడతాం. పోలవరాన్ని గత ప్రభుత్వం ఏ విధంగా భ్రష్టు పట్టించిందో మీరే చూశారు. డయాఫ్రం వాల్ మీను పూర్తిచేసే కాఫర్ డ్యామ్ పూర్తి చేయలేదు. ఆ భగవంతుడు పోలవరం పూర్తిచేసే బాధ్యత నాకే ఇచ్చారు. 2027కి పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేసే బాధ్యత తీసుకుంటాం. దేశంలో ఎక్కడా రాని విధంగా 50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే ప్రాజెక్టు పోలవరం. అది ప్రమాదంలో పడకూడదు. డిసెంబర్ కు డయాఫ్రం వాల్ పూర్తిచేస్తాం. గత ఐదేళ్లలో 4 శాతం పనులు పూర్తిచేస్తే నేను ఒక్క ఏడాదిలో 6 శాతం పూర్తిచేశాం అని వివరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే లు,ఎంపీలు, టిడిపి,జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మంగళవారం జమ్ములో సాధువులు అమర్‌నాథ్ యాత్రకు సిద్ధమైన దృశ్యం

# రాష్ట్ర బిజెపి చీఫ్‌గా మాధవ్ ఏకగ్రీవం

>> బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందని ఉద్ఘాటించారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నడిపిన పిసి మోహన్‌కి ధన్యవాదాలు తెలిపారు. నేడు ఎంతోమంది బిజెపి కోసం పని చేస్తున్నా.. తన మీద నమ్మకం ఉంచినందుకు పార్టీ హై కమాండ్‌కి కృతజ్ఞతలు పివిఎన్ మాధవ్ చెప్పారు. ఏపీలో బిజెపిని తిరుగులేని శక్తిగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఏపి బిజెపి అధ్యక్షుడు మాధవ్ తెలిపారు. మా కుటుంబం, బిజెపి వేర్వేరు కాదని స్పష్టం చేశారు. పురందేశ్వరి సారథ్యంలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, మూడు ఎంపీలు సాధించారని గుర్తుచేశారు. గత రెండేళ్లుగా పురందేశ్వరి నేతృత్వంలో పార్టీ బలోపేతం అయ్యిందని ఉద్ఘాటించారు. కూటమి ఈ సంఖ్యను రెట్టింపు చేసేలా ఏపీలో బీజేపీ క్రియాశీలకంగా పనిచేస్తోందని అన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజలకు భరోసా కల్పించారని చెప్పుకొచ్చారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇప్పుడు పురందేశ్వరి మరిన్ని సేవలు అందించనున్నారని అన్నారు. సోము వీర్రాజు బిజెపి బలోపేతం కోసం ఇల్లు కూడా మరచిపోయి ఎపి మొత్తం తిరుగుతూ పని చేశారని గుర్తుచేశారు. ఎంతోమంది పెద్దలు బిజెపిలో ఉన్నారు... వారి సహకారంతో పార్టీని ముందుకు తీసుకెళ్తానని పివిఎన్ మాధవ్ ఉద్ఘాటించారు. ఏపి బిజెపి అధ్యక్ష పదవి కీలకమైన బాధ్యత. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఏర్పడి వందేళ్లు అయిన సందర్భంలో నాకు అధ్యక్ష పదవి రావడం ఆనందంగా ఉంది. ఏపీలో బిజెపి శక్తివంతంగా ఉందని కేంద్ర పెద్దలు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపిలో వనరులు ఉన్నాయి. వాటిని పూర్తిగా వినియోగించుకుని ప్రజలకు ఉపయోగపడేలా చూడాలి. ప్రధాని నరేంద్రమోదీ ఏపికి అందిస్తున్న సహకారం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. తప్పకుండా నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. ఎంతోమంది పెద్దలు అధ్యక్షులుగా బిజెపి బలోపేతం కోసం పని చేశారు. వారి స్ఫూర్తితో నేను బిజెపిని ఏపీలో అధికారంలోకి తెచ్చే దిశగా పని చేస్తాన్న అని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎన్నికల నిర్వాహకుడిగా బెంగుళూరు ఎంపీ, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు పిసి మోహన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా పిసి మోహన్ మీడియాతో మాట్లాడారు. బిజెపి ఒక సిద్ధాంతం కోసం పని చేస్తోందని పిసి మోహన్ స్పష్టం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు అయినా, జాతీయ అధ్యక్షుడు అయినా ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకుంటామని తెలిపారు. నాయకులు, కౌన్సిల్ సభ్యుల అభిప్రాయాలకు తమ పార్టీలో విలువనిస్తామన్నారు అదే కాంగ్రెస్‌లో అంతా వన్‌మ్యాన్ షో కనిపిస్తోందని విమర్శించారు. ఎవరినీ నచ్చిన నేతలను మాత్రమే కాంగ్రెస్‌లో అధ్యక్షులను చేస్తారని అన్నారు. కాంగ్రెస్‌లో నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు విలువ ఉండదని చెప్పుకొచ్చారు. కేడర్‌తో సంబంధం లేకుండా కాంగ్రెస్‌లో రాష్ట్ర, జాతీయ అధ్యక్షులను ఎంపిక చేస్తారని తెలిపారు. బీజేపీలో ప్రజాస్వామ్యం ప్రకారం అధ్యక్షుల ఎంపిక జరుగుతుందని పిసి మోహన్ స్పష్టం చేశారు.

# 3.5 కోట్లమందికి ఉపాధి లక్ష్యం

>> రహితంగా మంజూరుకు ప్రతిపాదిస్తారు. ఈక్విటీరూపంలో కూడా ఈ సాయం అందుతుంది. స్టార్టప్‌లకు ఇదివిధంగా ఉంటుంది. జక తమిళనాడులోని పరమకుడి రామనాథపురం హైవే నాలుగులైన్ల విస్తరణకు ఆమోదం తెలిపింది.46.8 కిలోమీటర్ల నిడివికలిగిన ఈ హైవే నిర్మాణానికి రూ.1853 కోట్లు వ్యం అవుతుంది. ఉపాధికల్పన మరింతగాప్రోత్సహించేదిశగా అటు యాజమాన్యాలకుసైతం మేలుజరిగేవిధంగా కొత్త ఉపాధి అనుసంధానిత ప్రోత్సాహక పథకం (ఇఎల్ఐ)ని అమలుకు తెస్తోంది. 2024-25 బడ్జెట్‌లోనే ఈపథకం ప్రకటించారు. ఈ పథకం కింద ఐదు స్కీంలకు వర్తింపచేయాలనినిర్ణయించింది. ఉపాధి కల్పన, నైపుణ్యతర్ఫీదు, ఇతర అవకాశాలకు రెండులక్షలకోట్లతో 4.1 కోట్లమంది యువతను తీర్చిదిద్దాలని బడ్జెట్ కేటాయింపులు జరిపారు. ప్రస్తుతం రెండేళ్లలోనే 3.5 కోట్లమందికి ఉపాధి కల్పించేందుకువీలుగా 99,446 కోట్లతో ఇఎల్ఐస్కీం అమలుకు తెస్తున్నారు. ఈ మొత్తంలో 1.92 కోట్లమంది మొదటిసారిగా కొలువులు పొందినవారై ఉండాలి. 2025 ఆగస్టు ఒకటవ తేదీనుంచి 2027 జులై 31వ తేదీ మధ్య మొదటిసారి కొలువుల్లో చేరినవారికి వర్తిస్తుంది. మొదటిసారి కొలువులు పొందినవారికి ఒకనెల జీతం లభిస్తుంది. 15 వేలరూపాయలకు మించకుండా ఈ వేతనం అందుతుంది. యజమానులకు కూడా రెండేళ్లపాటు ప్రోత్సాహకాలు అందుతాయి. ఉత్పత్తి రంగానికి అయితే మరో రెండేళ్లపాటు అమలవుతుంది.యాజమాన్యాలకు నెలకు 3వేల రూపాయలు తక్కువ కాకుండా రెండేళ్లపాటు అందుతుంది. అదనంగా చేరే ఉద్యోగిని కనీసం ఆరునెలలపాటు కొనసాగించాలి. ఇందుకు సంబంధించినపూర్తి వివరాలను ఇపిఎఫ్ఓ గణాంకాలను తీసుకుంటారు. 50 మందికంటే తక్కువ ఉన్న కంపెనీల్లో కనీసం ఇద్దరు, అంతకంటే ఎక్కువమంది ఉద్యోగులున్న కంపెనీల్లో కనీసం ఐదుగురు అదనపు ఉద్యోగులను తీసుకోవాల్సి ఉంటుంది. మొదటిసారి ఉద్యోగులకు నేరుగా డిబిటి ద్వారా అందుతుంది. ఆధార్ అనుసంధానిత చెల్లింపువ్యవస్థలో చెల్లింపులు ఉంటాయి.యాజమాన్యాలకు పాన్ లింక్ అయిన ఖాతాకు చెల్లింపులు అందుతాయి. అదేవిధంగా జాతీయ స్థాయిలో కొత్త క్రీడా పాలసీని ఆమోదించారు. ఎన్ఎస్పీ2025కింద దేశంలోని మొత్తం క్రీడా వ్యవస్థలన్నింటినీ ప్రక్షాళనచేస్తారు. అంతర్జాతీయ క్రీడలను ప్రోత్సహించే పవర్‌హౌస్‌గా పనిచేస్తుంది. 2036 ఒలింపిక్ గేమ్స్‌నాటికి మొత్తంక్రీడాకారులను సిద్ధంచేయాలన్నది లక్ష్యం. కేంద్రమంత్రిత్వశాఖలు, నీతి ఆయోగ్, రాష్ట్రప్రభుత్వాలు, జాతీయ క్రీడా సమాఖ్యలు, క్రీడారంగ నిపుణుల సలహాసూచనలతో రూపొందించారు. క్షేత్రస్థాయినుంచి ఉన్నత స్థాయివరకూ పటిష్టంచేయడం. లీగ్‌లు, పోటీలు, క్రీడా మౌలికవసతులను గ్రామీణ పట్టణస్థాయిల్లో మెరుగుపరచడం, ప్రపంచస్థాయిలో శిక్షణ, కోచింగ్ ఏర్పాటు, జాతీయ క్రీడాసమాఖ్యల్లో సామర్ధ్యంపెంపు, సుపరిపాలన, క్రీడాసైన్స్, క్రీడా మెడిసిన్ టెక్నాలజీ వంటివాటిని అమలుకు తీసుకురావడం, కోచ్‌లు, సాంకేతిక సిబ్బంది, సహాయక సిబ్బందికి తర్ఫీదును ఇవ్వడం ఈక్రీడా పాలసీ ముఖ్యాంశాలు. ఈక్విటీ రూపంలో కూడా ఈ సాయం అందుతుంది. స్టార్టప్‌లకు ఇదివిధంగా ఉంటుంది. జక తమిళనాడులోని పరమకుడి రామనాథపురం హైవే నాలుగులైన్ల విస్తరణకు ఆమోదం తెలిపింది.46.8 కిలోమీటర్ల నిడివి కలిగిన ఈ హైవే నిర్మాణానికి రూ.1853 కోట్లు వ్యం అవుతుంది. ఉపాధికల్పన మరింతగా ప్రోత్సహించేదిశగా అటు యాజమాన్యాలకు సైతం మేలుజరిగేవిధంగా కొత్త ఉపాధి అనుసంధానిత ప్రోత్సాహక పథకం (ఇఎల్ఐ)ని అమలుకు తెస్తోంది.

2024-25 బడ్జెట్‌లోనే ఈపథకం ప్రకటించారు. ఈ పథకం కింద ఐదు స్కీంలకు వర్తింపచేయాలని నిర్ణయించింది. ఉపాధి కల్పన, నైపుణ్యతర్ఫీదు, ఇతర అవకాశాలకు రెండులక్షలకోట్లతో 4.1 కోట్లమంది యువతను తీర్చిదిద్దాలని బడ్జెట్ కేటాయింపులు జరిపారు. ప్రస్తుతం రెండేళ్లలోనే 3.5 కోట్లమందికి ఉపాధి కల్పించేందుకువీలుగా 99,446 కోట్లతో ఇఎల్ఐస్కీం అమలుకు తెస్తున్నారు. ఈ మొత్తంలో 1.92 కోట్లమంది మొదటిసారిగా కొలువులు పొందినవారై ఉండాలి. 2025 ఆగస్టు ఒకటవ తేదీనుంచి 2027 జులై 31వ తేదీ మధ్య మొదటిసారి కొలువుల్లో చేరినవారికి వర్తిస్తుంది. మొదటిసారి కొలువులు పొందినవారికి ఒకనెల జీతం లభిస్తుంది. 15 వేలరూపాయలకు మించకుండా ఈ వేతనం అందుతుంది. యజమానులకు కూడా రెండేళ్లపాటు ప్రోత్సాహకాలు అందుతాయి.

# 'సుప్రీం' సిబ్బందికి రిజర్వేషన్లు

>> 2025 నుంచి అమలులోకి తీసుకువచ్చింది. ఇది భారత సుప్రీంకోర్టులో పరిపాలనా పనితీరులో భారీ మార్పును సంకేతంగా నిలుస్తున్నది. అయితే, ఈ రిజర్వేషన్లు న్యాయమూర్తులకు వర్తించదు. రిజిస్ట్రార్, సీనియర్ పర్సనల్ అసిస్టెంట్, అసిస్టెంట్ లైబ్రేరియన్, జూనియర్ కోర్ట్ అసిస్టెంట్, ఛాంబర్ అటెండెంట్ తదితర పోస్టులకు మాత్రమే రిజర్వేషన్ వర్తిస్తుంది. సుప్రీంకోర్టులో రిజర్వేషన్ కింద మూడు కేటగిరీలు ఉంటాయి. అవి ఎస్సీ, ఎస్టీ, నాన్‌రిజర్వ్‌డ్. రిజర్వేషన్ల అమలుపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ సంస్థలు, వివిధ హైకోర్టుల్లో రిజర్వేషన్ విధానం వర్తిస్తే సుప్రీంకోర్టు మాత్రమే ఎందుకు మినహాయింపుగా ఉండాలి, మనవిలువలు.. మనచర్యలకు అద్దం పట్టాల న్నారు. జూన్ 24న జారీచేసిన సర్క్యులర్‌ప్రకారం, షెడ్యూల్ కులాలు (ఎస్సీ) ఉద్యోగులకు సుప్రీం కోర్టులో 15శాతం రిజర్వేషన్లు లభించనుండగా షెడ్యూల్‌తెగలు (ఎస్టీ) వర్గానికి 7.5శాతం రిజర్వేషన్లు అమలవు తాయి. రోస్టర్ లేదంటే రిజిస్టర్‌లో తప్పులు లేదా సరికాని వాటి గురించి ఉద్యోగులు ఎవరైనా అభ్యంతరాలు లేవనెత్తాల్సివస్తే వాటి గురించి రిక్రూట్‌మెంట్ రిజిస్ట్రార్‌కు తెలియజేయవచ్చని సర్క్యులర్ పేర్కొంది.

## షరతులతో బెయిలు

>> బెయిల్ రావడంతో ఐంతవరకూ వంశీపై నమోదైన అన్ని కేసుల్లోనూ ఆయనకి బెయిల్ మంజూరు అయినట్లయింది.దీంతో రేపు (బుధవారం) జిల్లా జైలు నుంచి వంశీ విడుదలయ్యే అవకాశం ఉంది. ఇంత కాలం రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీకి తాజా తీర్పు భారీ ఉపశమనమనే చెప్పాలి. అయితే, వంశీ బెయిల్ రద్దు చేయాలని సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. సదరు పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరుగనుంది.

## చెవిరెడ్డి, వెంకటేష్

>> చెవిరెడ్డి ఏ 38గా ఉండగా, వెంకటేష్ నాయుడు ఏ 34గా ఉన్నారు. ఐదు రోజుల పాటు చెవిరెడ్డిని కస్టడీకి ఇవ్వాలని సిట్ కోరినప్పటికీ కేవలం మూడు రోజుల పాటు కస్టడీకి మాత్రమే అనుమతి ఇచ్చింది కోర్టు. అలాగే జైలులోని దేవాలయానికి వెళ్లేందుకు చెవిరెడ్డికి పది నిమిషాల పాటు అనుమతి ఇచ్చింది. కానీ బయట ఆహారం పంపేందుకు మాత్రం ఎమ్మెల్యే అభ్యర్థనను మాత్రం న్యాయస్థానం తోసిపుచ్చింది.మద్యం కుంభకోణం కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. తాజాగా చెవిరెడ్డి పీఏలు బాలాజీ, నవీన్‌లను కూడా సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో తెలంగాణ నుంచి ఏపీ సరిహద్దుల్లో రూ. 8.2 కోట్లు తరలించారని వీరిపై అభియోగాలు ఉన్నాయి.

# సర్కార్‌తోనే ఎపి అభివృద్ధి

>> చేపట్టిన సందర్భంగా సోము వీర్రాజు మీడియాతో మాట్లాడారు. మాధవ్ తండ్రి చలపతిరావు ఉమ్మడి ఏపీలో బీజేపీ అధ్యక్షుడిగా పని చేశారని గుర్తుచేశారు. తండ్రి అడుగుజాడల్లో నడిచిన మాధవ్ బీజేపీ కోసం పనిచేశారని తెలిపారు. ఇప్పుడు మాధవ్ కూడా ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని చెప్పుకొచ్చారు. నాడు తండ్రి, నేడు తనయుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేయడం గొప్ప విషయమని ఉద్ఘాటించారు.బీజేపీలో కుటుంబ రాజకీయాలు ఉండవని సోము వీర్రాజు స్పష్టం చేశారు. మాధవ్ వ్యక్తిగతంగా నిజమైన రాజకీయ నాయకుడిగా ఎదిగారని అన్నారు. ఆయన ఆలోచనల్లో ఒక వాణి, ఒక వాణి ఉంటుందని ప్రశంసించారు. తాను మాధవ్‌ను ఎప్పటి నుంచో గమనిస్తున్నానని అన్నారు. ఆయన పని తీరును ఇప్పుడు అందరూ చూస్తారని తెలిపారు. మాధవ్ నేతృత్వంలో ఏపీలో బీజేపీ తప్పకుండా బలోపేతం అవుతుందని చెప్పుకొచ్చారు. మాధవ్ అధ్యక్షుడిగా పూర్తి స్థాయి సామర్థ్యం ఉన్న నేత మాధవ్ అని కొనియాడారు. దేశం ధర, దిశ మార్చేలా దీక్షతో పని చేసే పార్టీ బీజేపీ అని అభివర్ణించారు. ఏపీలో బీజేపీ తప్పకుండా అధికారంలోకి వచ్చి తీరుతుందని సోము వీర్రాజు ధీమా వ్యక్తం చేశారు.

# ప్రజలకు అందుబాటులో ఉండండి

## పార్టీ యువ కార్యకర్తలతో మాజీ సిఎం జగన్

**విజయవాడ జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజకీయంగా ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఏనాడూ రాజీ పడలేదు అని మాజీ సీఎం వైఎస్ జగన్ అన్నారు. ఎన్నికలప్పుడు వచ్చినా వైసీపీలో విలువలు, విశ్వసనీయతకు పెద్దపీట వేశామన్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నిలదీయడంలో యువతది కీలక పాత్ర పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండడం చాలా ముఖ్యం అని సమస్య వచ్చినప్పుడు ప్రజలకు తోడుగా నిలబడాలని జగన్ సూచించారు. తాడేపల్లిలోని వైఎస్సీపీ కేంద్ర కార్యాలయంలో యువజన విభాగం ప్రతినిధులతో జగన్ సమావేశం అయ్యారు. ఈసమావేశానికి యూత్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, యూత్ వింగ్ సభ్యులు , పార్టీ ముఖ్య నేతలు హాజరయ్యారు. యువతకు తాజా రాజకీయ పరిణామాలు భవిష్యత్ కార్యాచరణపై జగన్ దిశానిర్దేశం చేశారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నిలదీయడంలో యువతది కీలక పాత్ర. పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలి. లీడర్లుగా ఎదిగేందుకు ఇప్పుడు మంచి అవకాశం. పార్టీ ప్రారంభించిన కొత్తలో అందరూ కొత్తవాళ్లే . పార్టీ పెట్టిన కొత్తలో నేను, మా అమ్మ మాత్రమే ఉన్నాం. నామీద వ్యక్తిగతంగా అభిమానం ఉన్నవాళ్లు నాతో వచ్చారు. నా ప్రస్థానం అక్కడ నుంచి మొదలయ్యింది. ఎన్నికలప్పుడు వచ్చినా విలువలు, విశ్వసనీయతకు పెద్దపీట వేశాం.పోర్టిమెంటులో ప్రతి సభ్యుడూ మనవైపు చూసే పరిస్థితి. దాన్ని జీర్ణించుకోలేక మనమీద పగబట్టారు.ప్రజలకు చంద్రబాబు పాలనలోని దోళ్లతనం అర్థమయిపోయింది.మన పాలనకు కూటమి ప్రభుత్వానికి తేడా ప్రజలు గమనిస్తున్నారన్నారు.

# సింగయ్య మృతికేసులో జగన్‌కు ఊరట

**విజయవాడ, జులై1,ప్రభాతవార్తప్రతినిధి:**సింగయ్య మృతి ఘటనలో వైఎస్సార్‌సీపీ పార్టీ అధినేత జగన్‌కు ఊరట లభించింది. ఈ కేసులో జగన్ ఇతరులపై నమోదైన కేసులో ఏపీ హైకోర్టు రెండు వారాల పాటు స్టే విధించింది. ఈ కేసులో రెండు వారాల పాటు తదనంతర చర్యలు తీసుకోవద్దని పోలీసులకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసును కొట్టివేయాలంటూ జగన్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. తమ వద్ద ఉన్న వీడియో ఆధారాలు, ఇతర సాక్ష్యాలు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ముందు ఉంచేందుకు రెండు వారాల సమయం కావాలని కోర్టును అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కోరారు. ఇప్పటికే ఈ కేసులో బీఎన్ఎస్ కింద 105 సెక్షన్‌కు మార్చారని పిటిషనర్ తరపు న్యాయవాదులు వాదించారు. అందువలన తదనంతర చర్యలు, అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కోర్టును జగన్ తరపు న్యాయవాదులు కోరారు. దీంతో రెండు వారాల పాటు తదనంతర చర్యలపై హైకోర్టు స్టే విధించింది.

# డాక్టర్ల పాత్ర అద్వితీయం


>> వ్యవస్థ దెబ్బతిందని, కూటమి ప్రభుత్వం ఈ పరిస్థితిని చక్కదిద్ది మార్పు తీసుకొచ్చిందన్నారు. దానివల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ సేవలు ఎంతో పెరిగాయన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు ఆనవరమైన మేరకు ప్రణాళికల్నాన్ని ప్రక్షాళించటంలో చేయవల్సింది చాలా ఉందని, ఆ మేరకు చర్యలు చేపట్టడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

వేదకాలంలోనే మన మహిళలు ఎంతో ముందున్నారని పురాణాల్లో మహిళలకు గుర్తింపు ఉందని అందుకే చదువు విషయంలో సరస్వతిని, ఐశ్వర్యం విషయంలో లక్ష్మీ దేవి పూజలు అందుకోవడం దీనికి నిదర్శనం అన్నారు. కరోనా సమయంలో అందరూ ఇంటికే పరిమితం అయితే డాక్టర్లు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆసుపత్రుల్లో సేవలు అందించారని, ఎంతో మంది తమ ప్రాణాలను సైతం పోగొట్టుకున్నారన్నారు. సమాజానికి డాక్టర్ల అవసరం ఎంతైనా ఉందని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో వారి పాత్ర నిర్మాణాత్మకమైనదన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఆసుపత్రుల నిర్వహణ అధ్వాన్నంగా ఉండటంతో పాటు సరిగా తమ విధులను కూడా నిర్వర్తించని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో సమస్యలు చేసి వాటిని సరిదిద్దామన్నారు.2047 నాటికి ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధన దిశగా కూటమి ప్రభుత్వం వ్యూహాలు రూపొందించిందన్నారు. ప్రసవ సమయంలో మాత్ర మరణాలు, శిశు మరణాలు, ఆరోగ్య భద్రత విషయంలో రాష్ట్రంలో పరిస్థితి మెరుగ్గానే ఉందన్నారు. రాష్ట్ర ప్రజల సగటు ఆయుష్షును ప్రస్తుతం ఉన్న 71 సంవత్సరాల నుండి 85 కు పెంచాల్సి ఉంటుందన్నారు. ప్రసూతి మరణాలను 45 శాతం నుండి 5 శాతం కు, శిశు మరణాలను 24 శాతం నుండి 2 శాతంకు తగ్గించాలని, గర్భస్థ మహిళల్లో బలహీనులుగా ఉన్నవారి సంఖ్యను 34 నుంచి 4 తగ్గించేందుకు లక్ష్య ప్రణాళికలను రూపొందించామన్నారు.సాధారణ బదిలీల్లో భాగంగా వైద్య రోగ్య శాఖ పరిధిలో పారదర్శకంగా, వివాదరహితంగా జరిగిన బదిలీలు కూటమి ప్రభుత్వం మొదటి ఏడాదిలో తెచ్చిన మార్పుకు సంకేతమన్నారు. గత ప్రభుత్వ కాలంలో జరిగిన బదిలీలపై పలు ఆరోపణలు, అక్రమాలు, రాజకీయ జోక్యంపై పలు ఆరోపణలు వచ్చాయని, కూటమి ప్రభుత్వం స్పష్టమైన నియమ నిబంధనలతో వాటికి అడ్డుకట్ట వేసిందన్నారు.

**విశిష్ట సేవలందించిన 10 మంది వైద్యులకు సత్కారం**

జాతీయ డాక్టర్స్ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో భాగంగా వివిధ విభాగాల్లో మూడు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలందించిన పది మంది వైద్యులను మంత్రి సత్య కుమార్ యాదవ్ ఘనంగా సత్కరించారు. వీరిలో వర్షి శ్రీ పుల్వోట్ల గ్రోవర్ ప్రభుత్వ న్యూరాలజిస్ట్, కర్నూలులో జన్మించిన డా.వడ్డి శ్రీ వాత్సవ్, ప్రస్తుత డి.యమ్.ఈ, ప్రభుత్వ శస్త్ర చికిత్స నిపుణులు డా.నరసింహం ఉన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరి మాట్లాడుతూ సమాజానికి వైద్య సేవలు అందించడంలో డాక్టర్లు ఎప్పుడూ ముందుంటారన్నారు. కరోనా విపత్తు సమయంలో కూడా వారు తమ బాధ్యతలను నెరవేర్చారన్నారు.డా. ఎన్ టి ఆర్ వైద్య విజ్ఞాన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. పి. చంద్ర శేఖర్ మాట్లాడుతూ మొదటిసారి జాతీయ డాక్టర్స్ దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇది డాక్టర్లను గౌరవించుకోవడమేనని దీనిని భవిష్యత్తులో కూడా కొనసాగించాలని కోరారు. డా.బి.సి.రాయ్ జన్మదినోత్సవాన్ని డాక్టర్స్ దినోత్సవంగా జులై 1న జరుపుకుంటున్నామన్నారు. డా. ఎన్ టి ఆర్ వైద్య విజ్ఞాన యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. వి. రాధికా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం లోని అన్ని ప్రాంతాలకు చెందిన పది మంది ఉత్తమ డాక్టర్లను ఎంపిక చేసి సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సత్కారం రాబోయే యంగ్ జనరేషన్ కు స్ఫూర్తి దాయకంగా ఉంటుందన్నారు. వచ్చుకి డా. ఎమ్. వి. పద్మావత్సవ వద్మావత్సవ మాట్లాడుతూ వద్మల ప్రాంతాలలో పోల్చుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో వచ్చే బ్రెయిన్ ఎటాక్స్ కు వైద్య సేవలు పెంచాల్సి ఉందన్నారు. నగరాల్లో ఉన్న పెద్ద ఆసుపత్రుల్లో బ్రెయిన్ ఎటాక్స్ కు వైద్య సేవలు లభిస్తున్నాయన్నారు. వెనుకబడిన ప్రాంతాల్లోని చిట్టచివరి మైలు వరకూ కూడా వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏ. వెంకటేశ్వరరావు, డీఎమ్‌ఈ అకడమిక్ డాక్టర్ జి. రఘునందనరావు, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# పట్టాభిరామ్ కన్నుమూత

>> రుడు ప్రశాంత్ ఉన్నారు. పట్టాభిరామ్ భార్య కూడా వ్యక్తిత్వ వికాస నిపుణురాలిగా పేరు పొందారు. ఖైరతాబాద్‌లోని స్వగృహంలో పట్టాభిరామ్ పార్థివదేహాన్ని ఉంచారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి అభిమానుల సందర్శనార్థం ఉంచనున్నారు. మధ్యాహ్నం 3గంటలకు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

1949లో బివి పట్టాభిరామ్ జన్మించారు. ఆయన స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా. ఆయన తండ్రి పేరు 'రావ్ సాహెబ్' భావరాజు సత్యనారాయణ. సంతానంలోని పదిమంది సంతానంలో ఒకరు. కొమారు దశలో కాలి వైకల్యం కారణంగా..ఆత్మన్యూనతా భావాన్ని జయించి తనని తాను ఇంద్రజాలికుడిగా, రచయితగా తీర్చిదిద్దుకున్నారు. కాకినాడలో ఉన్నత విద్య చదువుతున్న రోజుల్లో ఎంబెర్ రావు అనే ఇంద్రజాలికుడి నుంచి ఆ విద్యను నేర్చుకున్నారు.ఆ తర్వాత హైదరాబాద్ లోని ఆహార సంస్థలో ఉద్యోగం చేసే రోజుల్లోనూ సాధన చేసేవారు. 1970 దశకం నాటికి స్వతంత్రంగా రెండుమూడు గంటలపాటు ప్రేక్షకులను కదలనీయకుండా ఇంద్రజాలం ప్రదర్శించే స్థాయికి పట్టాభిరామ్ ఎదిగారు.

**ప్రజలను జాగృతం చేస్తూ..**

1984లో హైదరాబాద్‌లో కళ్లకు గంతలు కట్టుకుని రవీంద్రభారతి నుంచి చార్మినార్ వరకు స్కూటర్ నడిపి ఇంద్రజాల విద్యలో తెలుగునేలపై కొత్త అధ్యాయాన్ని సృష్టించారు. చేతబడి వంటి మూఢనమ్మకాలపై ప్రజలను జాగృతం చేసే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. హిప్నాటిజాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చి పలు రుగ్మతలను పోగొట్టవచ్చని నిరూపించారు. అప్పటి సిఎం ఎన్టీఆర్ ప్రోత్సాహంతో ఇంద్రజాలాన్ని జోడించి ప్రభుత్వ పథకాలకు, మద్యపాన నిషేధం వంటి కార్యక్రమాలకు ప్రచారం కల్పించారు. గోదావరి వరద బాధితుల కోసం ప్రదర్శనలు ఇచ్చి తన మానవత్వాన్ని చాటుకున్నారు. బీవీ పట్టాభిరామ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డి పట్టా పొందిన తర్వాత సైకాలజీ, ఫిలాసఫీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పోస్టుగ్రాడ్యుయేట్ పట్టా అందుకున్నారు. ఇండియాలోనే కాకుండా అమెరికా, ఆస్ట్రేలియా, మలేషియా, థాయ్‌లాండ్, సింగపూర్, అరబ్ దేశాలలో అనేక వర్క్ షాపులు, ప్రదర్శనలు ఇచ్చారు. హిప్నాసిస్‌పై పట్టాభిరామ్ చేసిన కృషికి గాను 1983లో ఫ్లోరిడా యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసి సత్కరించింది. ఆయన తెలుగుతో పాటు ఇంగ్లీష్, కన్నడ, తమిళ భాషల్లో రచనలు చేశారు. ఆయన రాసిన పుస్తకాల్లో 'కష్టపడి చదవొద్దు..ఇష్టపడి చదవండి' 'జీనియస్ మీరు కూడా'..'విజయం మీదే' తదితర రచనలకు పాఠకుల నుంచి విశేష ఆదరణ దక్కింది. దూరదర్శన్‌లో కొన్ని సీరియళ్లతోపాటు పలు సినిమాల్లో నటించారు.జంధ్యాల దర్శకత్వంలో రూపొందిన 'రెండురెళ్లు ఆరు' చిత్రంలో ఆయన నటించారు.

**చంద్రబాబు, బండి సంజయ్, లోకేశ్ సంతాపం..**

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు పట్టాభిరామ్ మృతికి ఏపి సిఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఏపి మంత్రి నారా లోకేష్‌లు సంతాపం ప్రకటించారు. ఇంద్రజాలికుడిగా, హిప్నాటిస్టుగా, సైకాలజిస్ట్ ట్రైనర్‌గా ఎంతోమందికి ఆయన సేవలందించారని పేర్కొన్నారు. పట్టాభిరామ్ ఆకాల మరణం చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు. పట్టాభిరామ్ ఆకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఐదు దశాబ్దాలపాటు సమాజానికి ఆయన సేవలందించారని అన్నారు. పట్టాభిరామ్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## వారం - వర్జ్యం

**తేది : 02-07-2025, బుధవారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**ఆషాఢ మాసం, ఉత్తరాయణం,**
**గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం**

సప్తమి ఉ.12.01
ఉత్తరఫల్గుణి ఉ.11.09
వర్జ్యం రా.8.30-10.17
దు.ఉ. 11.46-12.38
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

మేషం : కొత్త కార్యక్రమాలు చేపట్టినా సంతృప్తికరంగా సాగవు. మిత్రు లతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

వృషభం : నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది.

మిథునం: మీ మాటకు విలువ పెరుగుతుంది. కోర్టు కేసులు పరిష్కారమవుతాయి.

కర్కాటకం : దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

సింహం : పోటీపరీక్షలు, ఇంటర్వ్యూల్లో విజయం సాధిస్తారు. అనుకున్న సమస్యలు ఎదురౌతాయి.

కన్య : కొత్త కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా పూర్తి చేస్తారు. సంఘంలో ప్రత్యేక గుర్తింపు పొందుతారు.

తుల: పెట్టుబడుల్లో తొందరపాటు వద్దు. సమస్య వ్యక్తులే సమస్యలు సృష్టించవచ్చు.

వృశ్చికం: ఆరోగ్య, కుటుంబ సమస్యల నుండి కొంతవరకు బయటపడతారు. పెట్టుబడుల విషయంలో తొందరపాటు వద్దు.

ధనుస్సు: ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. విలువైన వస్తువులు, ఆభరణాలు కొంటారు. లాభాలు చేస్తారు.

మకరం: నూతన వ్యవహారాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. ఇతరుల విషయాలలో జోక్యం తగదు.

కుంభం : అన్ని విషయాలలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఉద్యోగాలలో ఇంక్రిమెంట్లు, పదోన్నతులు పొందుతారు.

మీనం:వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఒడిదుడుకులు కొంతవరకు తీరుతాయి. ఆకస్మిక ఖర్చులు ఉంటాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కొం, హైదరాబాద్

# తక్షణమే స్పందిస్తాం

>> సీటు అప్పుడు సామాజిక తీసుకెళ్లి సీట్ అలాట్ మెంట్‌కు సంబంధించి నకిలీ లేఖను చేతిలో పెట్టి మోసం చేశారు. నగదును తిరిగి ఇవ్వాలని కోరగా సరైన సమాధానం రాకపోవడంతో మోసం చేశారని, తమకు రావాల్సిన నగదును తిరిగి ఇప్పించాలని మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మంగళగిరి నియోజకవర్గం కంతేరులో తమ కుటుంబానికి చెందిన 0.70 ఎకరాల వ్యవసాయ భూమిని ఐదేళ్ల క్రితం విక్రయించామని, అయితే పొలం విక్రయం తాలూకా బాకీ ఉన్న రూ.12 లక్షల నగదు ఇవ్వకుండా గ్రామానికి చెందిన విష్ణు, రాము తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని ఉండవల్లికి చెందిన కల్లం విజయలక్ష్మి మంత్రి నారా లోకేష్ ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారం లేని తమకు తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఎస్ఎంఏ(స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ) అనే ప్రాణాంతక జన్యు వ్యాధితో బాధపడుతున్న తమ 9 నెలల బాలుడికి వైద్యసాయం అందించి చిన్నారి ప్రాణాలు కాపాడాలంటూ ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామానికి చెందిన జొన్నాద సాయిరాం విజ్ఞప్తి చేశారు. ప్రతి 10వేల మందిలో ఒకరు ఎస్ఎంఏతో జన్మిస్తారని, ప్రపంచంలో ఖరీదైన జోల్ జెన్ స్మామందు ఒక్కటే నివారణ అని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కోట్ల ఖరీదు చేసే ఇంజక్షన్ అయినందున సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన తమకు ఆ ఇంజక్షన్ కొనుగోలు చేసే ఆర్థికస్తోమత లేదని కన్నీటిపర్యంతమయ్యారు. ప్రభుత్వం తరపున వైద్యసాయం అందించి తమ చిన్నారిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

# తిరుమల సమాచారం

## ఆయుర్వేదఫార్మశీలో అక్రమాలపై విచారణ చేయండి



### - టిటిడి సివిఎస్ఒకు బోర్డుసభ్యుడు భాను ఫిర్యాదు

**తిరుమల,జూలై 1ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ తిరుమలతిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలోని శ్రీనివాస ఫార్మశీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం టిటిడి పరిపాలన భవనంలో సివిఎస్ఒ కెవి మురళీకృష్ణను కలసి స్వామివారి ఖజానాకు గండి కొట్టిన వారిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. తిరుమల తిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలోని చంద్రగిరి శ్రీనివాసమంగాపురం వద్ద శ్రీనివాస ఆయుర్వేద ఫార్మసీ నిర్వహిస్తోంది. ఈ ఆయుర్వేద ఫార్మసీకి 2022వ సంవత్సరంలో అప్పటి టిటిడి బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి నేతృత్వంలో ఆయుర్వేద మందులతయారీకి అవసరమైన యంత్రాలను కొనుగోలు చేసిందన్నారు. ఆయుర్వేద మం దులు, పౌడర్, మాత్రలు తయారీకి ఈ యంత్రాలు అవసరమవు తాయని అప్పటి పాలకమండలి ఆమోదించి కొనుగోలు చేయించింది. అవసరమైన అన్ని రకాల యంత్రాలనుయ కొనుగోలు చేయడానికి 3.90 కోట్ల రూపాయలు నిధులు మంజూరుచేశారు. హైదరాబాద్‌లోని తేజ స్టీల్ కార్పొరేషన్ నుండి ఇవన్నీ కొనుగోలుచేశారు. అయితే ఇవన్నీ కొత్తవి కాదని అప్పట్లోనే ఈ యంత్రాలన్నీ పనిచేయకండా తుప్పుపట్టాయని ఆరోపిం చారు. ఈ కారణంగా శ్రీవారి ఖజానాకు భారీగా నష్టంవాటిల్లిందని,
ఆ యంత్రాలన్నీ ఇప్పుడు పనిచేయడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై సమగ్ర విచారణ జరిపి భక్తుల కానుకలను దుర్వినియోగం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో పోలవరం, బనకచర్ల పూర్తి కావాలి

### - మంత్రి కొల్లు రవీంద్ర



**తిరుమల,జూలై 1ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో రాష్ట్రంలో పోలవరం, బనకచర్ల సాగు,తాగునీరు అందించే ప్రాజెక్టులు పూర్తిచేసే శక్తిసామర్థ్యాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇవ్వాలని వేడుకున్నట్లు రాష్ట్రమంత్రి కొల్లురవీంద్ర తెలిపారు. రాయలసీమ ప్రాంతానికి సాగు,తాగునీరందించే అవకాశం కలుగుతుందన్నారు. శ్రీవారి ఆశీస్సులతో పూర్తికావాలని కోరుకున్నానన్నారు. రాష్ట్రమంత్రి రవీంద్ర మంగళవారం ఉదయం శ్రీవారికి తలనీలాలు సమర్పించారు. విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని దేవదేవుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వైష్ణవయాత్రాస్ నకిలీ వ్యక్తులను నమ్మొద్దు :టిటిడి విజ్ఞప్తి

**తిరుమల,జూలై 1ప్రభాతవార్తప్రతినిధి:** పెద్దింటి ప్రభాకరాచార్యుల పేరుతో వైష్ణవయాత్రాస్ పేస్ బుక్ పేజీని నడుపుతున్న వ్యక్తి శ్రీవారి అభిషేకం, ఆర్జితసేవలు, విఐపి బ్రేక్, 300 రూపాయలు దర్శన టిక్కెట్లు కల్పిస్తామంటూ ప్రచారం చేయడం నమ్మొద్దని టిటిడి విజ్ఞప్తి చేసింది. తమ దృష్టికి వచ్చిన ఈ విషయాన్ని భక్తులను అప్రమత్తం చేస్తూ టిటిడి ఒక ప్రకటన విడుదల చేసింది. నకిలీ వ్యక్తులు, నకిలీ వెబ్‌సైట్లను నమ్మి మోసపోకూడదని, టిటిడి అధికారిక వెబ్‌సైట్ ద్వారానే దర్శన,వసతి టిక్కెట్లు బుక్ చేసుకోవాలని భక్తులకు టిటిడి విజ్ఞప్తి చేసింది.

శ్రీవారి దర్శ నాల పేరుతో టిక్కెట్లను ఇస్తామని భక్తులను మోసం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని టిటిడి హెచ్చరించింది.

## జగ్గయ్యపేటలో దారుణం.. కొడుకుని కడతేర్చిన తండ్రి!

**విజయవాడ జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్ పేట గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. మద్యం మత్తులో తల్లిదండ్రులను వేధిస్తున్న కుమారుడిని కన్న తండ్రే కడతేర్చాడు. సోమవారం రాత్రి జరిగిన కొట్లాటలో కసాయి కొడుకుని తండ్రి హతమార్చాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం గోళ్ల వెంకటనారాయణ కు 15 ఏళ్ల క్రితం కృష్ణ కుమారితో వివాహం అయింది . అతడికి ఓ కుమారుడు కుమార్తె ఉన్నారు. ఐదేళ్ల క్రితం భార్య కృష్ణ కుమారి వదిలేసి వెళ్లిపోవడంతో వెంకటనారాయణ తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. వెంకటనారాయణ గత కొన్ని రోజులుగా మద్యం తాగి తల్లిదండ్రులపై దాడి చేస్తున్నాడు. కుమారుడి ప్రవర్తనపై తల్లిదండ్రులు విసుగు చెందారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో బాగా మందు తాగి వచ్చిన వెంకటనారాయణ తల్లిదండ్రులను కొట్టాడు. ఈ క్రమంలో తండ్రి గోళ్ల కృష్ణ కుమారుడినిచెక్క మొద్దుతో కొట్టాడు. దాంతో వెంకటనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 2 లక్షల మందికి త్వరలో భాగస్వామి పింఛన్లు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**బొండపల్లి, (విజయనగరం జిల్లా); జులై 1 (ప్రభాతవార్త) ;** రాష్ట్రంలో సుమారు 2 లక్షల మందికి త్వరలో భాగస్వామి (స్పౌస్) పింఛన్లను మంజూరు చేయనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. జిల్లాలోని బొండపల్లి మండలం అంబటివలసలో మంగళవారం ఉదయం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి మంత్రి శ్రీనివాస్ శ్రీకారం చుట్టారు. ముందుగా విభిన్న ప్రతిభావంతులు గ్రంధి స్వాతి, పి.ఇందిర, పాలూరు తేజ, తాళ్లపూడి దమరులక్ష్మి తదితరులకు రూ.6వేలు చొప్పున పింఛన్ అందజేశారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ 2019 నుంచి 2024 మధ్య మరణించిన పింఛన్‌దారులు (భార్య లేదా భర్త) పింఛన్‌ను వారి జీవిత భాగస్వామికి ఇవ్వడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. సుమారు ఇటువంటి 2 లక్షల పింఛన్లను త్వరలో మంజూరు చేస్తామని మంత్రి ప్రకటించారు. ఇప్పటికే రాష్ట్రంలో సుమారు 62.82 లక్షల మందికి రూ.2,712 కోట్లు పింఛన్ రూపంలో చెల్లిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో 2,70,847 మందికి రూ.114.84 కోట్లను చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఏడాదికి 3 గ్యాస్ సిలండర్లను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. పేద పిల్లల చదువు కొనసాగేందుకు ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తున్నామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా దూసుకుపోతోందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, డిపిఎం రవికుమార్, ఎంపిడిఓ గిరిబాల, తాహసీల్దార్ రాజేశ్వర్రావు, ఏపిఎం కె.పెంటంనాయుడు, కోరాడ కృష్ణ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# వడ్డీకాసులవాని దర్శనానికి గణనీయంగా పెరిగిన భక్తులు

### -24.08లక్షల మంది దర్శనం, రూ.116.86 కోట్లు హుండీ ఆదాయం

**తిరుమల,జూలై 1ప్రభాతవార్తప్రతినిధి:** ఆపదమొక్కులవాడు,ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామిని జూన్‌నెలలో అత్యధికంగా 24.08లక్షలమందికిపైగా భక్తులు దర్శనం చేసుకున్నారు. భక్తుల సంఖ్యకు తగ్గట్లు తమ మొక్కుబడుల్లో భాగంగా కానుకల రూపంలో హుండీకి 116.86కోట్లు రూపాయలు ఆదాయం లభించింది. గత ఏడాది జూన్‌నెలకంటే భక్తుల సంఖ్య 2లక్షమంది అదనంగా దేవదేవుడిని దర్శనం చేసుకోవడం విశేషం. ముఖ్యంగా జూన్‌నెలలో గురు,శుక్ర,శనివారాల్లో అదనంగా మరో పదివేలమందికిపైగా భక్తులకు ఆయా రోజుల్లో శ్రీవారి దర్శనం చేసుకునేలా చూడటం ఈ రికార్డుస్థాయి దర్శనాలకు కారణమైంది. గత ఏడాది జూన్‌నెలలో 113.65కోట్ల రూపాయలు కానుకల ద్వారా హుండీ ఆదాయం నమోదైంది.ఈ ఏడాది జూన్‌లో 116.86కోట్ల రూపాయలు (3.25కోట్ల అదనంగా )రాబడి లభించింది. ఏడుకొండల వేంకటేశ్వర స్వామి దర్శనాలకు దేశవిదేశాల నుండి తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య నెలనెలా రెట్టింపవుతోంది. గడచిన జూన్‌నెలలో వేసవిసెలవుల రద్దీ కొన సాగడంతో భారీగా భక్తులు ఇష్టదైవం దర్శనానికి తరలిరావడం జరిగింది. జూన్‌నెలకు సంబంధించి 30రోజుల హుండీ ఆదాయం కూడా వందకోట్లు దాటడం విశేషం. రోజుకు లక్షమంది వరకు భక్తులు కొండకు చేరు కుంటుండగా 80వేలమందివరకు దర్శనం చేసుకోగలుగుతున్నారు. హిందూ భక్తులు తమ కష్టాల్లో, ఆపదల్లో ముడుపుగా కట్టిన మొక్కులు చెల్లించుకునేందుకు కానుకల రూపంలో హుండీలో నగదు,నగలు సమర్పిస్తున్నారు. ఈ ఆదాయం పరిగణనలోనికి తీసుకునే టిటిడి వార్షిక బడ్జెట్ రూపకల్పన చేస్తుంది. గడచిన జూన్ నెలకు సంబంధించి హుండీ ఆదాయం గమనిస్తే జూన్30వతేదీ హుండీ ద్వారా 5.30కోట్లు రూపాయలు, 20వతేదీ 4.88కోట్లు రూపాయలు, 23న 4.72కోట్లు,జూన్ 15వతేదీ 4.52కోట్లు, 16న 4.43కోట్లు రూపాయలు,29న 4.34కోట్లు ,21న 4.30కోట్లు,11న 4.30కోట్లు,జూన్ 3న 4.29కోట్లు ఇలా వరుసగా 4కోట్లరూపాయలు దాటిన రోజులే ఎక్కువ. ఆ నెలలో వరుసగా సరాసరి 3.40కోట్ల రూపాయల పైగానే ఆదాయం చేకూరడంతో 30రోజులకు సంబంధించి 116.86కోట్ల రూపాయలు మార్కును అధిగ మించింది. ఏకంగా వడ్డీకాసుల వెంకన్నకు రానున్న మూడు నాలుగునెలలు కూడా కీలకమే. స్వామివారి హుండీ ఆదాయం మరింత రెట్టింపయ్యే సూచనలు ఉంటుందనేది టిటిడి వర్గాల అభిప్రాయం. జూన్‌నెలలో పలు రకాలుగా తిరుమలకు చేరుకుని తమ ఇష్టదైవాన్ని దర్శించుకున్న భక్తుల సంఖ్య 24,08,781లక్షల మంది వరకు చేరింది. జూన్ 28వతేదీ 90,051మందికి భక్తులకు వెంకన్న దర్శనం చేయించారు. 21న 90,087 మందికి, 14న 91,720మందికి, జూన్ 8న 90,802మంది, 15వతేదీ 90,815మంది, 29న 88,497మంది, 22న 87,254 మంది భక్తులకు,24న 79,466మంది భక్తులకు,17న81,037మంది భక్తులకు ఇలా సరాసరి రోజువారీగా 75వేల మంది వరకు భక్తులు మహాలఘులో ఏడుకొండల వేంకటేశ్వరుని దర్శనం చేసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయం వెలుపల క్యూలైన్లు చేరినా టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామ కృష్ణ స్వయంగా పర్యవేక్షించారు.

## వైద్యుల సేవలు అమూల్యమైనవి: డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

విజయవాడ జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి: వైద్యుల సేవలు అమూల్యమైనవని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ "ఎక్స్" వేదికగా వ్యాఖ్యానించారు.తమ ముందుకు ఆరోగ్యపరమైనసమస్యలతో వచ్చేవారికి మెరుగైన వైద్యం అందించి స్వస్థత కలిగించేందుకు ప్రతి వైద్యుడు ఎంతో తపిస్తారు. క్లిష్టమైన అనారోగ్య సమస్యలతో ఉన్న రోగులకు సైతం పునఃజన్మ ఇచ్చేందుకు ఆసుపత్రి బల్లపై చిన్నపాటి యుద్ధమే చేస్తారు. వైద్యులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవి. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు.ప్రజలకు వైద్యులంటే ఎనలేని గౌరవమర్యాదలుంటాయి. మన సంస్కృతి వైద్యుడిని మరో భగవంతుడిగా చూడటం నేర్పించింది. వైద్యులు వృత్తి పరంగా పట్టణాలు, నగరాలు, ఇతర ప్రధాన ప్రాంతాల్లో ఉన్నా సామాజిక సేవా దృక్పథంలో మూరుమూల గ్రామాలు , గిరిజన ప్రాంతాలనూ సందర్శిస్తూ వైద్య సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.కోవిడ్ సమయంలో సేవలందించిన డాక్టర్లకు హృదయపూర్వక అభినందనలు. ప్రాణాలు కోల్పోయిన డాక్టర్లకు ఘన నివాళి. డాక్టర్లపై దాడులు చేయడం ఏమాత్రం క్షమార్హం కాదు. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణంలో డాక్టర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు.

డాక్టర్లను గౌరవించాలి. ఆరోగ్య భారత్, ఆరోగ్యాంధ్రప్రదేశ్‌కు డాక్టర్లే ప్రధాన భూమిక పోషించాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది కాలంలో ప్రజారోగ్య రంగాన్ని బలోపేతం చేశాం. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. గత ఐదేళ్లలో పాతుకుపోయిన అవినీతికి అడ్డుకట్టవేశాం. వైద్యారోగ్యశాఖలో బదిలీల్ని ఎంతో పారదర్శకంగా చేపట్టామన్నారు.

## రాజకీయాల్లో స్వలాభాపేక్ష చూసుకోలేదు : ఎంపి పురందేశ్వరి

**విజయవాడ జులై 01 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజకీయాల్లో స్వలాభాపేక్ష ఏ రోజూతాను చూసుకోలేదని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి చెప్పారు. పార్టీకి లాభం చేకూర్చాలనే భావన తప్ప తన రెండు సంవత్సరాల ప్రస్థానంలో మరే ఆలోచన లేదన్నారు. తనను ప్రోత్సహించిన ప్రతిఘటించిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పీవీఎన్ మాధవ్ కూడా కార్యకర్తలకు అనుగుణంగా వెళతారని తాను ఆశిస్తున్నానని రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరి పేర్కొన్నారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా మాధవ్ ఎన్నికయ్యారు. బీజేపీ జెండాను మాధవ్ కుఇచ్చి పార్టీ బాధ్యతలను పురంధేశ్వరి అప్పగించారు. మాధవ్ ప్రమాణ స్వీకారోత్సవ సభలో పురంధేశ్వరి అప్పగించారు. మాధవ్ ప్రమాణ స్వీకారోత్సవ సభలో పురంధేశ్వరి మాట్లాడారు. 2013 లో బీజేపీలోకి నేను వచ్చాను. బీజేపీలోకి వచ్చిన నాటి నుంచి నాకు పార్టీ గౌరవం ఇస్తోంది. అన్ని విధాలుగా నాకు గౌరవం వచ్చిన పార్టీకి కృతజ్ఞతలు. పీవీఎన్ మాధవ్ తండ్రి చలపతిరావు పోరాట యోధులు, చలపతిరావు నుంచి పట్టుదల ఎలా ముందుకు వెళ్లాలో నేర్చుకున్నాను. వెంకయ్య నాయుడు నుంచి చనువు, చొరవ నేర్చుకున్నాను. ఏపీ బీజేపీకి జీవితం అంకితం చేసిన నాయకులు నుంచి నేను చాలా నేర్చుకున్నా. నన్ను ప్రోత్సహించిన ప్రతిఘటించిన కార్యకర్తలు ఇరువురికి నా ధన్యవాదాలు అని రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరి. కార్యకర్త సహకారం లేకపోతే ఎమ్మెల్యేలు ఎంపీలు గెలవడం సాధ్యం కాదు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలిగా రెండేళ్లల్లో పార్టీ బలోపేతం కోసం నా వంతు కృషి చేశా. నాకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించా. స్వలాభాపేక్ష ఏ రోజూ నేను చూసుకోలేదు. పార్టీకి లాభం చేకూర్చాలనే భావన తప్ప నా రెండు సంవత్సరాల ప్రస్థానంలో మరే ఆలోచన లేదు.

పీవీఎన్ మాధవ్ కూడా కార్యకర్తలకు అనుగుణంగా వెళతారని నేను ఆశిస్తున్నాను. ప్రభుత్వంలో భాగస్వాములుగా ఒకొక్క మాట ఆచితూచి మాట్లాడాలి అని ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి సూచించారు. గత రెండేళ్లుగా ఏపీ భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలిగా పురంధేశ్వరి పని చేసారు.

## 'కిశోరి వికాసం' కార్యక్రమం అమలుకు నోడల్ ఉపాధ్యాయులు !

**విజయవాడ,జూలై1,ప్రభాతవార్తప్రతినిధి:**విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత శుభ్రత,పౌష్టికాహారం, మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడం,బాల్య వివాహాల నియంత్రణ,స్వీయ రక్షణ,ఉపాధి అవకాశాలు తదితర కీలక అంశాలపై విద్యార్థులకు పాఠశాల దశ నుంచే అవగాహన కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం 'కిశోరి వికాసం'కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకురానుంది. అన్ని ప్రభుత్వ,యాజమాన్య అనుబంధ ప్రైవేటు ఉన్నత పాఠశాలలు,జూనియర్ కళాశాలలు,పాలిటెక్నిక్,ఇతర వృత్తి విద్యా సంస్థల్లోని విద్యార్థులతో ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేయనుంది. బాలురతో ఏర్పాటు చేసే బృందానికి 'యువ' అని బాలికలతో ఏర్పాటు చేసే బృందానికి 'సఖీ'అని నామకరణం చేసింది. ప్రతి రెండు వారాలకు ఒకసారి (నో బ్యాగ్‌డే నిర్వహించే శనివారం) ఈ బృందాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేసింది. ఇప్పటికే మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యక్రమ నిర్వహణ మార్గదర్శకాలు ఖరారు చేసి విద్యాశాఖకు పంపించింది.విద్యార్థులతో ఏర్పాటు చేసే యువ,సఖీ బృందాల్లో 20-25 మందికి మించరాదు. విద్యార్జుధులు ఎక్కువగా ఉంటే రెండు బృందాలుగా విభజించాలి.11-14 ఏళ్ళు,15-18 ఏళ్ళ వయస్సు వారితో వేర్వేరుగా బృందాలు ఏర్పాటు చేయాలి. కిశోరి వికాసం అమలుకు నోడల్ ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది.

## మద్యం మత్తులో భార్యను కడతేర్చిన భర్త

**బాలయపల్లి, జూలై 1, ప్రభాతవార్త** తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలంలోని అంబలపూడి గిరిజన కాలనీకి చెందిన బాట సిద్ధమ్మను భర్త వెంకటేశ్వర్లు మద్యం మత్తులో విచక్షణ రహితంగా కొట్టి చంపేసినట్లు బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. అంబలపూడి గ్రామంలోని సురేష్ నాయుడు మామిడి తోటలో గిరిజన జంట బాట సిద్ధమ్మ, వెంకటేశ్వర్లు గత కొంతకాలంగా కాపల దారులుగా ఉన్నారు. రాత్రి ఇద్దరు మద్యం సేవించామని, భార్యపై తనకున్న అనుమానం, కుటుంబ కలహాలతో భార్యను కర్రలతో కొట్టి చంపానని తోట యజమాని సురేష్ నాయుడు, బంధువులకు నిందితుడు వెంకటేశ్వర్లు సమాచారం చరవాణి ద్వారా తెలిపాడు. సురేష్ నాయుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై కామినేని గోపి, సీఐ ఏ.వి.రమణ, గూడూరు డిఎస్పి గీత సంఘటన స్థలానికి చేరుకొని సిద్ధమ్మ శవానికి ఉన్న గాయాలు పరిశీలించారు.

## దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టిన సందీప్ మాథూర్



ద.మ.రై. జీఎంగా అదనపు బాధ్యతలు చేపట్టిన సందీప్ మాథూర్

**గుంతకల్లు రైల్వే, జూలై 1,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే జీఎంగా దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ జీఎంగా పనిచేసిన ఎకె జైన్ జూన్ 30న పదవీ విరమణ చేశారు. దక్షిణ కోస్తా రైల్వే జీఎంగా పనిచేస్తున్న సందీప్ మాథూర్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టాలని రైల్వే బోర్డు శుక్రవారం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన మంగళవారం దక్షిణ మధ్య రైల్వే జీఎంగా అదనపు బాధ్యతలను చేపట్టారని రైల్వే వర్గాలు తెలిపాయి. దక్షిణ మధ్య రైల్వేలోని గుంతకల్లు, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్,సికింద్రాబాద్,నాందేడ్ డివిజన్లతో పాటు వర్క్‌షాపులు అమృత్ భారత్ రైల్వే స్టేషన్‌లలో,జోన్ పరిధిలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల నిర్మాణపు పనులను ఆయన పర్యవేక్షించారు.



ప్రజాదర్బార్‌లో సాయం పొందిన బాధిత కుటుంబంతో మంత్రి లోకేష్

## పసివాడి ప్రాణం నిలిపిన మంత్రి నారా లోకేష్

### - సిఎంఆర్‌ఎఫ్ ద్వారా లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ కు రూ.15 లక్షల ఆర్థికసాయం అందజేత

**విజయవాడ,జూలై1,ప్రభాతవార్తప్రతినిధి:** కష్టాల్లో ఉన్నవారికి నేనున్నానంటూ అండగా నిలుస్తున్నారు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్. పుట్టకతోనే లివర్ సమస్యతో బాధపడుతున్న ఆరు నెలల చిన్నారికి వైద్యసాయం అందించి ప్రాణాలు నిలిపారు. చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన గజ్జల దీపూ నాయుడు అనే చిన్నారి పుట్టకతోనే లివర్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో మెరుగైన వైద్యం కోసం తల్లిదండ్రులు ప్రైవేటు ఆసుపత్రిని సంప్రదించారు. లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయాలని, ఇందుకు రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. పౌల్ట్రీ ఫామ్ లో పనిచేసే చిన్నారి తండ్రి జగదీష్ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో ఆర్థికసాయం కోసం మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషాను కలవడం జరిగింది. దీంతో వైద్యఖర్చులకు గాను రూ.10లక్షల వరకు ఎల్ వోసీ మంజూరుచేయడం జరిగింది. అయితే లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ కు అధికమొత్తం అవసరం కావడంతో చిన్నారి తల్లిదండ్రులు మంత్రి లోకేష్ ను కలిసి విన్నవించారు. దీంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్యసాయాన్ని రూ.15 లక్షల వరకు పెంచి ఎల్ వోసీ మంజూరు చేయడం జరిగింది. ఆపదలో ఉన్నవారిని వెంటనే కలుసుకుని సాయం అందజేయడం గొప్ప విషయమని, చిన్నారికి అండగా నిలవడం పట్ల మంత్రికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## నేత్ర వైద్య నిపుణులు గుళ్లపల్లి నాగేశ్వరరావుకు జీవిత సాఫల్య పురస్కారం

**విజయవాడ,జూలై1,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ స్థాయి సదుపాయాలతో ప్రజలకు ఆధునాతన కంటి వైద్య సేవలు అందిస్తున్నామని ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ గుళ్ళపల్లి నాగేశ్వరరావు వెల్లడించారు.స్థానిక మహాత్మాగాంధీ రహదారి లోని ఓ హోటల్లో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్వర్యంలో గుళ్ళపల్లి నాగేశ్వరరావుకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అమెరికాలో ప్రజలకు అందుతున్న ఆధునాతన వైద్య సేవలను దేశ ప్రజలకు అందించాలనే లక్ష్యంతోనే తిరిగి భారత దేశానికి వచ్చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశాలతో పాటు వివిధ ప్రాంతాల్లో 310 ఐ కేర్ ఇనిస్టిట్యూట్‌లు ఇప్పటిఏ ఏర్పాటు చేసామని, ప్రస్తుతం దేశం మొత్తం విస్తరించాలనే లక్ష్యంతో ముందకుకు సాగుతున్నామని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా లేని విధంగా ఇక్కడ ఐ బ్యాంక్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. రోటరీ జీవిత సాఫల్య పురస్కారం,తన ఒక్కడికే వచ్చినట్లు కాదని, తమ సంస్థలో పనిచేస్తున్న అందరికీ వచ్చినట్లుగా భావిస్తున్నామని అన్నారు.రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షురాలు వి.శ్రీదేవి, కార్యదర్శి ఎస్.రవిప్రకాష్,రోటరీ డిస్ట్రిక్ట్ పూర్వ గవర్నర్లు డాక్టర్ ఎంసీ దాస్,డాక్టర్ పట్టాభిరామయ్య,డాక్టర్ మోహన్‌ప్రసాద్, డాక్టర్ ఎ. లీలాప్రసాద్ పాల్గొన్నారు.

## జర్నలిస్టు కృష్ణంరాజుకు షరతులతో బెయిల్

### - దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశం

విజయవాడ,జూలై1 రాజధాని అమరావతి ప్రాంత మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో నిందితుడు,మహిళలపై మురికి వ్యాఖ్యల కేసులో జర్నలిస్టు కృష్ణంరాజుకు షరతులతో బెయిల్‌ను ఏపీ హైకోర్టు మంజూరు చేసింది.దర్యాప్తుకు సహకరించాలని కృష్ణంరాజె ఆదేశించింది. రూ.10వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని పేర్కొంది. ప్రతి శనివారం దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని, దర్యాప్తు విషయమై ఎప్పుడు కోరితే అప్పుడు అందుబాటులో ఉండాలని కృష్ణంరాజుకు తేల్చి చెప్పింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులిచ్చినట్లు ఆయన న్యాయవాదులు తెలిపారు.. ఒక టీవీ చర్చా కార్యక్రమంలో అమరావతి వేశ్యల రాజధాని అంటూ కృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేసారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు పోలీసుల కేసు నమోదు చేసి ఆయన్ను అరెస్ట్ చేశారు. నిందితుడు బెయిలు కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుపై జరిగిన విచారణలో న్యాయవాది డీఎస్ఎన్‌వీ ప్రసాదబాబు వాదనలు వినిపించారు. పిటీషనర్ అనారోగ్యంతో భాధపడుతున్నారని తెలిపారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు మూడేళ్ళ లోపు జైలు శిక్షకు వీలున్నవేనని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలకు ఇప్పటికే క్షమాపణ చెప్పారని,బెయిలు మంజూరు చేయాలని కోరారు.

## రాష్ట్ర వ్యాప్తంగా 9,034 సాధారణ సేవా కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం

### - స్వయం సహాయక సంఘాలకు నిర్వహణ బాధ్యత

**విజయవాడ.జూలై1ప్రభాతవార్తప్రతినిధి:**పట్టణ.నగర ప్రజలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 250 రకాలైన సేవలు అందించే క్రమంలో డిజి లక్ష్మి పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా (కామన్ సర్వీస్ సెంటర్లు సీఎస్‌సీ) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్వయం సహాయక సంఘాల సభ్యులకు వీటి నిర్వహణను అప్పగించనున్నారు. ఇందుకోసం అర్హులైన సభ్యులను ఎంపిక చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెపా ్మ)ను ప్రభుత్వం సోమవారం ఆదేశించింది. వివిజధ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ధరఖాస్తుల స్వీకరణ నుంచి మీ-సేవా కేంద్రాల తరహాలో వివిధ రకాల సేవలు ఈ కేంద్రాల్లో అందిస్తోంది. వీటి ద్వారా ప్రజలకు సేవలు అందుబాటులోకి రావడంతో పాటు మహిళలకు ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం పేర్కొంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
చిట్ టెండర్ ప్రకటన
CT. నోటీస్ నం.21/JTO.2/KNL/2025-26, తేది: 26.06.2025
కర్నూలు జిల్లాలో, వాహనం పని కొరకు సుమారు విలువ : రూ.6.81 లక్షలు నమోదిత సంస్థలు మరియు కాంట్రాక్టరుల నుండి హాఫ్ లైన్ టెండర్‌ల ద్వారా టెండర్‌లు కోరబడుతున్నవి. టెండర్ షెడ్యూల్స్ సరఫరా కొరకు దరఖాస్తు యొక్క స్వీకరణ తేది: 07.07.2025 సా.5.00గం. వరకు. తదుపరి వివరాలు దిగువ సంతకందారుని నుండి పొందవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనర్, (R&B) డివిజన్, కర్నూలు.
DIPR.NO. 16865/CL/ADVT/1/1/2022-23 తేది: 01.07.2025

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)
NIT No. 43/MAU61-ADMN0IS(APSW)/17/2025-IS/ 2nd Call, Dt.01.07.2025
E Procurement Short Tender Notice (Second Call)
Name of Work: APCRDA - "RFP for Selection of Solution Provider to Configure, Customize, Integrate, Implement and Maintain ICT Platform for Construction Management for APCRDA and ADCL".
The bid can be downloaded on AP e-procurement portal from 02.07.2025 to 09.07.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 09.07.2025 up to 15.00 Hrs, Technical bid opening 09.07.2025 @16.00Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Commissioner, APCRDA, Vijayawada.

ఇతరుల పట్ల మీకున్న విశ్వాసం, అవిశ్వాసం అన్నవి మీ పట్ల మీకున్న ఆత్మవిశ్వాసం, అపనమ్మకం అనే అంశాలకు సంబంధించి ఉంటాయి.

-రాబర్ట్ ఫ్రాస్ట్

# బతుకులు అగ్గిపాలు!

తెలంగాణ రాష్ట్ర రాజధానిలో మరో ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకున్నది. ఆసియాలోనే పెద్ద పారిశ్రామికవాడగా పేరున్న పాశమైలారంలోని సిగాచి ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో సోమవారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. మంటలు వ్యాపించి పేలుడు సంభవించడంతో దీని తీవ్రతకు మూడంతస్తుల భవనాలు రెండు కుప్పకూలిపోయాయి. పరిశ్రమల పైకప్పు, రేకులు, ఇతర యంత్రభాగాలు ఎగిరి దాదాపు అరవై, డెబ్బైమీటర్ల దూరంలో పడ్డాయి. ఇప్పటివరకు నలభైరెండు మంది కార్మికులు చనిపోయినట్టు అధికార వర్గాలు చెప్తుండగా మరెందరో శిథిలాల కింద చిక్కిఉంటారని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. పేలుడు సమయంలో దాదాపు ఎనిమిది వందల డిగ్రీల ఉష్ణోగ్రత ఉండి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ కారణంగానే అరడజన్ మందికిపైగా అక్కడ పని చేస్తున్న కార్మికులు సజీవ దహనం అయ్యారు. ప్రమాద తీవ్రతకు పరిశ్రమ భవనంలో పద్నాలుగు అంగుళాల మందంతో ఉన్న ప్లింత్‌బీమ్ సైతం విరిగి కుప్పకూలిపోవడంతో ప్రాణనష్టం భారీగా జరిగినట్టు చెప్తున్నారు. పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ క్వాలిటీ కంట్రోల్ విభాగం నుంచి కిందికి దిగుతున్న సమయంలో పేలుడు జరగడంతో ఆయన మృతదేహం దాదాపు అరవై మీటర్ల దూరం వరకు ఎగిరిపడిందంటే తీవ్రతను ఊహించుకోవచ్చు. గుజరాత్ కేంద్రంలో పనిచేస్తున్న సిగాచి సంస్థకు తెలంగాణ, మహారాష్ట్రల్లో పరిశ్రమలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రమాదం జరిగిన పరిశ్రమ పాశమైలారం పారిశ్రామిక వాడలో దాదాపు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ పరిశ్రమలో దాదాపు 190కిపైగా సిబ్బంది పనిచేస్తుంటే ఇందులో అధికభాగం ఉత్తరాది రాష్ట్రాల వారే ఉన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో 147మంది ఉన్నట్లు అధికార వర్గాలే చెప్తున్నాయి. కొన్ని మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా మాంసం ముద్దలుగా మారిపోయాయి. దీంతో వారిని గుర్తుపట్టేందుకు కుటుంబ సభ్యుల డిఎన్ఎలతో పోల్చిచూడాల్సి ఉంటుందని చెప్తున్నారు. ప్రమాదానికి స్పష్టమైన కారణాలు ఇంకా తెలియకపోయినాఎయిర్ డ్రైయర్ యూనిట్‌లో సమస్య తలెత్తడంతో మంటలు చెలరేగినట్లు అంచనా వేస్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంఘటనా స్థలంలో చేపట్టిన సహాయచర్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. సహాయ చర్యలు నిరంతరంగా కొనసాగిస్తూ పర్యవేక్షిస్తూ ప్రభుత్వం తరపున ఒక కమిటీని కూడా వేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆధ్వర్యంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ సిఎస్, లేబర్ డిపార్ట్‌మెంట్ సిఎస్, హెల్త్ సెక్రెటరీ, ఫైర్ సర్వీసెస్ అడిషనల్ డిజీలను సభ్యులుగా నియమించారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలను సిఫారసు చేసే బాధ్యతలను ఈ కమిటీకి అప్పగించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరగడం ఇది మొదటిది ఔకాదు. గతంలో కూడా ఎన్నో జరిగాయి. ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో అధిక శాతం వలసకార్మికులు, నిరుపేదలేనని చెప్పొచ్చు. తెలంగాణ రాష్ట్రంలో సగటున ప్రతి రెండు రోజులకు ఒక ప్రమాదం జరుగుతున్నట్లు అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం గత పదేళ్లలో ఆరువందలకుపైగా పారిశ్రామిక ప్రమాదాలు జరగ్గా ఒక వెయ్యి నూటపదహారు మంది మరణించారు. గత పదేళ్ల ఫార్మా యూనిట్‌లోనే నూటరెండు అగ్నిప్రమాదాలు జరగ్గా వంద కోట్లకుపైగా ఆస్తి నష్టం జరిగినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. 2020లో జరిగిన ప్రమాదాల్లో యాభైఒక్క మంది మృతిచెందగా తొంభైఎనిమిది మంది గాయపడ్డారు. 2021లో యాభై మంది చనిపోతే అరవైఐదు మంది క్షతగాత్రులయ్యారు. 2022లో అరవై మంది ప్రాణాలు కోల్పోగా, యాభైఏడు మంది గాయపడ్డారు. 2023లో బొల్లారంలోని ఒక ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో పదిహేను మంది, షాద్‌నగర్‌లోని రంగుల తయారీ యూనిట్‌లో పదకొండు మంది గాయపడ్డారు. 2024లో సంగారెడ్డిలోని ఒక ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు చనిపోగా పద్నాలుగు మంది గాయపడ్డారు. అదే యేడాది షాద్‌నగర్‌లోని ఒక గ్లాస్‌ఫ్యాక్టరీలో జరిగినప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా పదిమంది గాయపడ్డారు. ముఖ్యంగా ఈ అగ్నిప్రమాదాలకు కారణాలు రియాక్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యం, ముడిసరుకుల ఉత్పత్తుల నిల్వ, రవాణాలో అజాగ్రత్తలు ఈ అగ్నిప్రమాదాలకు కారణమవుతున్నాయి. నిబంధనల ప్రకారం ఏర్పాటుచేయాల్సిన సేఫ్టీ మెజర్స్‌లో కూడా కొన్ని యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. పరిశ్రమలకు అత్యంత వేగంగా అనుమతులు ఇస్తున్న పాలకులు కార్మికుల భద్రత అంశాన్ని పట్టించుకోవడంలేదనే విమర్శలను కొట్టివేయలేం. అంతేకాదు అమాయక కార్మికులు ఇలాంటి ప్రమాదాల్లో మరణించినప్పుడు యాజమాన్యాలపై తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఎన్నో దేశాలు కార్మికుల భద్రత విషయంలో అత్యంతప్రాధాన్యత ఇస్తున్నాయి. సింగపూర్‌లో పనిప్రదేశంలో కార్మికులుప్రమాదంలో చనిపోతే నిర్లక్ష్యానికి కారణమైన యాజమానికి జైలుశిక్ష వేస్తారు. ఆస్ట్రేలియాలో పనిప్రదేశంలో కార్మికుడి ప్రాణాలు పోతే మ్యాన్ స్లాటర్‌గా పరిగణించి కేసు బుక్ చేస్తారు. యజమానికి విధించే శిక్షను 2023 పదేళ్లనుంచి ఇరవైఏళ్లకు పెంచారు. మనదేశంలో ఆ పరిస్థితులు లేవు. కొన్ని సంఘటనలలో చార్జ్‌షీట్ కూడా దాఖలు చేయడం లేదు. కర్మాగారాల్లో భద్రతా వైఫల్యాలు, కార్మిక చట్టాల ఉల్లంఘనల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కలకాలం నిలిచిపోయే పనులు చేయడంలో ఖర్చు అయిన జీవితమే చాలా ఉపయోగకరమైన జీవితం.



విలియం జేమ్స్

కష్టాల్లో ఉన్నాననీ, తాను హీనుడనీ, ఏమీ సాధించలేననీ, పగలూ రాత్రి అనుకుంటూ ఉండే మనిషి ఎందుకూ కొరగాడు.



వివేకానందుడు

# విధాన లోపం ..విద్యకు శాపం!

**విద్యావ్యవస్థలోనే అంతరాలు, అసమానతలు బలంగా ఉన్నప్పుడు ఒక పాఠశాలను మరొక పాఠశాలలో కలపడంలో ఉపయోగం ఏమిఉండదు. లోప భూయిష్టమైన వ్యవస్థను మార్చకుండా పాఠశాలల విలీనంతో ప్రయోజనం శూన్యం. పాఠశాలల విస్తరణతో విద్యా వ్యవస్థ ఏమాత్రం మెరుగుపడలేదు. ఫలితాలు, ప్రమాణాలు మరింతగా దిగజారిపోయాయి. విలీనంతో ఏదో ప్రయోజనం చేకూరుతుందని ఆశించడం కూడా పొరపాటే. విలీనంతో విద్యావ్యవస్థలో దిగజారుతున్న ఫలితాల పరిణామక్రమం తగ్గకపోగా, పెరిగిపోయే ప్రమాదం ఉంది. విస్తరణ విలీనం (హేతుబద్ధీకరణ)ను ప్రక్కన పెట్టి ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాలను ఆలోచించాలి. సామాజిక, విద్యావేత్తల, మేధావుల, అనుభవజ్ఞుల సల హాలు, సూచనలు పాటించాలి. విద్యా వ్యవస్థలో ఏండ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న అన్ని మౌలిక సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలి. సమాజ నిర్మాణంలో ప్రధాన రంగాలైన విద్యా, వైద్య రంగాలను జాతీయం చెయడమే ఏకైక పరిష్కారం.**

విశ్వ జంపాల

గత 30 ఏండ్లుగా వినబడిన మాట ప్రభుత్వ పాఠశాలల విస్తరణ విద్యావ్యాప్తి. గత పదేళ్లుగా వినబడుతున్న మాట ప్రభుత్వ పాఠశాలల హేతుబద్ధీకరణ (రేష్నలైజేషన్). 19 కంటె తక్కువ విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను, 75 కన్నా తక్కువ విద్యార్థులున్న ఉన్నత పాఠశాలలను సమీపంలో ఉన్న వేరొక పాఠశాలలో విలీనం చేయడం. ఈ రకమైన విలీనానికి ప్రభుత్వం పెట్టిన ముద్దు పేరు హేతుబద్ధీకరణ. అందరికి అందుబాటులోకి విద్యను తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో పాఠశాలల విస్తరణ చేపట్టి "పల్లె పల్లెకో పాఠశాల" నినాదంతో గత ప్రభుత్వాలు ఇబ్బడి ముబ్బడిగా పాఠశాలలను ఏర్పాటు చేసి పక్కా భవనాలను నిర్మించింది. రెండు దశాబ్దాల తర్వాత వెనకకు తిరిగిచూస్తే ఆశించిన ఫలితాలు రాకపోగా విద్యా నాణ్యత ప్రమాణాలు మరింతగా దిగజారిపోయాయి. ఆ కాలంలో ప్రారంభించిన పాఠశాలల పక్కా భవనాల నిర్మాణం కారణంగా అప్పుడు ప్రభుత్వంలో వున్న వారిని కాంట్రాక్టర్లుగా తయ్యారు చేయడానికి, వారి జేబులు నింపడానికి మాత్రం ఉపయోగపడింది. పాఠశాలల ఏర్పాటులో చూపిన శ్రద్ధను మౌలిక వసతులు కల్పించడంలోను, నాణ్యమైన విద్యను అందించడంలోను ప్రభుత్వం చూపలేదు. మారిన పరిస్థితుల కారణంగా విద్యార్థులున్న చోట ఉపాధ్యాయులు లేరు. ఉపాధ్యాయులున్న చోట విద్యార్థులు లేరు. ఇద్దరు ఉన్న చోట మౌలిక వసతులు లేవు. ఈ పాఠశాలల నిర్వహణను ప్రభుత్వాలు తలకు మించిన భారంగానే భావిస్తున్నాయి. మరో ప్రక్క ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు విస్తరించిన కొద్దీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. విద్యార్థులు లేరన్న కారణంతో కొన్ని పాఠశాలలను శాశ్వతంగా మూసివేసి అక్కడి విద్యార్థులను, ఉపాధ్యాయులను దగ్గరలోని వేరొక పాఠశాలలో సర్దుబాటు చేయడం ద్వారా మెరుగైన విద్యను అందించవచ్చు, ఖర్చును తగ్గించవచ్చునని ప్రభుత్వం భావిస్తుంది. ప్రభుత్వ తీరును ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, మేధావులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. హేతుబద్ధీకరణతో పాఠశాల విద్యావ్యవస్థ బాగుపడుతుందనుకోవడం కూడా ఒక భ్రమ మాత్రమే. ముందు చూపులేని ప్రభుత్వాలు ఉన్నతాధికారులు లేడికి లేచిందె పరుగు అన్నట్లు ఒకప్పుడు పాఠశాలల విస్తరణను చేపట్టి చేతులు కాల్చుకున్నారు. ఇప్పుడు అంతే వేగంతో హేతుబద్ధీకరణకు పూనుకుంటున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను మాత్రం అన్వేషించడం లేదు. చర్చావిశ్లేషణ,



సంవాదం, సమన్వయం లేకుండా చేపట్టే ఏ కార్యాక్రమాలైనా, పథకాలైనా ఇలాగే కొనసాగి ఆచరణలో విఫలం అవుతాయి. విస్తరణ లేదా హేతుబద్ధీకరణ ముఖ్యం కాదు. అందరికి సమానమైన, నాణ్యమైన విద్యా అందుతుందా లేదా అనేది ముఖ్యం. విస్తరణ, హేతుబద్ధీకరణ రెండు ఆనాలోచిత అసంబద్ధమైన విధాన నిర్ణయాలే. పుండొకటైతే మందొకటి వేసినట్లుగా ప్రభుత్వ వ్యవహారశైలి ఉంది. విస్తరణ, హేతుబద్ధీకరణతో విద్యావ్యవస్థలో ఏండ్ల తరబడి ఉన్న మౌలిక సమస్యలు తీరవు. పాఠశాలల విస్తరణ పేరుతో 30ఏండ్ల కాలం గడిపిన ప్రభుత్వాలు, హేతుబద్ధీకరణ పేరుతో మరో 30ఏళ్ల కాలం వెలబుచ్చాలని ప్రయత్నిస్తున్నాయి. క్రమక్రమంగా పాఠశాలల సంఖ్యను, ఉపాధ్యాయుల సంఖ్యను కుదించడం ద్వారా ప్రభుత్వాలు ఖర్చును తగించుకోవాలని, బాధ్యతల నుండి తప్పకోవాలని చూస్తున్నాయి. ప్రభుత్వాలు ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటాయోనన్న భయంతో విద్యార్థులువారి తల్లిదండ్రులు అయోమయ (సంకట) స్థితిలో నలిగిపోతూ, నష్టపోతున్నారు. వివిధ వర్గాల ప్రజల ఒత్తిడి మేరకు ప్రభుత్వాలు తాత్కాలికంగా వెనక్కు తగ్గినప్పటికి చాపకింద నీరు లాగ హేతుబద్ధీకరణ అమలుకు పూనుకుంటుంది. విద్యా వ్యవస్థలో నెలకొన్న మౌలిక సమస్యలను, అనుబంధ సమస్యలను చర్చించి, పరిష్కరించకుండా మాయల గారడి చేతిలో మంత్రదండం" లాగా హేతుబద్ధీకరణను చూపడం, హేతుబద్ధీకరణ ఒక్కటే విద్యా వ్యవస్థలో అపరిష్కృతంగా ఉన్న అన్ని సమస్యలకు పరిష్కారంగా చూపడం ప్రభుత్వాల అవివేకానికి, అసమర్ధతకు నిదర్శనం. ఒక పాఠశాలను తీసి మరో పాఠశాలలో కలిపితే, వచ్చే ఫలితం సన్యాసిసన్యాసి రుద్దుకుంటే బూడిద రాలినట్లుగా ఉంటుంది. మొత్తం విద్యావ్యవస్థలోనే అంతరాలు, అసమానతలు బలంగా ఉన్నప్పుడు ఒక పాఠశాలను మరొక పాఠశాలలో కలపడంలో ఉపయోగం ఏమిఉండదు. లోప భూయిష్టమైన వ్యవస్థను మార్చకుండా పాఠశాలల విలీనంతో ప్రయోజనం శూన్యం. పాఠశాలల విస్తరణతో విద్యా వ్యవస్థ ఏమాత్రం మెరుగుపడలేదు. ఫలితాలు, ప్రమాణాలు మరింతగా దిగజారిపోయాయి. విలీనంతో ఏదో ప్రయోజనం చేకూరుతుందని ఆశించడం కూడా పొరపాటే. విలీనంతో విద్యావ్యవస్థలో దిగజారుతున్న ఫలితాల పరిణామ క్రమం తగ్గకపోగా, పెరిగిపోయే ప్రమాదం ఉంది. విస్తరణ విలీనం (హేతుబద్ధీకరణ)ను ప్రక్కన పెట్టి ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాలను ఆలోచించాలి. సామాజిక, విద్యావేత్తల, మేధావుల, అనుభవజ్ఞుల సలహాలు, సూచనలు పాటించాలి. విద్యా వ్యవస్థలో ఏండ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న అన్ని మౌలిక సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలి. సమాజ నిర్మాణంలో ప్రధాన రంగాలైన విద్యా వైద్య రంగాలను జాతీయం చెయడమే ఏకైక పరిష్కారం. •

# అకాల మరణాలు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం

ఐ.ప్రసాద రావు

ఇటీవల మత పరమైన క్రతువుల్లో, పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించి పలువురు అకాల మరణాలు చెందుతుండంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ఆయా కుటుంబాలు తీవ్ర దుఃఖంతో కుమిలిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో జరిగిన తొక్కిసలాటలో, సింహాచలంలో చందనోత్సవంసందర్భంగా గోడ కూలిన ఘటనలో, గత వారంలో పూరీ జగన్నాథ్ రథయాత్ర సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో పలువురు అకాల మరణం పొందడం అందరికీ తీవ్ర దుఃఖం కలిగించింది. దీనికి ప్రధాన కారణం ఆయా దేవాలయాల బోర్డులు, ప్రభుత్వాలు, భక్తుల తొందరపాటు. ఇక గత పరిశ్రమల్లో జరిగిన ప్రమాద సంఘటనలు పక్కన పెడితే, ఇప్పుడు పటాన్ చెరువడ "పాశమైలారం రసాయన పరిశ్రమలో సంభవించిన ప్రమాదంలో పలు అకాల మరణాలకు కారణం యాజమాన్యాలు, ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా కనపడుతుంది. నిబంధనలు పాటించకపోవడం. సేఫ్టీమెజర్స్ పాటించకపోవడం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, లేబర్ డిపార్ట్మెంట్, ప్రభుత్వ అధికారులు, ఫైర్ డిపార్ట్మెంట్ ఏమి చేస్తున్నారు.? అనే ప్రశ్న అందరి మెదళ్లను తొలిచి వేస్తుంది. మరో పక్క ఇటీవల కాలంలో 'విమాన ప్రమాదాలు' దేశ ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. దీనికి విమానయాన సంస్థలు అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోంది. ఇక రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, ప్రతీ సంవత్సరం సగటున ఒక లక్షా యాభై వేల మంది అకాల మరణాలు చెందుతున్నారు. దీనికి ప్రధాన కారణం ట్రాఫిక్‌రూల్స్ అతిక్రమించడం, వాహనాల ఫిట్నెస్ లోపం, అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర కారణాలతో పాటు సంబంధించిన డిపార్ట్మెంట్స్ అలసత్వం. ఇక వీరాభిమానంతో సినిమా హాల్స్ వద్ద, క్రికెట్ స్టేడియంల వద్ద అకాల మరణాలు చెందుతున్నారు. దీనికి కూడా వ్యక్తిగత కారణాలతో పాటు యాజమాన్యం, పోలీసు, ఫైర్ డిపార్ట్మెంట్స్ కారణం కనపడుతుంది. ఇటీవల బెంగళూరు క్రికెట్ స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో కొందరు అకాల మరణాలు చెందడం మనం అందరం ప్రత్యక్షంగా చూశాం. ఇలా పలు సందర్భాల్లో, పలు కార్యక్రమాల్లో ప్రజలు అకాల మరణాలు చెందడం చాలా బాధాకరం. దీనికి ప్రధాన కారణం కొంతమేరకు భక్తులు, ప్రజలు తొందరపాటు కారణం అయితే, ఎక్కువ శాతం యాజమాన్యాలు ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యమే కారణమని నిపుణులు చెబుతున్నారు. ఇక అనుకోకుండా ఇటువంటి ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రభుత్వాలు తరచూ ' చాలా దురదృష్టకరమైన సంఘటన అని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తాం అని, పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, నిందితులు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదనే డైలాగులు సర్వసాధారణంగా వినిపిస్తారు. కానీ జరిగిన ప్రమాదాల్లో త్వరితగతిన విచారణ జరిపి, ఎంత మందిపై చర్యలు చేపట్టారు అని విశ్లేషిస్తే కనుచూపు మేరలో ఎక్కడా కనపడవు అంటే అతిశయోక్తికాదు. ఇటువంటి పరిస్థితుల్లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఎలా చూడగలం.? అనే విషయాన్ని అందరూ సీరియస్‌గా ఆలోచన చేయాలి. ముఖ్యంగా ప్రజలు తమ వ్యక్తిగత భద్రతపై అవగాహన కలిగిఉండాలి.. ప్రభుత్వ సూచనలు సలహాలు గైడ్లెన్స్ పాటించాలి. ఏ విషయంలోనైనా 'అతి' అనేది ప్రమాదకరం అని గ్రహించాలి. ఇక ప్రభుత్వాలు జన సమీకరణ ప్రాంతాల్లో, ప్రదేశాల్లో పటిష్టమైన చర్యలు చేపట్టాలి.. అధికారులు, సంబంధించిన డిపార్ట్మెంటల ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి. నియమ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా పరిశ్రమల్లో అన్ని విషయాలు క్షుణ్ణంగా పరిశీలించాలి. కార్మికుల భద్రతపై దృష్టి సారించాలి. నైపుణ్యం కలిగిన వారిని సంబంధిత పనుల్లో బాధ్యత అప్పగించాలి. ప్రభుత్వ యంత్రాంగం పారదర్శకంగా పరిపాలన అందించాలి. ప్రజలు కూడా సంయమనంతో వ్యవహరించాలి. జీవితం విలువైనది అని గ్రహించాలి. మనతో పాటు మన పొరుగు వారు ప్రశాంతంగా ఆరోగ్యంగా జీవించడానికి అందరూ సహకరించుకోవాలి. ప్రభుత్వ యంత్రాంగానికి, దేవాలయాల సిబ్బందికి సహకరించాలి. పరిశ్రమలు, సినిమా హాల్స్, స్టేడియంల తదితర ప్రజా కేంద్రిక స్థలాల యాజమాన్యం అక్కడ ప్రజల ప్రాణాలకు భద్రత ఏర్పాటుకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం ద్వారానే ప్రమాదాలు జరగకుండా, నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు పోకుండా కాపాడగలుగుతాం. •

# ప్రజావాక్కు



## సామాజిక భద్రత

**భారతదేశం** సామాజికభద్రత రంగంలో ఒక చారిత్రాత్మక మైలురాయిని దాటింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 95 కోట్లకు పైగా పౌరులు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల నుండి లాభంపొందుతున్నారు. ఇదికేవలం ఒక గణాంకం కాదు, ఇది ఒక మారుతున్న భారత దేశ కథ – సమగ్ర అభివృద్ధి ప్రజా సంక్షేమానికి అంకితమైన దృక్పథాన్ని ప్రతిబింబించే కథ. ఈగొప్ప విజయానికి కేంద్ర ప్రభుత్వపు దూరదృష్టి నిబద్ధత కారణం. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఇప్పటివరకు 6కోట్లకుపైగా ఆసుపత్రి భర్తీలావాదేవీలుజరిగాయి. పథకం ద్వారా 11కోట్లమంది రైతులకు రూ.3లక్షల కోట్లకుపైగా నేరుగా ఖాతాల్లో జమయ్యాయి. ఉజ్జ్వలయోజన ద్వారా 9.5కోట్లకు పైగా గ్యాస్ కనెక్షన్లు అందించబడ్డాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## క్రమశిక్షణారాహిత్యమే కారణం

జూన్29 ఆదివారం పూరిజగన్నాథ్ రథయాత్రలో గుడించా ఆలయం వద్ద అధిక సంఖ్యలో భక్తులు ఒకరినొకరు తోసుకుంటూ వెడుతూండగా జరిగిన తొక్కిసలాటకు కిందపడి ముగ్గురు మరణించగా ఏభై మందికి గాయాలవగా అందులో కొందరిపరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. గతంలో ఇలా పుణ్య క్షేత్రాలలో, తీర్థాలలో, ప్రముఖుల మీటింగ్‌లలో, సినిమా హాళ్ళ దగ్గర తొక్కిసలాటలుజరిగి ప్రాణాలుపోయాయి. కన్నవాళ్ళ, కట్టుకున్న వాళ్ల జీవితాలు కుంటుపడ్డాయి. పడుతున్నాయి. ఎన్ని నివారణ చర్యలు తీసుకుంటున్నా ఇటువంటి ప్రమాదాలను అరికట్టలేక పోతున్నారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## నరమేధం

**మావోయిస్టులతో** చర్చలుజరిపి శాంతినెలకొల్పేప్రయత్నం చేయకుండా వందలాది మంది ప్రాణాలను హరిస్తున్నారు. వేటాడి వేటాడి మరీ హతమారుస్తున్నారు. ఆ పైన తామేదో గొప్ప ఘనకార్యం సాధించినట్టు సంబరపడుతున్నారు. తమను తాము మెచ్చుకుంటున్నారు. మనుషులని చంపటాన్ని సమర్థించుకుంటున్నారు. అడవుల్లో ఉన్న సంపదను, వనరులని తమ దోస్తులకి దోచిపెట్టడానికే కదా ఈ హింస. ఏ దేవుడు మెచ్చుకుంటాడు.

- మిథునం, హైదరాబాద్

## షరా మామూలే

**ఎన్నికల్లో** గెలుపొంది అధికారంలోకి రావాలని ముందు వెనుక ఆలోచించకుండా సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండా హామీల వర్షం కురిపేస్తుంటారు పార్టీలకు చెందిన నాయకులు. అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుంటారు. అయితే ఒకరు మోసం చేసినా మరొకరు మంచి చేయకపోతారా అనేఆశతో ప్రభుత్వాలను మారుస్తుంటారు. అలానే సంవత్సరం ముందు ఎపిలో ప్రభుత్వ మార్పిడి చేశారు. వై.యస్ఆర్‌సిపిని తప్పించి తెలుగుదేశంకి పట్టం గట్టారు. అయితే వీరు ఒరగబెట్టిందేమీ లేదని టాకి. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటినా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుకు నోచుకోలేదని సూపర్‌సిక్స్ సూపర్ ఫ్లాప్ అని అనుకుంటున్నారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వ పాలనలో తేడా కన్పించడంలేదని విరమ్మలు మొదలయ్యాయి.

-ఎమ్.ఎస్.శర్మ, మైదరాబాద్

## గ్రామాభివృద్ధి అవసరం

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విద్యాశాఖ మంత్రి విజ్ఞులు విదేశాల్లో చదువుకున్న వారు కావడంవల్ల ఉపాధ్యాయుల పట్ల సుహృద్భావంతో ఉన్నారు. వారు చేస్తున్న పనులను కొన్ని సందర్భాల్లో అభినందిస్తూ ఉన్నారు. ఇటీవల కాలంలో విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పెంట గ్రామంలో ఒక హైస్కూల్లో హెడ్మాస్టర్లు బాధ్యతలు అదనపు బాధ్యతలుగా నిర్వహించిన ఒక టీచర్ ఆవేదనను అర్థం చేసుకొని ఎక్స్‌వేదిక ట్వీట్ చేశారు. కొద్ది రోజుల ముందు ప్రభుత్వపాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు తన పిల్లలను ప్రైవేటు పాఠశాలల నుండి వెనకకు తీసుకువచ్చి ప్రభుత్వ పాఠశాలలో తిరిగి జాయిన్‌చేయడాన్ని ఎక్స్ వేదికగా మళ్లీ అభినందించారు. ఈ సమస్య నుండి బయట పడాలంటే గ్రామాభివృద్ధి జరగాలి అందుకు చిత్తశుద్ధి కావాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## నిరుద్యోగులందరికీ భృతి ఇవ్వాలి

**ఆంధ్రప్రదేశ్** ప్రభుత్వం త్వరలో ప్రవేశ పెట్టనున్న నిరుద్యోగ భృతిపథకంలో అర్హులందరికీ నిరుద్యోగభృతి పంపిణీ చేయాలి. కేవలం యువతకే నిరుద్యోగ భృతి ఇస్తే చదువుకున్ననిరుద్యోగులు నష్టపోతారు. ఉన్నత విద్య చదివినఅరవై ఏళ్ల లోపు నిరుద్యోగులు ఎందరో ఉన్నారు. కనీసం ఐదు వేల రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తే బాగుంటుంది.

-డి చాంద్ బాషా, కర్నూలు

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'సుపరిపాలన'లో జవాబుదారీతనం పెరగాలి

డి వి.లక్ష్మీ ృనారాయణ

సహజంగా ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీ, బాధ్యత కలిగి ఉండి పౌరులలో చట్టాల పట్ల గౌరవం, నేరగాళ్లలోభయం కలిగి ఉంటే దానిని సుపరిపాలన అనవచ్చు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా సుపరిపాలన, స్వర్ణాంధ్ర పేరుతో ఉత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. కానీ విమాన దుర్ఘటన కారణంగా నిలిపివేశారు. కాగా ప్రభుత్వంలో కీలక వ్యక్తులైన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి అధికారులు, వారి పార్టీల నాయకులు సైతం సరైన సమాచారం ఇవ్వట్లేదు అనిపిస్తోంది. అవినీతిని, రౌడీయిజానీ సహించనని ముఖ్యమంత్రి తరచుగా చెబుతూ ఉంటారు. అయితే ఇటీవల జరిగిన రౌడీయిజంతో భూకబ్జాల వార్తలు ముఖ్యమంత్రి దృష్టికి వచ్చినట్లు లేదు. ఇక ప్రభుత్వ పనితీరు పరిశీలిస్తే లోగడ స్పందన పేరుతో కొనసాగిన ప్రజల ఫిర్యాదుల వేదికని ప్రజా సమస్యల పరిష్కార వేదికగా (పిజిఆర్ఎస్) కొనసాగిస్తున్నారు. పేరు మార్పుతోపాటు పనితీరులో సైతం గణనీయమైన మార్పు రావాలి. జిల్లా కార్యాలయాలలో అలాగే ముఖ్యమంత్రి కార్యాలయ నిర్వహణలో కొనసాగుతున్న కేంద్ర ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సైతం పరిష్కారం అనేది గణాంకాలలో ఘనంగా ఉంటోంది గానీ వాస్తవానికి పరిష్కారం అనేది అనేక ఫిర్యాదులలో కేవలం కాగితాలకే పరిమితమైంది. అలా కాకుండా పరిష్కారం అనేది కార్యరూపం దాల్చాలంటే అధికారుల నుండి నివేదిక అందగానే జిల్లా లేక ముఖ్యమంత్రి కార్యాలయం నుండి సమస్య పరిష్కారం గురించి ఫోన్ ద్వారా లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదుదారుని వాకబు చేయాలి. ఫిర్యాదుదారు పరిష్కారం అయిందని నిర్ధారిస్తే అప్పుడు ఫిర్యాదు ముగించాలి. పరిష్కారం కాలేదని చెబితే అధికారులను ఫిర్యాదుదారుని ఇరువురిని ప్రత్యేక యంత్రాంగం ద్వారా పిలిపించి అవసరం అయితే లోక్‌అదాలత్‌కి పంపి సాక్షాధారాలు పరిశీలించి తీర్మానం చేయాలి. ఈ ప్రక్రియలో అధికారుల స్థాయిలో పరిష్కారంకాదని కోర్టు ద్వారా మాత్రమే పరిష్కారం లభిస్తుందని నిర్ణయిస్తే ఫిర్యాదారు తన సమస్య పరిష్కారంకి సంబంధించి కోరిన పత్రాలు, ప్రమాణ పత్రం ద్వారా సమాచారం మొత్తం అందజేసి సహకరించాలి. తద్వారా కోర్టులో అనవసరపు కొర్రిలతో కాలయాపన లేకుండా త్వరితగతిన తీర్పుకి మార్గం సుగమం చేయాలి. వివిధ కోర్టులలో దాఖలు అవుతున్న సివిల్ వివాదాల సంఖ్యని బట్టి సమస్యల పరిష్కార శాతాన్ని నిర్ణయించాలి. పౌరులు ప్రతి చిన్న సమస్యకి కోర్టులను ఆశ్రయించే దుస్థితిని నివారించాలి. ఇంక రెండవది సంక్షేమ పథకాలు. వీటిలో అనర్హులు జొరపడకుండా పార్టీలకు అతీతంగా కఠినంగా ఉండాలి. అలాగే అర్హులలో ఏ ఒక్కరూ అవకాశం కోల్పోకూడదు. అర్హతల అనర్హతల విషయంలో అధికారులను జవాబుదారీ చేయాలి. ఇక మూడవది అభివృద్ధి. అన్ని రంగాలలో అభివృద్ధి అనేది తప్పనిసరి. ఇది సుపరిపాలనలో మరొక భాగం అది. ఇక నాలుగవ అంశం అవినీతి నిర్మూలన. అవినీతి అనేది ప్రపంచ వ్యాప్తంగా ఉన్నదని మంత్రం వేసినట్టు రోజులలో గంటలలో పోయేది కాదని అది విస్మరించదగిన అంశాలలో ఒకటిగా భావిస్తూ దాటివేతను పారిపోవటంగానే పరిగణలోకి వస్తుంది. అసలు అవినీతికి ఆక్సిజన్‌లా ఉపయోగపడుతున్న అంశాలు ఏమిటో వాటి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. మన దేశంలో, రాష్ట్రంలో సైతం



అవినీతి కారణంగా ఎన్నో జీవితాలు అర్థాంతరంగా ముగుస్తున్నాయి. అవినీతి ఎందరి జీవితాల్లోనో చిచ్చు రేపుతోంది. మరెన్నో కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తోంది. అందరినీ కష్టనష్టాలకు గురిచేస్తోంది. అవినీతితో సర్దుకుపోవాల్సిన, కలిసి జీవించాల్సిన దుస్థితి ఏర్పడింది. మరో కోణంలో ఆలోచిస్తే కొందరి అవినీతి మరి కొందరి నిర్భాగ్యుల జీవితాలకు ఆసరాగా నిలుస్తోంది. ఇది మరో కోణం. ఉదాహరణకు ప్రభుత్వ వైద్యశాలలో అడుగడుగునా డబ్బు వెదజల్లితేమంచి వైద్యం లభించి ప్రాణాలు నిలుస్తాయి. ప్రైవేట్, కార్పొరేట్ వైద్యశాలలో అయ్యే ఖర్చులతో పోల్చుకుంటే ప్రభుత్వ వైద్యశాలలో మామూళ్లకు ఖర్చుచేసే డబ్బు నాలుగోవంతు మాత్రమే. అంటే మొత్తం ఖర్చు భరించలేని వారికి నాలుగోవంతు ఖర్చుతో ప్రభుత్వవైద్య నారాయణులు వైద్య సేవలు అందిస్తున్నారు. వాళ్ళ అవినీతి నాలుగో వంతు భరించగలిగిన వారిని ఆదుకుంది. భరించలేని వారికి పరలోక ప్రాప్తి కలిగిస్తున్నారు. కాబట్టి అభాగ్యుల దృష్టిలో ప్రభుత్వం, వైద్యులు, సిబ్బంది కనిపించే దైవాలు. కారణ జన్ములు. అలాగే రేషన్ కార్డు ఉన్నాగాని సరిపోని వారు బయట నల్ల బజారులో అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో బియ్యం కిలో 50 రూపాయల పై మాటే. ఉచిత వ్యయం బ్లాకులో 20 రూపాయల నుండి 30 రూపాయలకు దొరుకుతున్నాయి. బహిరంగ మార్కెట్లో బియ్యం కిలో 50 రూపాయలు పైన కొనుగోలు చేయలేని వారు నల్ల బజారులో బియ్యం కొనుగోలు చేసి చేసి బ్రతుకు బండి ఈడుస్తున్నారు. వీళ్ల దృష్టిలో అక్రమాలకు పాల్పడే రేషన్‌డీలర్లు, రైస్ మిల్లర్లు, అవినీతికి పాల్పడే అధికారులు, తమ బ్రతుకులు అలా కావడానికి కారకులైన రాజకీయ నాయకులు కనిపించే ప్రత్యక్ష దైవాలు. అవినీతి అక్రమాలు లేకపోతే ప్రభుత్వం ఇచ్చేది చాలక బ్లాక్లోసైతం దొరకక అర్థాకలితో జీవితాలు ముగించాల్సి వస్తుందని వాళ్ల భయం. కాగా, అవినీతిరహిత పాలన అందిస్తామని ఇంట్లోకూర్చుని వాట్సాప్ ద్వారా దాదాపు 350ప్రభుత్వ సేవలు ఇంకా ఫిర్యాదులు సైతం పరిష్కారం పొందవచ్చునని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అది కల కాదు నిజమేనని సేవలు పొందిన దరఖాస్తుదారులు లేక ఫిర్యాదారులు తమ అనుభవాన్ని తెలపాలి (ఫీడ్ బ్యాక్). అలాగే వంట గ్యాస్ రాయితీ పొందటంలో ఏదైనా సమస్య ఎదురైతే 1967 నెంబర్‌కి ఫోన్ చేస్తే పరిష్కారం అవుతుందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఏప్రిల్ నెలనుండి డబ్బు చెల్లించి గ్యాస్‌బండ తీసుకున్నవారికి ఇప్పటికీ రెండు నెలలు గడిచినా గాని అనేక మందికి రాయితీ డబ్బుబ్యాంకులో జమ కాలేదు. ప్రభుత్వం రాయితీ డబ్బు విడుదల చేసిందని ఏప్రిల్ నెలలోనే పత్రికలలో వార్తలు వచ్చాయి. రాయితీ లభించని వారు 1968 నెంబర్‌కి ఎన్నిసార్లు ఫోన్ చేసినా గాని బిజీ అని వస్తుంది. లైన్ కలవదు కొన్నిసార్లు మీరు ఫోన్ చేసిన వ్యక్తి ఏ ఫోన్ స్వీకరించుట లేదు కాసేపాగి ప్రయత్నించండని వస్తుంది. ఆ నెంబరు వినియోగదారుల సహనానికి పరీక్ష. ఎవరిని అడగాలో తెలీదు. వార్డు, గ్రామ సచివాలయాలలో, గ్యాస్ డీలర్లను అడిగితే తమకి తెలియదు అంటారు. పౌర సరఫరాల శాఖను అడిగితే ఎప్పుడు వస్తాయో చెప్పరు. విసిగిస్తున్నారని కసురుకుంటారు. అలాగే వాట్సప్‌కి సమస్య చెబుదామంటే సాధ్యం కాదు. నమోదు కాదు ఆశల పల్లకిలో ఊరేగినట్లే ఉంటుంది. కొంచెం ఎక్కువ తక్కువ చేస్తున్న ప్రభుత్వాన్ని విమర్శించడం కాదు కానీ అమలు తీరు అధికారులు కచ్చితంగా పరిశీలించాలి లేకపోతే ప్రజలకి అవిచేస్తాం, ఇవి చేస్తాం అని చెప్పి తీరని ఆశలు కల్పించినట్లు అవుతుంది. దాని ప్రభావం ఎన్నికలలో కచ్చితంగా కనిపిస్తుంది. అలాగే మీసేవ కేంద్రాలు అనేక సేవలు అందిస్తున్నాయి. అయితే తప్పనిసరిగా వీటిద్వారా మాత్రమే వివిధ ప్రభుత్వ సేవలకు దరఖాస్తులు సమర్పించాలని 10 సం॥ క్రితమే నిబంధన విధించారు. ఏదైనా సమస్యవచ్చినా గానిచెప్పరు ఎందుకంటే ప్రయోజనాలు నిలిపి వేస్తారేమోనని భయం ఒకటి ఉంటుంది. ఫిర్యాదుల పరిష్కార వేదికలు పటిష్టంగా ఉండీ, పబ్లిక్ సర్వెంట్లలో బాధ్యత, జవాబుదారి ఏర్పరిస్తే పరిపాలనఅంతా సక్రమంగానే సాగుతుంది. దానికి ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదు. ఎన్నికలలో ఓటర్లు పెద్ద సర్టిఫికెటే ఇస్తారు. •

# ముంబయి ఎన్నికల్లో ఎవరికి వారే!

**పొత్తులపై తెగని చర్చలు, ఎంవీఏలో ఒంటరిపోరుకే మొగ్గు**



**ముంబయి,జులై 1 :** బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ బీఎంసీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మహారాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అధికార కూటమి మహా వికాస్ అఘాడీ ఎంవీఏలో విభేదాలు బయటపడ్డాయి. బీఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయాలని, మిత్రపక్షాలైన శివసేన ఉద్ధవ్ వర్గం, ఎన్సీపీ శరద్ పవార్ వర్గంతో పొత్తు వద్దని మహారాష్ట్ర కాంగ్రెస్‌లోని ఓ వర్గం నేతలు గట్టిగా పట్టుబడుతున్నారు. ఈ మేరకు తమ అభిప్రాయాన్ని పార్టీ అధిష్ఠానం ముందు ఉంచారు. ఢిల్లీలో నిన్న కాంగ్రెస్ అధిష్ఠానం మహారాష్ట్ర నేతలతో ఓ కీలక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ రమేశ్ చెన్నితాల, రాజ్యసభ సభ్యుడు ముకుల్ వాస్నిక్, మాజీ పీసీసీ అధ్యక్షుడు నానా పటోలే వంటి ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నేతలు బీఎంసీ ఎన్నికల వ్యూహంపై తమ ఆందోళన వ్యక్తం చేశారు. ఎంవీఏ కూటమిగా బరిలోకి దిగితే ముంబై నగరంలో కాంగ్రెస్ పార్టీ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని అధిష్ఠానానికి వివరించారు. కూటమి పొత్తుల వల్ల పార్టీ తీవ్రంగా నష్టపోతోందని నేతలు వివరించారు. ముఖ్యంగా, కాంగ్రెస్‌కు అండగా ఉండే మైనారిటీ ఓట్లు క్రమంగా ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన వైపు మళ్లుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో, హిందుత్వ భావజాలం ఉన్న ఓటర్లు కాంగ్రెస్‌కు మద్దతివ్వడం లేదని, దీంతో పార్టీ రెండు వైపులా నష్టపోతోందని వారు పేర్కొన్నారు. అత్యంత సంపన్నమైన బీఎంసీలో పట్టు కోల్పోతే భవిష్యత్తులో పార్టీ కోలుకోవడం కష్టమని వారు అభిప్రాయపడ్డారు. గత ఎన్నికల ఫలితాలు కూడా కాంగ్రెస్ నేతల ఆందోళనకు బలం చేకూరుస్తున్నాయి. 2017 బీఎంసీ ఎన్నికల్లో మొత్తం 227 స్థానాలకు గాను కాంగ్రెస్ కేవలం 31 సీట్లు మాత్రమే గెలుచుకుంది. అంతకుముందు 2012లో 56, 2007లో 75 స్థానాలు దక్కించుకున్న పార్టీ, క్రమంగా తన బలాన్ని కోల్పోతూ వస్తోంది. అంతేకాకుండా, గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎంవీఏ కూటమి ఘోరంగా విఫలమైంది. మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు గాను ఎంవీఏ కేవలం 46 సీట్లకే పరిమితం కాగా, అందులో కాంగ్రెస్ గెలిచింది కేవలం 16 స్థానాలే. కాంగ్రెస్ అధిష్ఠానం ఈ క్లిష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం రాకపోవచ్చని తెలుస్తోంది. ఎందుకంటే, శివసేన ఉద్ధవ్ వర్గం కూడా బీఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయాలనే ఉద్దేశంతో ఉన్నట్టు ఇప్పటికే సంకేతాలిచ్చింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఒంటరి పోరుకు సిద్ధమయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. బీఎంసీ ఎన్నికలు ఈ ఏడాది చివర్లో గానీ, వచ్చే ఏడాది ఆరంభంలో గానీ జరగనున్నాయి.



## కేంద్రంలో అధికారంలోకి రాగానే ఆర్ఎస్ఎస్‌పై నిషేధం!

**బెంగళూరు,జులై 1 :** కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)పై నిషేధం విధిస్తామని కర్ణాటక మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ప్రియాంక్ ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్ఎస్ఎస్ సంస్థ దేశంలో విద్వేషాలను ప్రోత్సహిస్తోందని, రాజ్యాంగ పరిధికి లోబడి నడుచుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ప్రియాంక్ ఖర్గే మాట్లాడుతూ 'ఒకవేళ మేము కేంద్రంలో తిరిగి అధికారంలోకి వస్తే, ఆర్ఎస్ఎస్‌ను కచ్చితంగా నిషేధిస్తాం. గతంలో ఇందిరా గాంధీ కూడా ఆ పని చేయలేదా? వారు కేవలం చట్టాన్ని అనుసరిస్తున్నట్లు పైకి కనిపిస్తారు. కానీ వారి అసలు ఉద్దేశాలు వేరు' అని అన్నారు. శాసనసభ్యుల పని చట్టాలు చేయడమని, తాము రాజ్యాంగానికి అతీతంగా ఎలాంటి చర్యలు తీసుకోమని ఆయన స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్‌కు అందిన రూ. 250 కోట్ల నిధులపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ఆ నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో తేల్చేందుకు తప్పనిసరిగా దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.



## భారత్‌కు విదేశీ జమలు 136 బిలియన్ డాలర్లు

**గత యేడాదికంటే 14% అధికం.**

**న్యూఢిల్లీ,జులై 1:** విదేశాల్లో స్థిరపడిన భారతీయులు తమ కష్టార్జితాన్ని దేశానికి పంపడంలో సరికొత్త రికార్డు సృష్టించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశానికి అందిన విదేశీ జమలు ఏకంగా 135.46 బిలియన్ డాలర్లకు చేరాయి. గతేడాదితో పోలిస్తే ఇది 14 శాతం అధికమని ఆర్‌బీఐ వెల్లడించింది. విదేశాల నుంచి సొమ్మును స్వీకరించడంలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రపంచ బ్యాంకు ఆర్థికవేత్తలు రూపొందించిన నివేదిక ప్రకారం, 2024క్యాలెండర్ ఇయర్‌లో భారత్‌కు 129.4 బిలియన్ డాలర్ల జమలు వచ్చాయి. ఈ జాబితాలో 68 బిలియన్ డాలర్లతో మెక్సికో రెండో స్థానంలో, 48 బిలియన్ డాలర్లతో చైనా మూడో స్థానంలో ఉన్నాయి. ఫిలిప్పీన్స్ 40 బిలియన్ డాలర్లు, పాకిస్థాన్ 33 బిలియన్ డాలర్లు ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. 2023లో కేవలం 1.2శాతంగా ఉన్న రెమిటెన్స్‌ల వృద్ధి రేటు 2024లో ఏకంగా 5.8 శాతానికి పెరగడం గమనార్హం.

## భారీ వర్షాలకు మిల్లులో కరిగిపోయిన చక్కెర

**రూ.60 కోట్లకుపైగా నష్టమని యాజమాన్యం అంచనా**

**చండీగఢ్,జులై 1:** దేశవ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. హర్యానాలో కుండపోత వర్షాలకు ఆసియాలోనే అతిపెద్ద చక్కెర కర్మాగారంగా పేరుగాంచిన సరస్వతి షుగర్ మిల్లులో భారీ నష్టం వాటిల్లింది. వరద నీరు గిడ్డంగిలోకి చేరడంతో సుమారు రూ.60 కోట్ల విలువైన పంచదార నీటిపాలైంది. యమునానగర్‌లోని ఈ మిల్లులో రాత్రికి రాత్రే ఈ ఘటన చోటుచేసుకుంది. మిల్లు పక్కనే ఉన్న కాల్వ పొంగిపొర్లడంతో వరద నీరు ఒక్కసారిగా ప్రాంగణంలోకి చేరిందని సరస్వతి షుగర్ మిల్ జనరల్ మేనేజర్ రాజీవ్ మిశ్రా తెలిపారు. గిడ్డంగిలో నిల్వ ఉంచిన 2.20 లక్షల క్వింటాళ్ల పంచదారలో అత్యధిక భాగం తడిసిపోయిందని ఆయన వెల్లడించారు. సుమారు 50నుంచి 60 కోట్ల రూపాయల నష్టం వాటిల్లి ఉండవచ్చని అంచనా వేస్తున్నామని ఆయన వివరించారు. అయితే ఈ నష్టం వల్ల స్థానికమార్కెట్లపై పంచదార సరఫరాకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన స్పష్టం చేశారు.

# నా తరపున ఎవ్వరూ మాట్లాడొద్దు

**అంతా హైకమాండ్ చూసుకుంటుంది**

**కర్ణాటక డిప్యూటీ సిఎం శివకుమార్**



**బెంగళూరు, జులై 1:** కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పుపై జరుగుతున్న ప్రచారం రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ముఖ్యమంత్రి మార్పు ఖాయమని, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు 100 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని ఆయన వర్గానికి చెందిన నాయకుల ప్రకటనలతో మొదలైన ఈ వివాదం, కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యంతో సద్దుమణిగిందని అనుకుంటున్న తరుణంలోనే మరో రూపంలో బయటపడింది. ఒక సీనియర్ ఎమ్మెల్యే ఫోన్ సంభాషణకు సంబంధించిన వీడియో లీక్ అవ్వడంతో ఈ వ్యవహారం కొత్త మలుపు తీసుకుంది. కొద్ది రోజులుగా కర్ణాటకలో ముఖ్యమంత్రిని మారుస్తారని, రెండు మూడు నెలల్లో డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ఆయన మద్దతుదారుడైన ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి కేంద్ర బిందువుగా మారాయి. ఈ నేపథ్యంలో స్పందించిన డీకే శివకుమార్ ఆ వ్యాఖ్యలను ఖండించారు. నా తరపున ఎవరూ మాట్లాడొద్దు. పార్టీ ప్రయోజనాలే నాకు ముఖ్యం. మనమంతా 2028 ఎన్నికలపై దృష్టి పెట్టాలి. కాంగ్రెస్‌లో వర్గాలు లేవు. మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో పనిచేస్తున్న ఒకే ఒక కాంగ్రెస్ ఉందని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తగా అధిష్ఠానం ఆదేశాలను పాటించడమే తన విధి అని ఆయన పేర్కొన్నారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం వెంటనే రంగంలోకి దిగింది. పార్టీ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సూర్జేవాలాను హుటాహుటిన కర్ణాటకకు పంపింది. ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో నాయకత్వ మార్పు ఉండబోదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న గ్యారంటీ పథకాలను అడ్డుకునేందుకే బీజేపీ ఇలాంటి నిరాధారమైన పుకార్లను సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. అధిష్ఠానం, డీకే శివకుమార్ ఇద్దరూ పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్న సమయంలోనే సీనియర్ నేత బీఆర్ పాటిల్‌కు సంబంధించిన ఒక వీడియో బయటకు రావడం కలకలం రేపింది. ఆ వీడియోలో ఆయన ఒకరితో ఫోన్‌లో మాట్లాడుతూ సిద్ధరామయ్యకు లాటరీ తగిలింది. ఆయన్ను సోనియా గాంధీకి పరిచయం చేసిందే నేను. ఆయన అదృష్టం బాగుండి ముఖ్యమంత్రి అయ్యారు. నాకు ఏ గాడ్ ఫాదర్ లేరు. నేను సూర్జేవాలాను కలిసి చెప్పాల్సింది చెప్పాను. ఏం జరుగుతుందో చూద్దాం అనడం స్పష్టంగా వినిపించింది.

# తొక్కిసలాటకు తప్పంతా ఆర్సీబిదే

**ఐపిఎస్ అధికారి సస్పెన్షన్ రద్దు చేసిన క్యాట్**




**బెంగళూరు,జులై 1:** బెంగళూరులో ఇటీవల చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఫ్రాంచైజీదే ప్రధాన తప్పిదమని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (క్యాట్) తేల్చి చెప్పింది. ఆర్సీబీ అనాలోచితంగా వ్యవహరించడం వల్లే లక్షలాది మంది అభిమానులు ఒక్కచోట చేరి గందరగోళం నెలకొందని అభిప్రాయపడింది. ఈ ఘటనకు సంబంధించి సస్పెన్షన్‌కు గురైన ఒక సీనియర్ ఐపీఎస్ అధికారికి ఉపశమనం కలిగిస్తూ ఆయన సస్పెన్షన్‌ను రద్దు చేసింది. ఇటీవల బెంగళూరులో ఆర్సీబీ విజయోత్సవ కార్యక్రమానికి భారీ సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటన తర్వాత ఐపీఎస్ అధికారి వికాస్ కుమార్‌ను సస్పెండ్ చేశారు. తన సస్పెన్షన్‌ను సవాలు చేస్తూ ఆయన క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన క్యాట్ బెంగళూరు బెంచ్, ఆర్సీబీ వైఖరిని తప్పుబట్టింది. దాదాపు 3 నుంచి 5 లక్షల మంది ప్రజలు గుమిగూడటానికి ఆర్సీబీనే కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. పోలీసుల నుంచి అవసరమైన అనుమతులు తీసుకోకుండా, అకస్మాత్తుగా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో ఈ గందరగోళం తలెత్తిందని క్యాట్ తన తీర్పులో పేర్కొంది. ఇంత తక్కువ సమయంలో అంత పెద్ద జనసందోహాన్ని నియంత్రించేందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసుల నుంచి ఆశించడం సరికాదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా క్యాట్ కీలక వ్యాఖ్యలు చేసింది. పోలీసులు కూడా మనుషులే, దేవుళ్లు కారు. వారి దగ్గర ఎలాంటి మంత్రదండాలు ఉండవని వ్యాఖ్యానించింది. భారీ సంఖ్యలో జనం వస్తున్నప్పుడు, అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుందని కానీ ఈ ఘటనలో పోలీసులకు ఆ సమయం ఇవ్వలేదనే విషయం స్పష్టంగా అర్థమవుతోందని ట్రిబ్యునల్‌పేర్కొంది. ఈ కారణాలను వివరిస్తూ, ఐపీఎస్ అధికారి వికాస్‌కుమార్ సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# ఇక ఒకే యాప్‌లో అన్ని సేవలు

**అమల్లోకి తెచ్చిన 'రైల్ వన్' యాప్**





**న్యూఢిల్లీ,జులై 1:** భారతీయ రైల్వే కొత్త యాప్ 'రైల్ వన్'ని ప్రారంభించింది. ప్రయాణికులకు ఒకేచోట అన్ని సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో సూపర్ యాప్‌ని తీసుకువచ్చింది. ఐఆర్‌సీటీసీ రిజర్వ్‌డ్, అన్‌రిజర్వ్‌డ్, ప్లాట్‌ఫామ్ టికెట్లను బుక్ చేసుకోవడంతో పాటు పీఎన్ఆర్ స్టేటస్, రైలు స్టేటస్ ట్రాక్, కోచ్ పొజిషన్, రైల్ మదద్ సేవలు అందించడంతో పాటు అభిప్రాయాలను సైతం ఒకే యాప్ ట్రాక్ చేయనున్నది. స్పష్టమైన ఇంటర్‌ఫేస్ యూజర్లకు మరింత మెరుగైన అనుభవం అందించేందుకు యాప్‌ని ప్రవేశపెట్టింది. భారతీయ కొత్త రైల్ వన్ యాప్ గూగుల్ ప్లే స్టోర్, ఐఓఎస్ యాప్ స్టోర్ డౌన్‌లోడ్ చేసుకునేందుకు అందుబాటులోకి తెచ్చారు. గతంలో భారతీయ రైల్వేల సేవలకు వివిధ యాప్స్ ఉండేవి. దాంతో అన్ని పాస్‌వర్డ్‌లను గుర్తుంచుకోవడం ఇబ్బందికరంగా ఉండేది. ఈ యాప్‌తో ఒకేసారి సైన్ ఇన్ అవడంతో ఎక్కువ పాస్‌వర్డ్‌లు గుర్తుంచుకో వాల్సిన పని తప్పింది. యూజర్లు యాప్‌ను డౌన్‌లోడ్ చేసిన తర్వాత ప్రస్తుతం ఉన్న రైల్ కనెక్ట్ లేదంటే యూటీఎస్‌ఆన్‌మొబైల్ ఐడీని ఉపయోగించి లాగిన్ అవ్వొచ్చు. ఎంపిన్, బయోమెట్రిక్ ద్వారా అకౌంట్స్‌ను యాక్సెస్ చేసుకోవచ్చు. ఎంక్వైరీ కోసం మొబైల్ నంబర్/ఓటీపీ అథంటికేషన్ ద్వారా గెస్ట్ యాక్సెస్ సైతం అందుబాటులో ఉంది. ప్రస్తుతం ప్రయాణికులు ప్రస్తుతం వివిధ సేవల కోసం బహుళ యాప్‌లు, వెబ్‌సైట్‌లను యాక్సెస్ చేస్తున్నారు. టికెట్ల బుకింగ్ కోసం రైల్ కనెక్ట్, భోజనం ఆర్డర్ చేయడానికి ఫుడ్ ఆన్ ట్రాక్, ఫీడ్‌బ్యాక్ అందించేందుకు రైల్ మదద్, అన్ రిజర్వ్‌డ్ టికెట్ల కోసం యూటీఎస్, రైలు స్టేటస్ తెలుసుకునేందుకు నేషనల్ ట్రైన్ ఎంక్వైరీ సిస్టమ్‌ను వినియోగిస్తున్నారు. టికెట్ల బుకింగ్ కోసం ప్రత్యేక హక్కులు ఉన్న ఆర్‌సీటీసీ రైల్ కనెక్ట్ 100 మిలియన్స్ డౌన్‌లోడ్స్‌ను అధిగమించింది. ఈ యాప్ రైల్వేలోనే అత్యంత ప్రజాదారణ ఉన్న యాప్‌గా నిలిచింది. ఇతర ప్లాట్‌ఫామ్స్ సైతం టికెట్ బుకింగ్స్ కోసం ఐఆర్‌సీటీసీపైనే ఆధారపడుతుంటాయి. భారతీయ రైల్వే టికెట్ల బుకింగ్‌లో పలు మార్పులు చేసింది. ప్రయాణీకుల రిజర్వేషన్ వ్యవస్థలో గణనీయమైన మార్పులను అమలు చేస్తోంది. ప్రస్తుతం రైలు బయలుదేరడానికి నాలుగు గంటల ముందు చార్ట్ తయారవుతుండగా ఇకపై ఎనిమిది గంటల ముందే రైల్వే చార్ట్‌ను ప్రిపేర్ చేయనున్నది. దాంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పనున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు గంటలకు బయలుదేరే చార్ట్ ముందురోజు రాత్రి 9 గంటలకు రెడీ అవుతుంది. మరో వైపు తత్కాల్ టికెట్ బుకింగ్ లోనూ రైల్వేశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. తత్కాల్ టికెట్లు బుకింగ్‌కు ఆధార్ అథంటికేషన్ తప్పనిసరి చేసింది. దళారులకు అడ్డుకట్ట వేసేందుకు రైల్వేశాఖ ఆధార్‌తో అనుసంధానించింది.

# పోర్చుగల్ బీచ్‌లో క్లౌడ్ వండర్!



**లిస్బన్,జులై 1:** పోర్చుగల్‌లోని ఓ బీచ్‌లో ఆకాశంలో అద్భుతమైన, అదే సమయంలో భయం కలిగించే దృశ్యం కనిపించింది. సముద్రంలో వచ్చే భారీ కెరటంలా ఓ పెద్ద మేఘం తీరం వైపు దూసుకురావడంతో అక్కడున్న పర్యాటకులు ఒక్కసారిగా నివ్వెరపోయారు. ఈ అరుదైన వాతావరణ దృగ్విషయాన్ని 'రోల్ క్లౌడ్' అంటారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సోమవారం పోర్చుగల్‌లోని పోవోవా డో వర్జిమ్ బీచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆకాశంలో పైపు ఆకారంలో ఉన్న ఓ భారీ మేఘం వేగంగా తీరం వైపు కదులుతూ వచ్చింది. అది సమీపిస్తున్న కొద్దీ బలమైన గాలులు వీయడంతో, బీచ్‌లోని గొడుగులు, ఇతర వస్తువులు ఎగిరిపోయాయి. ఊహించని ఈ పరిణామానికి పర్యాటకులు ఆందోళనకు గురయ్యారు. మరికొందరు భయంతో పరుగులు తీశారు. వాతావరణ నిపుణుల ప్రకారం ఇది 'రోల్ క్లౌడ్' అనే చాలా అరుదైన మేఘం. వేడి, చల్లని గాలులు ఒకదానికొకటి కలిసినప్పుడు ఇలాంటివి ఏర్పడతాయి. ఇవి చూడటానికి సునామీ అలల్లా కనిపించినా, వీటికి సునామీలకు ఎలాంటి సంబంధం లేదని నిపుణులు స్పష్టం చేశారు. ఇవి భూమికి సమాంతరంగా కదులుతూ, దొర్లుతున్నట్లు కనిపిస్తాయి. ప్రస్తుతం పోర్చుగల్ తీవ్రమైన వడగాల్పులతో అల్లాడుతోంది. దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో వాతావరణంలో అస్థిరత నెలకొంది. దీని కారణంగానే సోమవారం ఇలాంటి వింత మేఘాలు ఏర్పడినట్లు యూరోన్యూస్ కథనం పేర్కొంది. మరో వైపు పెరుగుతున్న ఎండల కారణంగా అటవీ ప్రాంతాల్లో కార్చిచ్చు ప్రమాదం చాలా ఎక్కువగా ఉందని జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది.




## మరో 'ఎయిరిండియా'కు త్రుటిలో తప్పిన ప్రమాదం

**టేకాఫ్ అయిన కొద్దిసేపటికే 900 అడుగుల కిందకు విమానం**

**న్యూఢిల్లీ,జులై 1 :** అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాద విషాదం నుంచి దేశం ఇంకా తేరుకోకముందే ఎయిరిండియాకు చెందిన మరో విమానం పెను ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకుంది. ఢిల్లీ నుంచి వియన్నా వెళ్తున్న విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే గాల్లో ఒక్కసారిగా 900 అడుగుల కిందకు రావడంతో ప్రయాణికులు భయంతో వణికిపోయారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 14న ఢిల్లీ నుంచి వియన్నాకు బయలుదేరిన ఎయిరిండియా బోయింగ్ 777 విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ప్రతికూల వాతావరణం కారణంగా విమానం అకస్మాత్తుగా భూమివైపు దూసుకెళ్లింది. 900 అడుగుల మేర కిందకి దిగడంతో వెంటనే ప్రమాద హెచ్చరిక సిగ్నల్స్ మోగాయి. అప్రమత్తమైన పైలట్లు వెంటనే విమానాన్ని తమ నియంత్రణలోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికి అహ్మదాబాద్ దుర్ఘటన జరిగి రెండు రోజులు మాత్రమే అయింది. ఈ ఘటనతో విమానంలోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ ఘటనను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తీవ్రంగా పరిగణించింది. తక్షణమే విచారణకు ఆదేశించడమే కాకుండా, ఆ విమానాన్ని నడిపిన ఇద్దరు పైలట్లను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ గతనెల 17న ఎయిరిండియా భద్రతావిభాగాధిపతికి డీజీసీఏసమన్లు జారీ చేసింది. వరుస ఘటనల నేపథ్యంలో దేశంలోని ప్రధాన విమానాశ్రయాల్లో డీజీసీఏ ఇటీవల విస్తృత తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో విమానయాన భద్రతా వ్యవస్థల్లో పలు తీవ్రమైన లోపాలు ఉన్నట్లు గుర్తించింది. ఒక విమానాశ్రయంలో అరిగిపోయిన టైర్లతో ఒక విమానం నిలిచిపోయినట్లు, మరికొన్ని విమానాల్లో ఒకేరకమైన సాంకేతిక సమస్యలు పదేపదే తలెత్తినట్లు డీజీసీఏ తన నివేదికలో పేర్కొంది. ఒక చోట పైలట్లకు శిక్షణ ఇచ్చే సిమ్యులేటర్ సాఫ్ట్‌వేర్ కూడా అప్‌డేట్ చేయలేదని, అది ప్రస్తుత విమానం కాన్ఫిగరేషన్‌తో సరిపోలడంలేదని వెల్లడించింది. పర్యవేక్షణ, సమస్యల పరిష్కారంలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని ఈ అంశాలు స్పష్టం చేస్తున్నట్లు డీజీసీఏ అభిప్రాయపడింది.

## ఆసుపత్రిలో యువతి దారుణ హత్య



**నర్సింగ్‌పూర్(భోపాల్),జులై 1:** వైద్యం అందించి ప్రాణాలు కాపాడాల్సిన ఆసుపత్రే ఓ యువతి పాలిట మృత్యుశాలగా మారింది. మధ్యప్రదేశ్‌లోని నర్సింగ్‌పూర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. పట్టపగలు, అందరూ చూస్తుండగానే ఓ ఉన్మాది 19 ఏళ్ల యువతిని గొంతు కోసి కిరాతకంగా హత్య చేశాడు. ఆసుపత్రి సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు అక్కడే ఉన్నా ఎవరూ అడ్డుకునే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం. నర్సింగ్‌పూర్‌కు చెందిన 19 ఏళ్ల ఇంటర్ విద్యార్థిని ఈ నెల 27న ఆసుపత్రికి వచ్చింది. ప్రసూతి వార్డులో ఉన్న స్నేహితురాలి బంధువును చూసేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి మధ్యాహ్నం 2 గంటల సమయంలో బయలుదేరింది. అయితే, ఆమెను కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్న అభిషేక్ కోష్టి అనే యువకుడు అప్పటికే ఆసుపత్రి వద్ద ఆమె కోసం ఎదురుచూస్తున్నాడు. వార్డు నంబర్ 22 బయట ఆమెతో కొద్దిసేపు మాట్లాడిన అభిషేక్, ఒక్కసారిగా యువతిపై దాడికి దిగాడు. నల్ల చొక్కా ధరించిన అభిషేక్, యువతిని చెంపపై కొట్టి కిందపడేశాడు. ఆమె ఛాతీపై కూర్చుని, తనతో తెచ్చుకున్న కత్తితో గొంతు కోసేశాడు. దాదాపు 10 నిమిషాల పాటు ఈ ఘోరం జరుగుతున్నా అక్కడున్న వైద్యులు, నర్సులు, వార్డు బాయ్‌లు, ఇతర ప్రజలు నిలువరించే ప్రయత్నం చేయకుండా నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయారు. తీవ్ర రక్తస్రావంతో విద్యార్థిని అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. దాడి జరిగిన సమయంలో ట్రామా సెంటర్ బయట ఇద్దరు సెక్యూరిటీ గార్డులు విధుల్లో ఉన్నారు. లోపల వైద్య సిబ్బంది కూడా ఉన్నారు. అయినా ఎవరూ స్పందించలేదు. హత్య చేసిన తర్వాత నిందితుడు అభిషేక్ తన గొంతు కోసుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. అనంతరం అక్కడి నుంచి నేరుగా బయటకు వచ్చి, పార్క్ చేసి ఉన్న బైక్‌పై పరారయ్యాడు. ట్రామా వార్డులో చికిత్స పొందుతున్న 11 మంది రోగులలో ఎనిమిది మంది అదే రోజు డిశ్చార్జ్ తీసుకుని వెళ్లిపోగా, మిగిలిన వారు మరుసటి రోజు ఉదయం ఆసుపత్రిని ఖాళీ చేశారు. మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో ఈ విషయం తెలుసుకున్న బాధితురాలి కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. వారు వచ్చేసరికి కూడా సంధ్య మృతదేహం ఘటనా స్థలంలోనే పడి ఉంది. ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఉన్నతాధికారులు కలుగజేసుకుని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాత్రి 10:30 గంటలకు ఆందోళన విరమించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, ప్రభుత్వ ఆసుపత్రులలో భద్రతపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## ట్రంప్, మస్క్ మధ్య ముదురుతున్న వివాదం

**ఆ రాయితీలే లేకుంటే మస్క్ దుకాణం మూసుకోవలసిందే: ట్రంప్**




**వాషింగ్టన్, జులై 1:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, బిలియనీర్ ఎలాన్ మస్క్ మధ్య వివాదం ముదురుతోంది. టెస్లా అధినేత హెచ్చరికలకు శ్వేతసౌధం నుంచి తీవ్రస్థాయిలో ప్రతిస్పందన వచ్చింది. ట్రంప్ మాట్లాడుతూ 'మానవ చరిత్రలో ఎవరూ పొందనంతగా రాయితీలను ఎలాన్ మస్క్ తీసుకొంటున్నారు' అని ఆరోపించారు. ఒకవేళ అవి లేకపోతే అతడు దుకాణం మూసేసుకుని వెళ్లాల్సిందేనని చెప్పారు. తాజాగా ఆయన మస్క్ ఆరోపణలపై స్పందిస్తూ ట్రూత్‌లో పోస్టు పెట్టారు. 'కొన్నాళ్ల క్రితం వరకు అధ్యక్షుడిగా నాకు అతడు బలమైన మద్దతు ఇచ్చారు. అప్పటికే నేను విద్యుత్ వాహనాలను తప్పనిసరి చేయడాన్ని వ్యతిరేకిస్తున్న విషయం ఎలాన్‌కు బాగా తెలుసు. ఎలక్ట్రిక్ కార్లు మంచివే. కానీ, ప్రతి ఒక్కరూ వాటినే కొనాలని బలవంతం చేయలేం. ఇప్పటివరకు మానవ చరిత్రలో ఎవరూ పొందనంత సబ్సిడీని ఎలాన్ అందుకొన్నారు. ఆ రాయితీలే లేకపోతే ఆయన దుకాణం సర్దుకొని దక్షిణాఫ్రికాలోని ఇంటికి పోవాల్సి వచ్చేదేమో. ఇకపై రాకెట్, ఉపగ్రహ ప్రయోగాలు.. ఎలక్ట్రిక్ కార్ల ఉత్పత్తులు ఉండవు. మన దేశం మరింత సొమ్మును ఆదా చేసుకొంటుంది. ఈ అంశాన్ని డోజ్ పరిశీలించాలి. చాలా పెద్ద మొత్తం ఆదా అవుతుంది' అని ట్రూత్‌లో పేర్కొన్నారు.

అమెరికా చట్ట సభల్లో 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్'ను ఆమోదిస్తే.. తానే కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తానని మస్క్ ప్రకటించారు. బిగ్ బ్యూటిఫుల్ బిల్లుపై మస్క్ మొదటి నుంచి వ్యతిరేకంగా ఉన్న సంగతి తెలిసిందే. ఇది అమెరికా అప్పును ఐదు ట్రిలియన్ డాలర్లకు చేరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యతిరేకత నేపథ్యంలో అధ్యక్షుడికి, టెస్లా అధినేతకు మధ్య విభేదాలు కూడా తలెత్తాయి. ఇటీవల ఈ బిల్లుకు సెనెట్‌లో ఆమోదం లభించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ బిల్లుపై విరుచుకుపడుతూ మస్క్ ఎక్స్ వేదికగా వరుస పోస్టులు పెట్టారు. తాజాగా ట్రంప్ సోషల్ మీడయా పోస్టుకు ఎలాన్ మస్క్ కూడా దూకుడుగానే స్పందించారు. 'ఇప్పుడే ఆ రాయితీలను కత్తిరించండి' అని ట్రంప్‌నకు సవాల్ విసిరారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు కూడా పెట్టారు.

## కంబోడియా నేతతో ఫోన్‌కాల్..థాయ్‌లాండ్ పిఎం సస్పెన్షన్



**బ్యాంకాక్, జులై 1:** థాయ్‌లాండ్ యువ ప్రధానమంత్రి పేటోంగ్టార్న్ పొరుగు దేశం నేతకు చేసిన ఓ ఫోన్‌కాల్ లీక్ అవడం ఆమె ప్రధానమంత్రి పదవికి ఎసరుపెట్టింది. ప్రధాని.. కంబోడియా నేతతో దేశానికి సంబంధించిన విషయాలు చర్చించి, మంత్రివర్గ నీతిని ఉల్లంఘించారని అక్కడి కన్జర్వేటివ్ సెనేటర్ల బృందం ఆరోపించింది. దేశంలోని రాజ్యాంగ నిబంధనలను పేటోంగ్టార్న్ ఉల్లంఘించారని పేర్కొంటూ ఇటీవల ఆమెపై కేసు దాఖలు చేసింది. దానిపై విచారణ జరిపిన ఆ దేశ న్యాయస్థానం ప్రధానిపై సస్పెన్షన్ వేటు వేసింది. తుది తీర్పు వెలువడే వరకు ఈ సస్పెన్షన్ కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఆ తీర్పు ఆమెకు వ్యతిరేకంగా ఉంటే పేటోంగ్టార్న్ ప్రధాని పదవిని కోల్పోయే ప్రమాదం ఉంది.

**అసలేమయ్యిందంటే..?:** కంబోడియా మాజీ ప్రధాని హున్‌సేన్ 2023 వరకు అధికారంలో ఉన్నారు. ఆ తర్వాత పదవి నుంచి దిగిపోగా ఆయన కుమారుడు హున్‌మానెట్ అధికార పగ్గాలు చేపట్టారు. అయితే, పదవిలో లేకపోయినా కంబోడియా రాజకీయాలను ప్రభావితం చేయగల వ్యక్తి హున్‌సేన్. ఇటీవల ఆయనకు థాయ్ ప్రధాని షినవత్రా ఫోన్ చేశారు. అంకుల్ అంటూ ఆయనను సంబోధించిన ఆమె.. తన దేశంలోని పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా థాయ్ ఆర్మీ కమాండర్ తనకు వ్యతిరేకంగా ఉన్నాడని పేర్కొన్నారు. వీరిద్దరి మధ్య జరిగిన ఈ ఫోన్‌కాల్ సంభాషణ లీకైంది.

# మంగళగిరి ఎయిమ్స్‌లో ర్యాగింగ్ కలకలం - 13 మంది విద్యార్థుల సస్పెన్షన్

**మంగళగిరి, జులై 1, ప్రభాతవార్త :** మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) లో ర్యాగింగ్ ఘటన కలకలం రేపింది ఎయిమ్స్ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిపై హాస్టల్లోని సీనియర్లు..

ర్యాగింగ్ కు పాల్పడగా, వేధింపులు తాళలేక గత నెల 22వ తేదీన సదరు విద్యార్థి హాస్పిటల్లో చికిత్స పొందుతూ బాధిత విద్యార్థి యాజమాన్యానికి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై యాజమాన్యం స్పందించి హాస్టల్లోని బాధిత విద్యార్థి రూమ్ లో ఉంటూ, ర్యాగింగ్ కు పాల్పడినట్లు ఆరోపణలపై 15 మంది విద్యార్థులను.. యాజమాన్యం కాలేజీ నుండి సస్పెండ్ చేసి తాత్కాలికంగా హాస్టల్ నుండి పంపించి వేశారు. ఎయిమ్స్ మెడికల్ కాలేజీ లోని యాంటీ ర్యాగింగ్ కమిటీ లో ఉన్న ఓ సభ్యుని కుమారుడు కూడా..

ర్యాగింగ్ కు పాల్పడి తోటి విద్యార్థిని వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఎయిమ్స్ మెడికల్ కాలేజ్ హాస్టల్లో జరిగిన ర్యాగింగ్ ఘటనపై ఎయిమ్స్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై చర్యలు తీసుకునే విషయంపై యాంటీ ర్యాగింగ్ కమిటీ , పోలీసు వారు పూర్తిగా విచారించి తుది నివేదికను మంగళవారం ఏం యాజమాన్యానికి నివేదించగా

ఇందులో 13 మంది విద్యార్థులను దోషులుగా తేల్చి వారిని సస్పెండ్ చేసినట్లు యాజమాన్యం వివరణ ద్వారా తెలిపింది.

మరో ఇద్దరు విద్యార్థులు వారికి ఎటువంటి సంబంధం లేదని నిర్ధారణ అయినట్లు ఎయిమ్స్ యాజమాన్యం తెలియజేసింది.



# ఎన్నికల హామీలు పక్కాగా నెరవేరుస్తున్నాం

### ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సుప్రయాణం

### అభివృద్ధిని చూసి ఓర్వలేక విపక్షాలు రాద్ధాంతం: మంత్రి అచ్చెన్నాయుడు

**సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా) జులై 1,ప్రభాతవార్త ;** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండల ఉమిలాడ పంచాయితీ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఉదయాన్నే మంత్రి పాల్గొని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. తొలుత పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారి అప్పుల ఊబిలో కూరుకు పోయిందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం ఇప్పుడిప్పుడే గాడిన పడి అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందన్నారు. పింఛన్లు, తల్లికి వందనం,, మత్స్యకార భరోసా, దీపం పథకం, అన్నా క్యాంటిన్, మెగా డీఎస్సీ అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. మరో ముఖ్య మైన హామీ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అగస్టు 15 నుంచి అమలు చేయబోతున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వానికి రూ. 2,400 కోట్లు ఆర్థిక భారమైనా కూడా ఉచిత బస్సు పథకం అమలు చేసి మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని అన్నారు. గత ఐదేళ్లలో మత్స్యకారుల అభ్యున్నతిని విస్మరించారని, వారికి పరికరాలు ఇవ్వలేదని, చేపల వేట నిషేధం సమయంలో భృతి కింద రూ.10 వేలు తప్ప మరేమి ఇవ్వలేదని విమర్శించారు. వైకాపా నేత జగన్ రెడ్డికి రాష్ట్రంలో గంజాయి బ్యాచ్‌ల వద్దకు పరామర్శలకు వెళ్లడం, బెట్టింగ్ బ్యాచ్ వ్యక్తుల విగ్రహాలను ఆవిష్కరించడం తప్ప ఇంకేం పని లేదని అచ్చెన్న ఆక్షేపించారు. వైసీపీ నేతలు తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు రాష్ట్రాన్ని అస్తవ్యస్థం చేశాయని విమర్శించారు. గత ప్రభుత్వంలో రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టేందుకు ఒక్క పరిశ్రమ కూడా రాలేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఉన్న జగన్ భూతాన్ని వెయ్యి అడుగుల లోతు గొయ్యి తవ్వి అందులో కప్పి బయటకు రాకుండా చేస్తామని తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల అభివృద్ధిని విస్మరించారని, గ్రామాల్లో ఒక్క సీసీ రహదారికి కూడా శంకుస్థాపన చేపట్టలేదని, నేడు సిగ్గు లేకుండా కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి గురించి అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు.

పరామర్శల పేరుతో నాటకాలు ఆడుతున్నారని, సొంత కార్యకర్త కారు కిందపడి చనిపోతే పరామర్శ చేయకుండా గంజాయి బ్యాచ్ వద్దకు, అవినీతి చేసి జైళ్ళకు వెళ్లిన వారిని పరామర్శించడం రాజకీయ నాయకుడి లక్షణమా అని ప్రశ్నించారు.

# అత్యాచార నిందితులకు కఠిన శిక్షలు

## - వేపర్ల కేసులో నిందితునికి జీవిత ఖైదు- లక్ష జరిమానా, మరొకరికి కఠిన కారాగారం, 25 వేలు జరిమానా : డిజిపి హరీష్‌కుమార్‌గుప్తా

**విజయవాడ,జూలై 1,ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళలపై జరుగుతున్న దాడులు, వారిపై అత్యాచారాలకు పాల్పడే నిందితులను కఠినంగా శిక్షిస్తామని ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఈ కేసుల్లో నిందితులపై నేరారోపణలకు తగిన సాక్ష్యాధారాలను పోలీసు నూతన సాంకేతిక విజ్ఞానాన్ని వినియయోగిస్తున్నామని తెలిపారు. డీజీపీ కార్యాలయం నుంచి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో క్రైమ్ ఎగ్నెస్ట్ విమెన్ కేసుల్లో దాదాపు అన్ని కేసుల్లో శిక్షలు పడుతున్నాయని తెలిపారను. మహిళాపై అత్యాచారం కేసులో నిందితునికి జీవిత ఖైదు వేపర్లలో 33 ఏళ్ల మహిళపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడు తిప్పాబత్తిన క్రిష్ణయ్య అలియాస్ ఒబులయ్య (54)కి జీవిత ఖైదుతోపాటు రూ.1 లక్ష జరిమానా విధిస్తూ కడపలోని అదనపు సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది. 2022 జనవరి 11న మైలవరం మండలం, వేపర్ల గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలు ఇంట్లోకి నిందితుడు బలవంతంగా చొరబడి ఆమెపై అత్యాచారం చేశాడు. బాధితురాలు అదే రోజున సాయంత్రం మైలవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. బాధితురాలు మహిళా మేజిస్ట్రేట్ ఎదుట (164 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం) ఇచ్చిన వాంగ్మూలం, స్థానికుల నుండి సేకరించిన వాంగ్మూలాలు, నిందితుడి సామర్థ్య పరీక్ష మరియు ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికల ఆధారంగా పూర్తి సాక్ష్యాలు సేకరించి కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ అనంతరం న్యాయస్థానం నిందితుడికి జీవిత ఖైదు శిక్షతోపాటు ఐపీసీ సెక్షన్ 376 కింద రూ.1,00,000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో 3.6 సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించాల్సిందిగా న్యాయస్థానం తీర్పు వెలువరించింది. సెక్షన్ 448 కింద ఏడాది పాటు సాధారణ జైలు శిక్ష మరియు రూ.1,000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మూడునెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సిందిగా న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యాస్మిన్ బాదితురాలి పక్షాన వాదనలు వినిపించి నేరస్తునికి శిక్ష పడే విధంగా కృషి చేసారు. కర్నూలు జిల్లాలో పోక్సో కేసులో ముద్దాయికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష , రూ. 25 వేలు జరిమాన పడింది. మైనర్ బాలిక పట్ల అఘాయిత్యం కు పాల్పడిన ఘటనలో శిక్ష ఖరారు... కర్నూలు జిల్లా స్పెషల్ ఫోక్సో కోర్టు తీర్పు వెలువడిందని తెలిపారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థ బలోపేతంగా వినియోగించి కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో కర్నూలు పోలీసులు ముద్దాయిలకు కఠిన శిక్షల కై గట్టి చర్యలు చేపట్టారు. ఈ కేసులో నిందితుడు షేక్ చాంద్ బాషా (21) , అమరావతి నగర్, ఆదోని పట్టణం, కర్నూలు జిల్లా కు చెందిన వాడు. కూలీ పని చేస్తూ జీవనం సాగించేవాడు . నిందితుడు షేక్ చాంద్ భాషా



ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి ఒక మైనర్ బాలిక పట్ల అఘాయిత్యం కు పాల్పడ్డాడు. కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణం కు చెందిన మైనర్ బాలిక తల్లి ఫిర్యాదు మేరకు 2021 ఫిబ్రవరి 7 వ తేదీన పత్తికొండ యుపిస్ పోలీసు స్టేషన్ లో క్రైమ్ నెంబర్ 64 / 2021 పోక్సో యాక్ట్ 2012 నమోదు చేశారు. సమగ్ర దర్యాప్తు చేపట్టారు. అప్పటి డోన్ డిఎస్పీ వై. శ్రీనివాస రెడ్డి దర్యాప్తు చేపట్టి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. అన్ని కోణాల్లో విచారించి , నేరం రుజువు కావడంతో కర్నూలు జిల్లా స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి ఇ.రాజేంద్రబాబు గారు నిందితుడు షేక్ చాంద్ భాషా కఠిన కారాగార శిక్ష, రూ. 25 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. జరిమానా కట్టని యెడల 6 నెలలు జైలు శిక్ష పొడగిస్తారని తెలిపారు.

## జులై నుంచి సెప్టెంబర్ 2025 వరకు విద్యుత్ సరఫరా పై సమీక్షించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్

**విజయవాడ, జులై 1,ప్రభాతవార్తప్రతినిధి:** జులై నుండి సెప్టెంబర్ 2025 వరకు విద్యుత్ సరఫరా కు సంబంధించి సీలేరు విద్యుత్ ఉత్పత్తి కేంద్రంతో పాటు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ విద్యుత్ సంస్థల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఏ పీ జెన్కో ఎం డీ కె వీ ఎన్ చక్రధర్ బాబు, జెఎండీ ఏపీట్రాన్స్కో కీర్తి చేకూరి , ఏపీట్రాన్స్కో , జెన్కో డైరెక్టర్లతో విద్యుత్ సరఫరా పై సిఎస్ క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ జులై నుంచి సెప్టెంబర్ వరకు కోల్ స్టాక్ పొజిషన్ , ఓవర్ హౌల్ , థర్మల్ ప్లాంట్ల స్థితిగతుల గురించి ఆయన సమీక్షించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సోలార్ విద్యుత్ తగ్గుతున్న దృష్ట్యా , సీలేరు , థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని పెంచేదిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది జులై లో యావరేజ్ విద్యుత్ డిమాండ్ 216 మిలియన్ యూనిట్లు , ఆగష్టులో 231 ఎంయు , సెప్టెంబర్లో 232 ఎంయు ఉండవచ్చని అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. రాబోయే వర్షా కాలంలో వచ్చే ఇన్ ఫ్లోస్ ను ఉపయోగించుకుని విద్యుత్ ఉత్పత్తి మరింత పెంచుకోవాలని, విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేయాలని, అందుకోసం విద్యుత్ సరఫరా లో ఎలాంటి అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కోల్ స్టాక్ ఎప్పటికపుడు సమీక్షించుకోవాలని, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఓవర్ హౌలింగ్ ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 31 వరకు ఉండదని సిఎస్ తెలిపారు. నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ కృతనిశ్చయంతో ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సిబ్బంది అందరూ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



# రైల్వేలో భద్రతకే తొలి ప్రాధాన్యత

### - సమీక్ష సమావేశంలో దిశానిర్దేశం చేసిన జిఎం సందీప్ మాథుర్

**గుంతకల్లు రైల్వే, జులై 1,ప్రభాతవార్త** రైల్వే రవాణా వ్యవస్థలో రైళ్ల నిర్వహణలో రైలు భద్రతకే తొలి ప్రాధాన్యం ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ వెల్లడించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ అదనపు బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన జోనల్ ప్రధాన అధికారులతో పాటు జోన్ పరిధిలోని గుంతకల్లు, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ , సికింద్రాబాద్, నాందేడ్ డివిజన్లకు చెందిన డిఆర్ఎంలతో, ఆయా విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జోన్, డివిజన్ల పనితీరును సమీక్షించారు. అదనపు జీఎంగా నీరజ్ అగర్వాల్, డిజిఎంలు మల్లాది శ్రీనివాస్, కోట్ల ఉదయ్‌నాథ్, రైల్వే వివిధ శాఖలకు చెందిన ప్రధానాధికారులు, ఇతర సీనియర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే నిర్వహణలో భద్రతకే ఎప్పుడూ అధిక ప్రాధాన్యత ఇవ్వాలని వక్కాణించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకోవలసిన జాగ్రత్తలపై దృష్టి సారించాలన్నారు. ప్రయాణికుల సౌకర్యాల ఏర్పాటును నిశితంగా పర్యవేక్షించాలని, రైల్వే నిర్వహణలో సమయపాలనను నిర్ధారించుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి పనులతో సహా జోన్‌అంతటా మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు జరిగే సమయంలో పనినాణ్యతను, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలన్నారు.

# దుర్గమ్మకు వైభవంగా ఆషాఢం సారె సమర్పణ



మాధవ్ దంపతులకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం



అమ్మకు ఆషాడం సారె అందించిన భక్తులు

**ఇంద్రకీలాద్రి, జూలై 1, ప్రభాతవార్త** దుర్గమ్మ వారికి పలువురు భక్తబృందాల వారు మంగళవారం ఆషాడం సారెను సమర్పించారు. వారికి దుర్గమ్మవారి దర్శనంఏర్పాటు చేసిన అధికారులు అన్నప్రసాదాలు అందించారు.

– వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్య కళ్యాణం: దుర్గమ్మవారి ఆలయంలో వేంచేసి వున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని వైభవంగా మంగళవారం నిర్వహించారు. ప్రత్యేక ఆసనంలో శ్రీ స్వామి అమ్మవార్లను వేంచేపు చేసి కళ్యాణ క్రతువు నిర్వహించారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఇఓ వికె శీనా నాయక్ పాల్గొన్నారు.

– గుప్త నవరాత్రులకు ప్రత్యేక పూజలు: దుర్గమ్మవారి ఆలయంలో గుప్త నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. లోకకళ్యాణార్థం యాగశాలలో పంచ వారాహీ మంత్రములతో శ్రీ అమ్మవారి జప, తర్పణ, హోమాలు నిర్వహించారు. ఈనెల 4న శుక్రవారం పూర్ణాహుతి నిర్వహిస్తామని ఇఓ తెలిపారు.

– దుర్గమ్మ సేవలో బిజెపి రాష్ట్ర నూతనాధ్యక్షుడు: దుర్గమ్మవారిని మంగళవారం రాష్ట్ర నూతన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పోకల వంశీ నాగేంద్ర మాధవ్ దర్శించుకున్నారు. ఆయనకు దుర్గమ్మవారి ప్రసాదం , శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలందించారు.

– ఆక్రమణలు తొలగించిన ప్రదేశం పరిశీలించిన సిపి: దుర్గమ్మవారి ఆలయానికి చెందిన భూముల్లో ఆక్రమణలను తొలగించిన ప్రదేశాలను మంగళవారం విజయవాడ సిపి రాజశేఖరబాబు ఇఓ వికె శీనా నాయక్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం సిపి దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. సిపికి ఇఓ దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించారు.

# కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

**వరికుంటపాడు (నెల్లూరు), జులై 2, ప్రభాతవార్త :** విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో విద్యార్థులను ఉన్నత స్థితిలో నిలబెట్టాల్సిన ఉపాధ్యాయుడే విద్యార్థులపట్ల అసభ్యకరంగ ప్రవర్తిండంపై ఆగ్రహించిన తల్లిదండ్రులుఆకీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసిన సంఘటన మండలంలోని [illegible] చోటుచేసుకుంది. తల్లిదండ్రల వివరాలమేరకు గ్రామంలోని యుపి పాఠశాలలోస్కూల్ అసిస్టెంటు విదులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో అదేపాఠశాలకు చెందిన ఏడవతరగతి విద్యార్థులపట్ల ఆయన ఆసభ్యకరంగ ప్రవర్తించడంపై గత విద్యాసంవత్సరంలో తల్లి, దండ్రులు నిలదీశారని, వేశవిసెలవుల్లో సైతం ఓ గిరిజన బాలికపట్ల అసభ్యకరంగ ప్రవర్తించాడని ఆరోపణల నేపద్యంలో ఆయన పాఠశాల ప్రారంభమైనప్పటినుంచి మెడికల్‌లీవ్ తీసుకొని పాఠశాలకు రాకుండ ఉండగ ఆసెలవు పూర్తయింది. మంగళవారం విదులకు రాగ తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులుసైతం ఆయనను ఇదేంపద్ధతని ప్రశ్నించారు. దీనికి ఆయన నిర్లక్ష్యపు సామాదానంతోపాటు వాదనకు దిగాడని దీంతో మహిళలు కోపోద్రీకులై ఉపాద్యాయుడు వెంగయ్యకు దేహశుద్ధిచేసి కట్టివేసేందుకు ప్రయత్నించగ ఆకీచక టీచర్ గోడదూకి పారిపోయాడని ఆగ్రహించిన తల్లిదండ్రులు ఉపాద్యాయుడి కారును ద్వంసం చేశారు. ఈఉపాద్యాయుడి తీరుపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కాగ ఉపాద్యాయుడు వెంగయ్య ఎక్కడ పనిచేసిన అక్కడ వివాదాస్పదుడిగ పేరు పొందివుండడం కొసమెరుపుగా చెపుతున్నారు. ఇటువంటి చరిత్ర కలిగిన ఆయన ఈపాఠశాలలో పనిచేస్తుడడంతో ఆతనితోపాటు పనిచేసే ఎక్కువమంది ఉపాద్యాయులు బదిలిఆయిన క్రమంలో వారిస్థానంలో వేరే ఉపాద్యాయులు ఇక్కడికి రాకడానికి జంకుతున్నారన్న ప్రచారంవుంది. ఈప్రభుద్దుడుపాఠశాలలో పనిచేస్తున్నాడని కారణంతోనే ఎవ్వరు ఇక్కడికి రాలేదన్న విమర్శలు వినవస్తున్నాయి. కావున ఉన్నతాదికారులు స్పందించి ఆకీచక ఉపాద్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లి, దండ్రులతోపాటు గ్రామస్తులు కోరుతున్నారు.

## తిరుమల అన్నమయ్యభవనం వద్ద చిరుతసంచారం

**తిరుమల,జూలై 1 ప్రభాతవార్తప్రతినిధి:** చిరుతపులి సంచారం ఏకంగా తిరుమలలో భక్తుల రద్దీగా ఉంటే అన్నమయ్యభవనం వద్ద ఇనుపకంచే దాటుకుని గోడపై రావడంతో భక్తులు భయంతో పరుగులుతీశారు. మంగళవారం రాత్రి అన్నమయ్య భవనం సమీపంలోనే అటీవప్రాంతం ఉంది. అక్కడ నుండి చిరుతపులి ఏకంగా రక్షణగా వేసిన ఇనుపకంచెను దాటుకుని భవనం వద్దకు వచ్చేసింది. సిసిటివి పుటేజీల్లో గమనించిన సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అక్కడకు అటవీశాఖ సిబ్బందిని పంపారు. భారీ శబ్ధాలతో, హైమాస్‌లైట్ల వెలుగుతో చిరుతను అడవిలోకి తరిమేశారు. జనసంచారం ఉన్న చోటుకే చిరుతపులి రాత్రివేళ రావడంతో భక్తులు భయంతో వణికిపోతున్నారు.

# పారిశుద్ధ్యంలో కుప్పం మున్సిపాలిటీ భేష్ !

### - రాష్ట్ర స్థాయి టాప్ టెన్‌లో చోటు .. ప్రభుత్వ ఐవిఆర్ఎస్ సర్వేలో ప్రజల సంతృప్తి !

### 'శ్రమ'కు తగిన ఫలితం : మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు !

**కుప్పం, జూలై 1 ప్రభాతవార్త** కుప్పం మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో పారిశుధ్యం విషయంగా ఉత్తమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య విషయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐవిఆర్ఎస్ సర్వేలో పెద్ద పెద్ద మున్సిపల్ కార్పోరేషన్లు, మున్సిపాలిటీలను తోసిరాజని కుప్పం మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయిలో ప్రకటించిన టాప్ 15లో మూడు స్థానాలు దక్కించుకుని రికార్డు సృష్టించింది. కుప్పం మున్సిపాలిటీలో చేపడుతున్న పారిశుధ్య పనులపై ప్రజలు 92శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయడం విశేషం. సిఎం చంద్రబాబునాయుడు కుప్పం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా చేస్తామని ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కుప్పం మున్సిపాలిటీ కమీషనర్ శ్రీనివాసరావు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తూ ముందుకు సాగుతున్నారు. పట్టణంలో పారిశుధ్యంపైప్రత్యేక దృష్టి సారించారు. కుప్పం పట్టణంలో ఉదయం, రాత్రి రెండు పూటల పారిశుధ్య కార్మికులతో పట్టణాన్ని శుభ్రం చేయిస్తున్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛకుప్పంకు శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎవరూ రోడ్లపై చెదారాలు



పడేయకుండా చర్యలు చేపట్టారు. నిత్యం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు 25వార్డుల్లో ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరిస్తున్నారు. ఇటీవలే డంపింగ్‌యార్డులో పోగైన 20వేల టన్నుల చెత్త చెదారాలను తమిళనాడు ఈరోడ్‌కు చెందిన సంస్థ ద్వారా వేరు చేయించి డంపింగ్ యార్డ్‌ను శుభ్రం చేయిస్తున్నారు. త్వరలోనే అక్కడ అవెన్యూ ప్లాంటేషన్ పనులు చేపట్టనున్నారు. కాగా ఈ సర్వేలో పలమనేరు మున్సిపాలిటీ పద్నాలుగో స్థానం సాధించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం మున్సిపాలిటీని క్లీన్ అండ్ గ్రీన్ కుప్పంగా మార్చడమే తమ లక్ష్యమని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మున్సిపాలిటీలో నిరంతరం పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, శానిటరీ మేస్త్రీలు, కార్యదర్శుల సహకారంతో తాము ఈ గుర్తింపు పొందామన్నారు. కుప్పం మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా పనిచేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామన్నారు.

# దుష్ప్రచారాలు చేయకండి.. మంచి చేసే వారికి సహకరించేటట్లు ఉండండి :హోం మంత్రి అనిత .. హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్.!

**(నక్కపల్లి, ప్రభాతవార్త)** వ్యవస్థలో ఉన్న లోపాలను సరి చేస్తూ ప్రభుత్వాన్ని నమ్ముకున్న ప్రజలకు సక్రమమైన రీతిలో పరిపాలన అందించాలని లక్ష్యం తో ముందడుగులు వేస్తున్న ప్రభుత్వ పనితీరుపై దుష్ప్రచారాలు మానుకోవాలని, చేసేది మంచి పని అనుకుంటే సహకరించాలని, ఈ సమాజాన్ని ముందుకు నడిపించడానికి అవకాశం ఉంటుంది తప్ప కంటికి కనిపించని అవాస్తవాలను చూపించి ప్రజలను తప్పు త్రోవ పట్టించాలని చూడడం సరైన పద్ధతి కాదని, ఇప్పటి కైనా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ అధినేత మానుకోవాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు .మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గంలో 2047 విజన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచనల అనుసరించి సోషల్ వెల్ఫేర్ హాస్టల్ లను తనిఖీ చేయడం జరిగిందని, ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవస్థలో మార్పు తీసుకురావాలని ఉద్దేశంతో ముందడుగులు వేస్తే అడుగులను భరించలేక ప్రజలను మభ్య పెట్టాలని చూడడం దారుణమని, అది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు తగదని అన్నారు. పాయకరావుపేట సోషల్ వెల్ఫేర్ బాలికల ఇంటర్మీడియట్ హాస్టల్ ను తనిఖీ చేయడం జరిగిందని, అక్కడ పిల్లలతో మాట్లాడడం జరిగిందని, వారు అనేకమైన సమస్యలు దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అనుకున్న సమయానికి సన్నబియ్యం తో మంచి మెనూతో భోజనం పెట్టమని ఆదేశాలు ఇచ్చామని, ఆదేశాలను అనుసరించని వార్డును నిరక్ష్య ధోరణ వలన సన్నబియ్యం వాడకపోవడం, నాణ్యమైన భోజనం పెట్టకపోవడం, పర్యవేక్షణ లేకపోవడం, బాలికల హాస్టల్ లో సెక్యూరిటీ కూడా లేకపోవడం గుర్తించడం జరిగిందని చెప్పారు. ఏ ఆశయంతో తోనైతే బీసీ, ఎస్సీ హాస్టల్లో నాణ్యమైన రీతిలో విద్యార్థులకు భోజనం పెట్టాలని ఆలోచనతో ఉన్నామో ఆలోచనకు అనుగుణంగా జరగకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలతో కలిసి భోజనం చేసినప్పుడు ఆ భోజనంలో తల వెంట్రుక కనిపిస్తే దానిని భోజనంలో బొద్దింక కనిపించిందని వైయస్సార్ సోషల్ మీడియా దుష్ప్రచారం చేయడం దారుణమని, ఇటువంటి ఆలోచన వారికి ఎందుకు వస్తుందో అర్థం కావడం లేదని అన్నారు. బాధ్యత ప్రకారం హాస్టల్ ను తనిఖీ చేయడం జరిగిందని, అది కూడా పాయకరావుపేట నియోజకవర్గంలోని చేశానని




చెబుతూ జరిగిన లోపాలని కలెక్టర్ కు తెలియజేయడం జరిగిందని ,స్పందించిన కలెక్టర్ వార్డెన్ ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని మంత్రి చెప్పారు. ఐదు సంవత్సరాలు కాలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సీ, బీసీ హాస్టల్ ను మంత్రులు గాని, ఎమ్మెల్యేలు గానీ, ఏ ఒక్కరు సందర్శించిన సందర్భాలు లేవని, అటువంటిది ఈనాడు ప్రభుత్వం వ్యవస్థలో మార్పు తీసుకురావడం కోసం ముందడుగులు వేస్తుంటే ఎక్కడ రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఉద్దేశంతో సోషల్ మీడియాలో, ట్విట్టర్లో, తప్పుడుగా గా ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఇటువంటి ప్రచారాలకు అడ్డుకట్టు వేసేందుకు ప్రభుత్వం చట్టాలను కఠిన తరం చేస్తున్నామని అన్నారు. హాస్టల్ విద్యార్థులకు మంచి భోజనం పెట్టడం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఇష్టం లేదేమో అందుకే ఇటువంటి దుష్ప్రచారం

## గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలు పరిష్కరించాలి

### మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు వినతి

**విజయవాడ, జూలై 1, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు మంగళవారం వినతిపత్రం అందించారు. గ్రామ వార్డు సచివాలయ రెషనలైజ్ విషయంలో జరుగుతున్న పరిణామాలు మంత్రికి వివరించి వాటిపై విఆర్ఓల స్ట్రెంత్ క్యాడర్ తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతమున్న గ్రామ రెవెన్యూ అధికారులను యధావిధిగా కొనసాగించాలని కోరారు. అర్హులైన గ్రేడ్ 1 విఆర్ఓకు వన్‌టైం సెటిల్మెంట్ కింద వెంటనే సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లుగా ప్రమోషన్లు కల్పించాలని కోరారు. గ్రేడ్2 విఆర్ఓలకు గ్రేడ్ 1 ప్రమోషన్లిచ్చి, జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ ఇవ్వాలన్నారు. వీటిపై ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కరిస్తామని మంత్రి ఆయనకు హామీ ఇచ్చారు.

# రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తుపై సమగ్ర పరిశీలన

## భూభారతి పోర్టల్‌లో దరఖాస్తుల నమోదు ప్రక్రియ పూర్తి

## రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హమైన అన్నింటినీ సానుకూలంగా పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై సరైన విచారణ జరపాలని, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని, అవసరమైన డాక్యుమెంట్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలన్నింటినీ ఒకే డాక్యుమెంట్‌గా భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులను ఎందుకు తిరస్కరించవలసి వచ్చిందో అనే వివరాలను లిఖిత పూర్వకంగా దరఖాస్తుదారులకు అందించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 594 మండలాల్లో 10,226 రెవెన్యూ సదస్సులు నిర్వహించామని ఇందులో 8,27,230 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటి వరకు 7,98,528 దరఖాస్తులను డేటాఫార్మేట్ లో భూభారతి పోర్టల్ లో నమోదు చేసినట్లు చెప్పారు. మిగిలినవాటిని కూడా ఒకటి రెండు రోజుల్లో పూర్తిచేస్తామన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో భూ భారతిచట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ చట్టం ద్వారా దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ఏప్రిల్ 17వ తేదీ నుంచి జూన్ 20వ తేదీ వరకు దశల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహించినట్లు తెలిపారు. సర్వే నెంబర్లలో లోపాలు పిఓబి, ఆర్ఓఆర్, నాలా, ఆర్.ఎస్.ఆర్ సవరణ, అప్పీల్స్, కోర్టుకేసులు, పోడు భూములు తదితర 30 రకాల భూ సమస్యలపై 8.27 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే ధరణి పోర్టల్‌తో తెలంగాణ ప్రజానీకం ముఖ్యంగా రైతాంగం ఎదుర్కొన్న సమస్యలు కళ్లకుకట్టినట్లు కనబడుతు న్నాయన్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన స్వార్థ పూరితమైన ఆర్ఓఆర్ చట్టం 2020 వల్ల ఇబ్బందులు పడిన తెలంగాణ ప్రజానీకానికి భూభారతి చట్టం ద్వారా విముక్తి కల్పిస్తామన్నారు. కింది నుంచి పైస్థాయి వరకు మొత్తం రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక ఎజెండాగా తీసుకొని సమస్యలపరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రైతుల సంతోషమే ధ్యేయంగా పనిచేస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వంలోవారికి ఎటువంటి అసౌకర్యం లేకుండాచూడాలని, అంకిత భావంతో సానుకూల దృక్పథంతో ఈ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని మంత్రి పొంగులేటి అధికారులకు సూచించారు.

# అత్యధిక నష్టపరిహారం ఇప్పించిన ఘనత తెలంగాణ కార్మిక శాఖదే

## మృతుడి భార్య రేవతికి రూ.47,66,100

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూలై 1, ప్రభాతవార్త:** తెలంగాణ కార్మిక శాఖ దేశంలోనే మొట్టమొదటిసారిగా అత్యధిక నష్టపరిహారం ఇప్పించిందని తెలంగాణ కార్మిక శాఖ మాత్రమేనని ఆ శాఖ డిప్యూటీ లేబర్ కమీషనర్ (డీ సీఎల్) జాసన్ తెలిపారు. మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మికశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీలో చట్టబద్ద ప్రభాకర్ రావు విధి నిర్వహణలో 2010లో మృతి చెందారు. నష్టపరిహారం కేసులో మొదట కరీంనగర్‌లో ఫైల్ చేశారని ఆ తరువాత ఆ కేసును హైదరాబాద్ ఏసిఎల్‌కు బదిలీ చేశారని తెలిపారు. కేసు పూర్వాపరాలు పరిశీలించి ఇరువర్గాల న్యాయవాదుల వాదనలు విన్న తర్వాత కార్మిక నష్టపరిహార చట్టం ప్రకారం మృతుడి భార్య రేవతికి రూ.47లక్షల 66వేల 100 చెల్లించాలని ఆదేశించారని, 2010 నుంచి 12 శాతం వడ్డీతో కలిపి ఆదేశాలు ఇప్పించినట్లు తెలిపారు. ఆ మొత్తం వడ్డీతో కలిపి రూ.కోటి 34లక్షల 78వేల269 అయ్యిందని,. ఆ మొత్తం ఎన్టీపీసీవారు మృతుడి భార్య రేవతికి అందేవిధంగా తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో నష్టపరిహారం చెల్లించడం దేశంలోనే మొదటిసారని, ఈ ఘనత రాష్ట్ర కార్మికశాఖ సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ బి.జాసన్ మాట్లాడుతూ ఈ పెద్దమొత్తంలో కోటి ముప్పైఐదు లక్షల నష్టపరిహారం చెల్లించడం దేశంలోనే మొదటిసారని, కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ చక్కని మార్గదర్శకత్వంలో ముందుకు సాగుతున్నామని, ముఖ్యంగా కార్మిక శాఖ ఇంచార్జ కమిషనర్ దానకిషోర్ విశేషపరిపాలన అనుభవంతో కార్మిక శాఖను తీర్చిదిద్ది కార్మికులకు సత్వరసేవలు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలోనే అత్యధిక మొత్తంలో రూ.కోటి 34లక్షల 78వేల 269 నష్టపరిహారం ఇప్పించిన బి.జాసన్‌ను పలువురు అధికారులు అభినందించారు.

# బి కేటగిరి సీట్లు అమ్ముకుంటున్న ఇంజినీరింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

## ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌కు ఎఐవైఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మేనేజ్‌మెంట్ కోటా(బి కేటగిరి) సీట్లను అమ్ముకుంటున్న ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బి కేటగిరి సీట్లను అమ్ముకుంటున్న ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలిఉల్లా ఖాద్రీ, రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డికి మంగళవారం విజ్ఞప్తి చేశారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం ప్రారంభించిన ఎప్ సెట్-2025 కౌన్సిలింగ్ కంటే ముందే ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల దందా జోరందుకుందని మండిపడ్డారు. ప్రైవేట్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీల మధ్యవర్తిత్వంతో సీట్ల రిజర్వేషన్ ప్రక్రియకు తెరలేచిందని.. వివిధ బ్రాంచ్‌ల్లో సిఎస్ఈ, ఐటీ, ఈఈఈ కోర్సుల సీటుకు సగటున రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల చొప్పున అమ్ముకుంటున్నాయని విమర్శించారు. ఉన్నత విద్యామండలి ఆదేశాలను, నిబంధనలను ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయని ధర్మేంద్ర మండిపడ్డారు. టాప్-10 కాలేజీల్లో సీట్లు ఇప్పిస్తామని కన్సల్టెన్సీలు గాలం వేస్తున్నారని ధ్వజమెత్తారు. ఉన్నత విద్యామండలి ఆదేశాలను పాటించని ఇంజనీరింగ్ కళాశాలలపై క్రిమినల్ కేసులు పెట్టి, గుర్తింపు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.



మధుజ్యోతి రచించిన 'ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సృష్టి-దృష్టి' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సిరికొండ మధుసూదనాచారి

# సామాజిక దృక్పథంతో ఇనాక్ సాహిత్య సృష్టి

## ఆచార్య కొలకలూరి సాహితీ సప్తాహం

## ప్రారంభ వేడుకలో కౌన్సిల్ విపక్ష నేత మధుసూదనాచారి

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూలై 1, ప్రభాతవార్త:** ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్య సృష్టి సమస్తం సామాజిక దృష్టి తోనే అని రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో గాన సభ నిర్వహణ లో అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. సభలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తహం ఆరంభ వేడుకకు ముఖ్య అతిథిగా మధుసూదనాచారి పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు ద్రవిడ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షులు ఆచార్య కొలకలూరి మధు జ్యోతి రచించిన 'ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సృష్టి దృష్టి' గ్రంథం ను ఆవిష్కరించి మాట్లాడారు. ఇనాక్ వివిధ ప్రక్రియలలో చేసిన రచనలు అన్నిటిలో దళిత బహుజన వాదం ధ్వనిస్తుంది అని అన్నారు. మధు జ్యోతి తన తండ్రి సాహిత్యం పై సమగ్ర అవగాహనతో పాఠకులుకు అర్థమయ్యే రీతిలో అందించారని అభినందించారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఇనాక్ రచనలన్ని సామాజిక చింతన కలిగి ఉంటాయన్నారు. అయన జన్మ దినోత్సవం ప్రతియేటా వారం రోజులు గానసభ నిర్వాహణలో చేయడం సాహితీమూర్తికి ఇచ్చే గౌరవమని చెప్పారు. ఆధ్యాత్మికవేత్త పురాణ పండ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇనాక్ సాహిత్యంపై మధుజ్యోతి రచన సాహిత్య పరిశోధకులకు కరదీపిక అన్నారు. వేదికపై కొలకలూరి సుమ కిరణ్, సంగీత గురువు మల్లాది ఉష, గుండవరపు గీతాదేవి, ప్రసాద్ పాల్గొన్నారు.

# నేడు మంత్రులతో ముఖాముఖికి వాకిటి

**హైదరాబాద్, జూలై 1,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ సూచనల మేరకు గాంధీభవన్‌లో నిర్వహించే మంత్రులతో ముఖాముఖికి పశుసంవర్ధక,క్రీడలు,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం హాజరుకానున్నారు. వాకాటి శ్రీహరి మక్తల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. జూన్8న జరిగిన మంత్రి మండలి విస్తరణలో రాహుల్‌గాంధీ నిర్ణయంమేరకు వాకాటికి మంత్రి పదవి వరించింది. జూన్ 11న ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం జిల్లా ఇంచార్జీ మంత్రిగా జూన్ 12న నియమితులైనారు. గాంధీభవన్‌లో జరిగే మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి ఉదయం 11గంటల నుంచి పాల్గొని సమస్యలపై విన్నపాలు స్వీకరిస్తారు.

# మల్టీజోన్-2 ఇన్‌ఛార్జి ఐజిగా చార్మినార్ జోన్ డిఐజి తఫ్సీర్‌ఇక్బాల్

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** రాష్ట్ర మల్టీజోన్-2 ఇన్‌ఛార్జి ఐజి బాధ్య తలను చార్మినార్ జోన్ డిఐజి తఫ్సీర్ ఇక్బాల్‌కు అప్పగించారు. ఈ మేరకు రాష్ట్ర సర్కారు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. మల్టీజోన్-2 ఐజిగా వున్న వి. సత్యనారాయణ సోమ వారం పదవీవిరమణ చేయ డం తెలిసిందే. ఆయన స్థా నంలో ఇంఛార్జ్‌గా నియమి తులైన చార్మినార్ జోన్ డిఐ జి తఫ్సీర్ఇక్బాల్ మంగళ వారం ఉదయం బాధ్యతలు చేబట్టారు. డిజిపి కార్యాల యంలో గల మల్టీ జోన్-2 కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేబట్టారు. తర్వాత డిజిపి జితేందర్‌సహా ఇతర ఉన్నతాధికారులను మర్యాద పూర్వకం గా కలిశారు. ఇంతకు ముందు ఆయన ఎల్‌బినగర్ డిసిపిగానూ, ఖమ్మం కమిషనర్‌గా, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ డిఐజిగా బాధ్యతలు నిర్వహించారు.



మల్టీజోన్-2 ఇన్‌ఛార్జి ఐజిగా బాధ్యతలు చేపట్టిన తఫ్సీర్ ఇక్బాల్

# కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఇది గొప్ప సమావేశం

## గ్రామ శాఖ అధ్యక్షులందరూ రండి

## పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఈ నెల 4న ఎల్‌బి స్టేడియంలో జరగబోయే సమావేశం గొప్పదని టిపిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. భారత రాజ్యాంగం పరిరక్షణ కోసం గ్రామప్రాంతం నుంచి ప్రజలను సమీకరించేందుకు ప్రతి ఒక్కరు ఎల్‌బి స్టేడియంకు తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులకు టిపిసిసిచీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో మంగళవారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం జరిగింది. మహేష్ కుమార్‌గౌడ్, జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు డిసిసి అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ జూలై 4వ ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న సమావేశం చాలా కీలకమైన సమావేశమని అన్నారు. గ్రామ శాఖ అధ్యక్షులతో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడడం చాలా ముఖ్యమైన అంశమని తెలిపారు. ఇది పార్టీ చరిత్రలో ఒక గొప్ప సమావేశం. అందరూ విధిగా సమావేశం విజ యవంతం చేయాలని కోరారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే చెప్పే సందేశాన్ని ప్రజలకు చేరవేయాలని దేశమౌళిక రాజ్యాంగ స్వ రూపం మారితే అణ గారిన వర్గాలు తీవ్రంగా ఇబ్బంది పడుతారని ఆయన హెచ్చ రించారు. అనంతరం గాంధీభవన్ లోనే చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగగా ముఖ్య అతిథిగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ అనిల్ యాదవ్, చైర్మన్ ఫహీం ఖురేషి, చేవెళ్ల పార్లమెంటు ఇన్‌చార్జ్ ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కె.ఎల్.ఆర్., ఉపాధ్యక్షులు బొంతు రామ్మోహన్, వేణుగౌడ్, చైర్మన్‌లు, ప్రధాన కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తీపికబురు

## తగ్గనున్న ఇంటి నిర్మాణ ఖర్చులు

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల పథకం పనులను వేగవంతం చేసేందుకు, లబ్ధిదారులకు ఖర్చులను తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా నిర్మాణ సామాగ్రి అయిన సిమెంటు, స్టీల్, ఇటుక వంటి వాటి ధరలను మండల స్థాయిలో నిర్ణయించాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి ఆదేశించారు. దీనివల్ల నిర్మాణ వ్యయం తగ్గి, సామాన్యులకు అదనపు భారం తగ్గుందని అన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రేవంత్ సర్కార్ ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి కాగా.. ప్రస్తుతం ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. కాగా, ఈ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి, సామాన్యులకు అందుబాటులో ఉండే ధరలకు నిర్మాణ సామగ్రిని అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా.. సిమెంటు, స్టీల్,ఇటుక వంటి నిర్మాణ సామగ్రి ధరలను మండల స్థాయిలో నిర్ణయించడానికి ధరల నిర్ణయ కమిటీలు సమావేశం కావాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం (జూన్ 30) అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో ఇప్పటికే 20 ప్రాంతాల్లో ఇసుక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు భట్టి వెల్లడించారు. ఇసుక సామాన్యులకు మరింత అందుబాటులో ఉండేలా మార్కెట్ యార్డులు, ప్రభుత్వ స్థలాల్లో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. దీని వల్ల ఇసుక కొరతను నివారించడమే కాకుండా.. అక్రమ ఇసుక రవాణాను కూడా నియంత్రిస్తుందని తెలిపారు. సర్కార్ నిర్ణయం వల్ల నిర్మాణ వ్యయం తగ్గి, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం మరింత సులభతరం అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# అన్ని స్కూళ్లల్లో 'బెస్ట్ అవైలబుల్ స్కూల్' అమలు చేయాలి



## ఏప్రిల్ వరకు ఉన్న పెండింగ్ బిల్లులను క్లియర్ చేశాం

## ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ దివ్యాంగుల సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లోనూ బెస్ట్ అవలబుల్ స్కూల్ పథకం అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. గురుకులాలకు ఏప్రిల్ వరకు ఉన్న పెండింగ్ బిల్లులన్నింటినీ క్లియర్ చేశామన్నారు.
విద్యార్థుల తల్లిదండ్రులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఈ ప్రభుత్వం బకాయిలన్నింటిని చెల్లించిందని మంత్రి స్పష్టం చేశారు. మంగళవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురుకులాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎస్సీ గురుకుల సొసైటీ సెక్రటరీ డాక్టర్ విఎస్ అలగు వర్షిణితో కలిసి మీడియాతో మాట్లాడారు. విద్యార్థులకు సంబంధించిన యూని ఫాం, షూస్, బుక్స్ కోసం త్వరలోనే టెండర్లు పిలిచి విద్యార్థులకు అందజేస్తామన్నారు. విద్యా ర్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తీసుకువస్తున్నామన్నారు. గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా తమ ప్రభుత్వం చేయడం లేదన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ బెస్ట్ అవలబుల్ స్కూల్ పథకం కింద 25 శాతం సీట్లు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేటాయించాల్సిందేనన్నారు. కొన్ని కార్పొరేట్ స్కూల్స్ మాత్రమే ఈ సీట్లు ఇస్తున్నాయని మిగతా వాటిలో ఇవ్వడం లేదన్నారు. డైట్, కాస్మోటిక్ చార్జెస్ పెంచి వాటిని చెల్లించడం జరిగిందని.. సంక్షేమ, గురుకుల, బెస్ట్ అవలబుల్ పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో విద్యార్థులకు యూనిఫామ్స్ విషయంలో ఆలస్యం జరగకుండా చూస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# పవర్‌గ్రిడ్ సదరన్ రీజన్ ఇడిగా బాధ్యతలు స్వీకరించిన దోమన్‌యాదవ్



**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** పవర్ గ్రిడ్, సదరన్ రీజన్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్‌గా (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో ఉన్న సబ్‌స్టేషన్లు, ప్రాజెక్టులను కలిగి ఉంది) దోమన్ యాదవ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పాట్నా విశ్వ విద్యాలయం నుండి ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ గ్రాడ్యుయేట్ పట్టాను, ఎండిఐ, గుర్గావ్ నుండి బిజినెస్ మేనేజ్ మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా పొందారు. 1993లో ఇంజనీర్ ట్రైనీగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించిన ఆయన32 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం కలిగి ఉండి, ట్రాన్స్ మిషన్ రంగంలోని అన్ని అంశాలలో పని చేశారు. గ్రిడ్ ఆటోమేషన్ కమ్యూ నికేషన్, క్వాలిటీ ఇష్యూరెన్స్ ఇన్‌స్పెక్షన్, ఈఆర్‌పి ఐటీ, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, పవర్‌గ్రిడ్ టెలికాం వ్యాపారంలో గుర్గావ్, న్యూ ఢిల్లీ, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో పనిచేశారు సదరన్ రీజన్ ట్రాన్స్ మిషన్ సిస్టమ్ బాధ్యతలు స్వీకరించే ముందు, ఆయన పవర్ గ్రిడ్ కార్పొరేట్ కార్యాలయం, గుర్గావ్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈఆర్‌పి ఐటీ,జీపి సీ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, సిఐఎస్‌వో)గా సేవ లందించారు.

# మహిళా శక్తి చీరెల కుట్టుకూలీ నిర్ణయంలో జాప్యం

## ఆలస్యం కానున్న చీరెల పంపిణీ

**హైదరాబాద్ జూలై 1, ప్రభాతవార్త:** ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన మహిళాశక్తి చీరెల పంపిణీపై నీలినీడలు కమ్ముకున్నాయి. నూలు సిద్ధమైనా కూలి రేటు ఖరారు కాకపోవ డంతో ఉత్పత్తి ఆలస్యమవుతున్నట్లు సమాచారం. బతుకమ్మ చీరెల మాదిరిగానే మీటరుకు రూ.34 చొప్పున చెల్లిస్తామని సర్కారు మెలిక పెడుతుండ డంతో కార్మికులు తయారీకి ముందుకు రావడం లేదు. దీంతో మహిళాసంఘాల్లోని సభ్యులకు ఆగస్టు15 నాటికి చీరల పంపిణీ సాధ్యం కాకపోవచ్చని అధికార వర్గాలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నాయి.
రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల్లోని సుమారు 65 లక్షల మంది మహిళలకు ఒక్కొక్కరికి రెండు చొప్పున చీరలు పంపిణీ చేస్తామని, 2024 ఆగస్టు 8న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. బతు కమ్మ పండుగ నాటికి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. బతుకమ్మ పండుగకు పంపిణీ చేయకపోగా, సంక్రాంతికి ఇస్తామని చెప్పారు. ప్రభుత్వం వరుసగా వాయిదాలు వేస్తూ పోతున్నా. చేనేత జౌళిశాఖ అధికారు లు చర్యలు చేపట్టలేదు. 2025 జనవరిలో ఒక విడత, మార్చిలో రెండో విడత చీరల కోసం వస్త్రం ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చారు. అయితే సిరిసిల్లలో 26 వేల మరమగ్గాలు ఉండగా కేవలం 2 వేల సాంచాలపైనే వస్త్రోత్పత్తి చేయాలని నిర్ణయిం చారు. రెండు విడుతల్లో కలిపి చేనేత జౌళిశాఖ 4.24 కోట్ల మహిళా శక్తి చీరలకు ఆర్డర్లు ఇచ్చింది.
ఆసాములు, కార్మికులకు ఇచ్చే కూలీ రేటు నిర్ణయించలేదు గతంలో బతుకమ్మ చీర లకు మీటరకు రూ.34 చొప్పున చెల్లించే వారు ఇందులో ఆసాములకు రూ.11, కార్మికులకు రూ. 5 చొప్పున చెల్లించేవారు ప్రస్తుతం ప్రభుత్వం చెప్తున్నట్టుగా కాటన్ చీర ఉత్పత్తి చేయాలంటే పనిభారం ఎక్కువగా ఉంటుందని, కూలీ పెంచాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కనీసం మీటరకు రూ.2 చొప్పున అంటే ఆసాములకు రూ. 13. కార్మి కులకు రూ.7 చొప్పున ఇవ్వాలని కోరుతు న్నారు. లేకపోతే నెలకు రూ 10 వేలు కూడావచ్చే పరిస్థితిలేదని వాపోతున్నారు. కార్మికుల విజ్ఞప్తిని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వస్త్ర ఉత్పత్తి మొదలు కాలేదు.
ముఖ్యమంత్రి ప్రకటించి నెలలవుతున్నా చీరల తయారీ ప్రారంభంకాలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు 1.50 కోట్ల బతుకమ్మ చీరల ఉత్పత్తికి తొమ్మిది పది నెలల ముందే ఆర్డర్లు ఇచ్చేది. ఉరుకులు పరుగుల మీద చేస్తేనే బతుకమ్మ పండుగనాటికి చీరలు సిద్ధమయ్యేవి కానీ ఈ ఏడాది ఆగస్టు 15న వాటికి చీరలు అందజేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. కానీ ఇందుకు 45 రోజుల సమయం మాత్రమే ఉన్నది. ఈ పరిస్థితుల్లో చీరలు అందే పరిస్థితి ఉండదని, కనీసం బతుకమ్మ పండుగకు కూడా మహిళా శక్తి చీరలు పంపిణీ చేసే పరిస్థితి కనిపించడంలేదని అధికారులు పేర్కొంటున్నారు.

# మానవ మనుగడలో వైద్యులపాత్ర అపారమైనది

## డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపిన మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** మానవ మనుగడలో వైద్యుల పాత్ర అపారమైనదని టిపిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో డాక్టర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఈ పవిత్రమైన వైద్య వృత్తిలో కొనసాగే వైద్యులు మరింత నిబద్ధతతో సేవలందించేందుకు కార్యచరణ తీసుకొని ముందుకు పోవాలని కోరారు. వైద్యుల సేవలు అమూల్యమైనవని ఆయన కొనియాడారు. ప్రతి ప్రాణానికి అండగా నిలిచే ప్రాణదాతలు మన వైద్యులని వర్ణించారు. కోవిడ్ వంటి మహమ్మారి వచ్చిన కూడా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, సేవా ధర్మాన్ని కాపాడుతున్న నిస్వార్థ యోధులు వైద్యులని ఆయన అన్నారు. వైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. డాక్టర్స్ డే బహుమతిగా ప్రభుత్వం వైద్య విద్యార్థులకు 15 శాతం స్టైఫండ్ పెంపుతోపాటు సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల గౌరవ వేతనాన్ని పెంచి గౌరవించుకుందని తెలిపారు.

# ఆర్‌టిసిలో ఔట్‌సోర్సింగ్ నియామకాలు రద్దు చేయాలి

## ఏజెన్సీల దళారీ వ్యవస్థను అరికట్టాలి

## ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టిసి)లో అవుట్ సోర్సింగ్ నియామకాలు రద్దు చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఏజెన్సీల దళారీ వ్యవస్థను అరికట్టాలి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు. ఆర్‌టిసి సంస్థ పుట్టినప్పటినుండి డ్రైవర్ కండక్టర్ల నియామకాలు రూల్ ఆఫ్ రెగ్యులేషన్ ప్రకారం జరిగేవని.. కానీ ప్రస్తుతం ఈ విధానాన్ని విస్మరించి ఎన్నడూ లేనివిధంగా డ్రైవర్, కండక్టర్ల నియామకాలను ఔట్ సోర్సింగ్ ద్వారా నియమించడాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నట్టు తెలి పారు. ఔట్ సోర్సింగ్ అనే అనాలోచిత నిర్ణయాన్ని యాజమాన్యం తీసుకువచ్చిందని, ఈ విధానం వలన సంస్థ నిర్వీర్యం అవుతుందన్నారు. గతంలో ఆర్‌టిసిలో ఖాళీలు ఏర్పడినప్పుడు సంస్థ ద్వారానే పారదర్శకంగా ఎప్పటికప్పుడు నియామకాలు చేసుకునే ఆనవాయితీ ఉండేదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఈ కొత్త విధానం వలన థర్డ్‌పార్టీ కాంట్రాక్ట్ ఏజెన్సీల నుండి డ్రైవర్ కండక్టర్ల నియామకాలను చేపట్టడంతో దళారీ వ్యవస్థలు కోకొల్లలుగా పుట్టుకొచ్చి అమాయకపు అభ్యర్థుల నుండి లక్షలాది రూపాయలకు కొలువులను అమ్ముకొంటున్నారని.. తద్వారా సంస్థకు చెడ్డపేరు వొస్తుందన్నారు. వెంటనే ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు యాజమాన్యాలు తగు చర్యలు చేపట్టాలని బాబు, వెంకన్న డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విభాగాలను అవుట్ సోర్సింగ్ చేసి చివరికి ఆర్‌టిసి సంస్థను మొత్తం ప్రైవేట్ పరం చేస్తూ.. పైకి మాత్రం ఆర్‌టిసిని అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్తున్నారని మండిపడ్డారు. ఔట్ సోర్సింగ్ నియామకాలను వెంటనే రద్దు చేసి, రెగ్యులర్ ప్రాతిపదికన నియామకాలను చేపట్టాలని, లేకపోతే భవిష్యత్తులో జరగబోవు ఆందోళనా కార్యక్రమాలకు యాజమాన్యమే బాధ్యత వహించవలసి వస్తుందని ఎంప్లాయీస్ యూని యన్ అధ్యక్షులు బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న హెచ్చరించారు.

# తల్లిదండ్రులను సరిగాచూడని సంతానం జీతంలో కోత హార్షణీయం: ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** తల్లిదండ్రులను సరిగా చూడని ప్రభుత్వ ఉద్యోగుల జీతాల నుంచి కోతపెట్టి నేరుగా తల్లిదండ్రులకు పంపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం సముచితమని ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్, ఎంపీ మల్లు రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపాలన చేస్తున్న ముఖ్యమంత్రి అన్ని వర్గాల సంక్షేమాన్ని చూస్తున్నారు అనడానికి ఇదే నిదర్శనమని అన్నారు. ఇలాంటి నిర్ణయాలను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. పాశమైలారం పరిశ్రమలో జరిగిన ప్రమాదం అత్యంత దురదృష్టకరమని మల్లు రవి అన్నారు. ప్రమాదంలో చనిపోయిన వారికి తన సంతాపాన్ని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్ట పరిహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని అన్నారు.

# లంచం తీసుకుంటూ ఎసిబికి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్ సునీత

**హైదరాబాద్ (మూసాపేట్), జూలై 1, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి జోనల్ పరిధిలోని మూసాపేట సర్కిల్ లో ఓ అధికారి లంచం తీసుకుంటూ ఎసిబి పట్టుబడింది. ఎసిబి అధికా రులు తెలిపిన వివరాల ప్రకారం ఓ వ్యక్తి తన ఆస్తి మ్యుటేషన్ నిమిత్తం మూసాపేట సర్కిల్ ఆస్తి పన్ను విభాగంలోని సీనియర్ అసిస్టెంట్ సునీతను సంప్రదించాడు. ఆమె ఆస్తి మ్యుటేషన్ పత్రాలు ఇచ్చేందుకు బాధితుడి నుండి 80 వేల రూపాయలు లంచం డిమాండ్ చేయగా, అతను ఆమెను బతిమి లాడటంతో 30 వేల రూపాయలకు తగ్గేది లేదంటి తెగేసి చెప్పింది. ఆమె వేధింపులు తట్టుకోలేక బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికా రులను సంప్రదించగా, మంగళవారం మధ్యా హ్నం సునీతకు బాధితుడు డబ్బులు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమె నుండి 30 వేల రూపా యలు, బాధితుడి ఫైల్ స్వాధీనం చేసుకొని ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారని అవినీతి నిరోధక శాఖ డిఎస్పీ శ్రీధర్ తెలిపారు.



సీనియర్ అసిస్టెంట్ సునీత

# ‘కె-ర్యాంప్’ ఫస్ట్ లుక్

యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా కె-ర్యాంప్. కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న 11వ చిత్రమిది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్ల మీద సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. కె-ర్యాంప్ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలిసిన మేకోవర్ లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్ గ్రౌండ్‌లో మందు



బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. కె-ర్యాంప్ కిరణ్ అబ్బవరం కెరీర్‌లో మరో ఫ్రెష్ అటెంప్ట్ అవుతుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి కె-ర్యాంప్ మూవీ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. నటీనటులు: కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, తదితరులు. టెక్నికల్ టీమ్ ప్రొడక్షన్ డిజైనర్: బ్రహ్మ కడలి యాక్షన్: పృథ్వీ, ఎడిటర్: ఛోటా కె ప్రసాద్, డీవోపీ: సతీష్ రెడ్డి మాసం, మ్యూజిక్: చేతన్ భరద్వాజ్, పీఆర్ఓ: జీఎస్ కే మీడియా(సురేష్ శ్రీనివాస్), వంశీ శేఖర్, కోప్రొడ్యూసర్ బాలాజీ గుట్ట.

# అద్భుతం ‘కన్నప్ప’ చిత్రం

విష్ణు మంచు కన్నప్పచిత్రానికి అన్ని చోట్లా పాజిటివ్ టాక్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇక మౌత్ టాక్ పాజిటివ్‌గా ఉండటంతో రోజు రోజుకీ కలెక్షన్స్ పెరుగుతున్నాయి. అన్ని చోట్లా హౌస్ ఫుల్ బోర్డులు పడుతున్నాయి. ఈ క్రమంలో కన్నప్ప సినిమాను రాజకీయ ప్రముఖులు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ వంటి వారు ఆదివారం రాత్రి ప్రత్యేకంగా వీక్షించారు. వీరితో పాటుగా మోహన్‌బాబు,విష్ణు వంటి వారు కూడా ఈ స్పెషల్ స్క్రీనింగ్‌లో సందడి చేశారు. కన్నప్ప చిత్రాన్ని వీక్షించిన అనంతరం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ, కన్నప్పచిత్రం ఊహకు మించి ఉంది. అర్జునుడిగా, తిన్నడిగా, కన్నప్పగా విష్ణు అద్భుతంగా నటించారు.



ఇంత గొప్ప చిత్రం నిర్మించిన మోహన్ బాబుకి అభినందనలు. కథ, కథనం, విజువల్స్, యాక్టింగ్ అన్ని ఇలా గొప్పగా అనిపించాయి. ఇదొక మైల్ స్టోన్ చిత్రం అవుతుంది అని అన్నారు. సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, చాలా రోజుల తరువాత మంచి చిత్రాన్ని చూశాను. ఇంత గొప్ప చిత్రాన్ని నిర్మించిన మోహన్ బాబుకి, విష్ణుకి ధన్యవాదాలు. శివ భక్తులంతా పరవ శించి పోయేలా మూవీని తీశారు. మేం అంతా కలిసి ఈ మూవీని చూసి ఎంతో ఆనందించాం. మన కథను అందరికీ తెలిసేలా చేయాలి. ఇలాంటి చిత్రాల్ని అప్పుడప్పుడు అయినా తీయాలని సినిమాటోగ్రఫీ మినిస్టర్‌గా నేను అందరినీ కోరుతున్నాను అని అన్నారు.




రానా దగ్గుబాటి కంటెంట్ డ్రివెన్ సినిమాలకు సపోర్ట్ ఇస్తున్నారు. ప్రొడ్యూస్ చేసినా, ప్రెజెంట్ చేసినా అతను యూనిక్ కథలకు మద్దతు ఇస్తూనే ఉన్నారు. తన బ్యానర్, స్పిరిట్ మీడియాలో రానా ఇప్పుడు న్యూ ప్రాజెక్ట్ కొత్తపల్లిలో ఒకప్పుడు కోసం ప్రవీణ పరుచూరితో మరోసారి చేతులు కలిపారు. ఈ చిత్రం ద్వారా ప్రవీణ పరుచూరి దర్శకురాలిగా అరంగేట్రం చేస్తున్నారు. కొత్తపల్లిలో ఒకప్పుడు పల్లెటూరి సున్నితమైన హాస్యంతో కూడిన, లైట్ హార్టెడ్ ఎంటర్‌టైనర్. కంచరపాలెం, ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య వంటి కల్ట్ ఫేవరెట్ చిత్రాలను నిర్మించిన ప్రవీణ ఇప్పుడు డైరెక్షన్ లోకి అడుగుపెడుతున్నారు. ఇది ఒక నాస్టాల్జిక్, హ్యూమరస్, ఆలోచింపజేసే కథ. ఈ చిత్రం ఒక

# ‘కొత్తపల్లిలో ఒకప్పుడు’ త్వరలో రిలీజ్

సంఘటన తర్వాత ఊహించని మలుపు తిరిగిన ఒక గ్రామ యువకుడి నేపథ్యంలో సాగుతుంది. లాస్ ఏంజిల్స్‌కు చెందిన అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ కొత్తపల్లిలో ఒకప్పుడు కు న్యూ విజువల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తున్నారు. అద్భుతమైన పాటలు, డ్యాన్స్ సీక్వెన్సులు, హాస్యంతో కూడిన ఉపకథల ద్వారా ఈ చిత్రం సరికొత్త అనుభూతిని పంచబోతోంది. కొత్తపల్లిలో ఒకప్పుడు





సినిమా అన్నీ వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉండబోతోంది. కొత్తపల్లిలో ఒకప్పుడు త్వరలో థియేటర్లలో విడుదల కానుంది. ఇది తెలుగు సినిమాకు ఒక లవ్ లెటర్.

# ‘తమ్ముడు’ మూవీ ట్రైలర్ లాంచ్

సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ తమ్ముడు. నితిన్ హీరోగా దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న తమ్ముడు సినిమా వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తమ్ముడు సినిమా రిలీజ్ ట్రైలర్‌ను హైదరాబాద్‌లో ఘనంగా లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవోపీ కేవీ గుహన్ మాట్లాడుతూ, దిల్‌రాజు బ్యానర్ అంటే నాకు హోమ్ బ్యానర్ లాంటిది. తమ్ముడు సినిమాకు



ముగ్గురు డీవోపీలం పనిచేశాం. అయితే మీరు సినిమా చూస్తున్నప్పుడు ఆ తేడా ఎక్కడా కనిపించదు. టెక్నీషియన్స్‌గా మేమే కాదు ఆర్టిస్టులు కూడా ఈ మూవీ కోసం చాలా కష్టపడ్డారు. ఈ సినిమా నేను చూశాను. బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది అన్నారు. ఎడిటర్ ప్రవీణ్ పూడి మాట్లాడుతూ, దిల్ రాజు, నితిన్, శ్రీరామ్ వేణుతో నేను గతంలో పనిచేశాను. శ్రీరామ్ వేణుతో నాకిది మూడో మూవీ. చాలా మంచి క్యారెక్టర్స్ డిజైన్ చేసుకుని వాటి ద్వారా నావెల్టీ ఉన్న మూవీని శ్రీరామ్ వేణు రూపొందించారు. వకీల్ సాబ్ మూవీ చేస్తున్నప్పటి కంటే ఎక్కువ గంటలు డైరెక్టర్‌తో నేను డిస్కషన్స్ చేశాం. నాకు చాలా ఫ్రీడమ్ ఇచ్చి వర్క్ చేయించుకున్నారు. అన్నారు. గీత రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ, తమ్ముడు సినిమాలో పగడాలమ్మ జాతర నేపథ్యంలో జై బగళాముఖీ పాట రాసే అవకాశం రావడంతో నా జన్మ ధన్యమైందని భావిస్తున్నాను. ఈ పాటను అజనీష్ ఎంతో ప్రతిభావంతంగా కంపోజ్ చేశాడు. అమ్మవారి పాటను ఈ సినిమాలో చిత్రీకరించాలని ఆలోచన దర్శకుడు శ్రీరామ్ వేణు గారికి రావడం గొప్ప విషయం. ఇందుకు నిర్మాతలు ఎంతో సపోర్ట్ చేశారు. ఈ పాటకు పనిచేస్తున్నప్పుడు తమ్ముడు సినిమా కోసం టీమ్ అంతా ఎంత కష్టపడుతున్నారో తెలిసింది. తమ్ముడు సినిమా మీద కనకవర్షం కురవాలని కోరుకుంటున్నా అన్నారు. నటి హారితేజ మాట్లాడుతూ, తమ్ముడు సినిమాలో ఒక ఇంపార్టెంట్ క్యారెక్టర్ చేశాను. ఈ సినిమా కోసం వెళ్లినప్పుడు డైరెక్టర్ జ్వరంతో ఉండి కూడా క్యారెక్టర్ నెరేట్ చేశారు. సినిమా షూటింగ్ లో కష్టపడ్డాం అయితే ఆ కష్టం తర్వాత సక్సెస్ రూపంలో రాబోతున్న సంతోషం ఎంతో విలువైనదిగా భావిస్తాను అన్నారు. బేబి దిత్య మాట్లాడుతూ, తమ్ముడు మూవీలో నన్ను ఆడిషన్‌లో సెలెక్ట్ చేసిన డైరెక్షన్ టీమ్‌కు థ్యాంక్స్ చెబుతున్నా. అలాగే నన్ను ఈ క్యారెక్టర్‌లో నటింపజేసిన డైరెక్టర్, మా నాన్నకి థ్యాంక్స్. తమ్ముడు మూవీ అమేజింగ్‌గా ఉంటుంది. మీరంతా బాగా ఇష్టపడతారు అన్నారు.మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మాట్లాడుతూ, తమ్ముడు మూవీకి పనిచేసిన ఎక్స్‌పీరియన్స్ చాలా ప్రత్యేకం. ఈ సినిమాలో ఒక సందర్భంలో డైరెక్టర్ గారు సెల్ఫ్ రెస్పెక్ట్ గురించి, మన ఇంటిగ్రిటీ గురించి చెప్పారు.

# సింధూర సంజీవని ‘మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్’


జెట్టి సినిమాతో హీరోగా సుపరిచితులైన కృష్ణా మానినేని సేవా దృక్పథంతో 100 డ్రీమ్స్ సేవా సంస్థ ద్వారా పలు కార్యక్రమాలు గత ఎనిమిది సంవత్సరాలుగా నిర్వహించుచున్నారు. పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ అభిమానిగా విజయవాడ వరదల సమయంలో హీరో కృష్ణ మానినేని చేసిన సేవా కార్యక్రమాలు ప్రశంసలు అందుకున్నాయి. 100డ్రీమ్స్ సేవా సంస్థ వ్యవస్థాపకులు కృష్ణా మానినేని జూన్ 14 సంజీవని పేరిట నేడు చిరంజీవి బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించి, 251 డోనర్స్‌తో రక్తదాన కార్యక్రమం దిగ్విజయం చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు స్వామి నాయుడు, 100 డ్రీమ్స్ వాలంటీర్స్, మెగాస్టార్ పవర్ స్టార్ అభిమానులు, పంచ్ ప్రసాద్, జబర్దస్త్‌రాముతో పాటు, ఎంరవికుమార్, విజయ్ భాస్కర్, సత్యదేవ్, మహేష్ బాబు,



ఇంటర్నేషనల్ బ్లడ్ డొనేషన్ డేను పురస్కరించుకొని సింధూర బాలకృష్ణ, కిషోర్ కౌతారపు, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

# లాంఛనంగా పూరి కనెక్ట్స్ పూజా కార్యక్రమాలు

డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతితో కలిసి అత్యంత ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా మూవీ చేయబోతున్నారు. ప్రీప్రొడక్షన్ పూర్తయిన ఈ చిత్రం త్వరలో సెట్స్ పైకి వెళ్లనుంది. నిర్మాతలు స్టార్ నటీనటులను ఒక్కొక్కరిగా పరిచయం చేయడం ఈ ప్రాజెక్ట్ చుట్టూ అంచనాలు పెరుగుతున్నాయి. ఈ అత్యంత ప్రతిష్టాత్మకమైన వెంచర్‌ని పూరి జగన్నాథ్ పూరి కనెక్ట్స్ బ్యానర్‌లో చార్మీ కౌర్ ప్రెజెంట్‌గా, రితీ మోషన్ పిక్చర్స్ రితీ నారాయణ్ రావు కొండ్రోల్లా కొలాబరేషన్‌తో నిర్మిస్తున్నారు. రితీ మోషన్ పిక్చర్స్‌తో కొలాబరేషన్ మూవీ గ్రాండియర్‌ని మరింతగా పెంచుతోంది, దర్శకుడు పూరి జగన్నాథ్ సినిమాకి సంబధించిన అన్నీ విషయాల్లో చాలా కేర్ తీసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా ప్రేక్షకులని అలరించే స్క్రిప్ట్, నటీనటులని ఎంపిక చేశారు. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, టబు, విజయ్ కుమార్ ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబినేషన్లో వస్తున్న చిత్రం ఈరోజు పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది., జూలై మొదటి వారం నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించే లక్ష్యంతో ఈ పాన్‌ఇండియా ఎంటర్‌టైనర్ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ.. ఐదు భాషలలో విడుదల కానుంది. మరిన్ని ఎక్సయిటింగ్ అప్‌డేట్స్‌ని మేకర్స్ త్వరలో రివిల్ చేయనున్నారు. తారాగణం: విజయ్ సేతుపతి, సంయుక్త, టబు, విజయ్ కుమార్. సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: పూరి జగన్నాథ్, నిర్మాతలు: పూరి జగన్నాథ్, జెబి నారాయణరావు కొండ్రోల్లా, ప్రజెంట్స్: చార్మీ కౌర్, బ్యానర్: పూరి కనెక్ట్స్, జెబి మోషన్ పిక్చర్స్, సిఈవో: విషు రెడ్డి, పీఆర్వో: వంశీశేఖర్, మార్కెటింగ్: హాష్టాగ్ మీడియా.



# ‘వీడే మన వారసుడు’ ప్రీరిలీజ్

నేటి సమాజానికి ఎంతో అవసరమైన మెసేజ్ అందిస్తూ రమేష్ ఉప్పు (ఆర్ఎస్‌యు) హీరోగా, లావణ్య రెడ్డి, సర్వాణి మోహన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం వీడే మన వారసుడు. రమేష్ ఉప్పు (ఆర్ఎస్‌యు) కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, దర్శకత్వం వహిస్తూ నిర్మించిన ఈ సినిమా ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో సినీ రాజకీయ ప్రముఖులుపాల్గొని చిత్ర యూనిట్‌కు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్టీటాలెంట్ చూపిస్తున్న రమేష్ ఉప్పును దర్శకరత్న దాసరితో పోల్చారు పాల్గొన్న అతిథులు. సమ్మెట గాంధీ, దేవసేన (వెంకటగిరి), విజయ రంగరాజు, ఆనంద్ భారతి, గూడూరు కిషోర్, శిల్ప (వైజాగ్) కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రం జులై 18న తెలుగు రాష్ట్రాలలో విడుదల చేయబోతున్నట్టు చిత్ర దర్శకనిర్మాత రమేష్ ఉప్పు తెలిపారు. ముఖ్య అతిథి ఎంఎల్ఎ మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, అంతా తానే అయి సినిమాను తీసిన ఉప్పు రమేష్‌ను అభినందిస్తున్నాను. రమేష్ ఉప్పు 1994లో నాకోసం పాటలు చేసేవారు. ప్రతిభ ఉన్న కళాకారుడు. ఆయన కలలు నెరవేరాలని కోరుకుంటున్నాను. ఒకప్పుడు మెసేజ్ సినిమాలు వచ్చేవి.. ఆ తరహాలో ఈ సినిమాను హిట్ చేయాలని కోరుకుంటున్నాను అని అన్నారు. 30 ఇయర్స్ పృథ్వీ మాట్లాడుతూ, ఈ సినిమాను సూపర్ హిట్ చేయాలనీ కోరుకుంటున్నాను. కాంగ్రెస్ నాయకులు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ సినిమా ట్రైలర్, సాంగ్స్ చూసాను. చాలా బాగా వచ్చాయి. చినుకు చినుకు సంద్రం అయినట్టు ఈ వేడుకకు వచ్చిన ప్రతీ ఒక్కరు ఈ సినిమా గురించి ప్రమోట్ చేయండి. ఈ సినిమా టీం అంతా బాగా చేశారు. అందరికి శుభాకాంక్షలు అని అన్నారు.



డైరెక్టర్ వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ, ట్రైలర్ చూశాను. చాలా బాగుంది. యాక్షన్ సీన్స్ బాగున్నాయి. ఒంటరిగా సినిమాల్లో వచ్చిన రమేష్ ఉప్పు.. అసలైన సినీ వారసుడిగా కోరుకుంటున్నాను అని అన్నారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ, చిత్ర యూనిట్ సభ్యలకు ముందస్తు శుభాకాంక్షలు. సినిమా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది అని అన్నారు. పోలీసు ఆఫీసర్ రామావత్ తేజ మాట్లాడుతూ, ఈ సినిమాను హిట్ చేయాలని ప్రతి ఒక్కరిని కోరుకుంటున్నాను. సినిమాను హిట్టు చేయాలని ఇక్కడికి అందరు న్యాయబద్ధంగా వచ్చారు. నేను చట్టబద్ధంగా వచ్చాను.

# ‘సయారా’ నుంచి సాంగ్

సయారా నుంచి రానున్న ధన్ కోసం అర్జిత్ సింగ్, మిథున్, మోహిత్ సూరి సంగీత త్రయం తిరిగి వచ్చింది. ఈ ముగ్గురూ హిందీ చిత్ర పరిశ్రమలో అతిపెద్ద చారిత్రాత్మక చార్ట్‌బస్టర్లను సృష్టించారు. ఆషికి 2 నుంచి తుమ్ హి హో వంటి గీతాన్ని ఈ ముగ్గురూ కలిసి సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ పాట ఇప్పటికీ ఎప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది. సమయం కలిసి వచ్చినప్పుడు ఓ మాయాజాలం జరుగుతుందని చెబుతుంటారు. నా జీవితంలో మిథున్, అరిజిత్ సింగ్ వంటి వారు నాకు దొరకడం అదృష్టం. మన దేశంలోని ఈ ఇద్దరు కళాకారులతో నా ఉత్తమ సంగీతాన్ని సృష్టించే అదృష్టం నాకు కలిగింది. మిథున్ మరియు నా సహకారం, నేను కలిసి 2005లో జెహెర్, కలియుగ్ సినిమా చేశాం. మా ఇద్దరి జర్నీ మొదలై 20 సంవత్సరాలు అయింది. 2005 నుంచి మిథున్‌తో కలిసి మర్డర్ 2, ఆషికి 2, ఏక్ విలన్స్, హమారి అధూరి కహానీ, హాఫ్ గర్ల్‌ఫ్రెండ్, మలంగ్ వంటి చిత్రాలు చేశాము. మేం ఎన్నో కల్ట్ క్లాసిక్ రొమాంటిక్ పాటల్ని అందించాం. మిథున్, నేను కలిసి పని చేసినప్పుడల్లా గొప్ప ట్రాక్ అందించాలని ప్రయత్నిస్తుండేవాళ్లం. మా మీద ఎప్పుడూ పెద్ద అంచనాలుంటాయి. ఆ ఒత్తిడిని మేం ఆస్వాదిస్తుంటాం. అర్జిత్ సింగ్ నాకు ఈ జీవితాంతం గుర్తుండిపోయే అద్భుతమైన జ్ఞాపకాలను ఇచ్చిన గాయకుడు. ఆషికి 2 నుంచి తుమ్ హి హో, చాహున్ మై యా నా, హమ్ మర్ జాయేంగే, ఏక్ విలన్‌లోని హమ్‌దార్ద్, హమారీ అధూరి కహానీ టైటిల్ ట్రాక్ వరకు, హాఫ్ గర్ల్‌ఫ్రెండ్‌లోని ఫిర్ భీ తుమ్కో చాహుంగా, మలాంగ్‌లోని చల్ ఘర్ చలేన్ వంటి పాటలెన్నో క్లాసిక్‌గా నిలిచాయి. మిథున్, అరిజిత్, నేను కలిసి పని చేస్తున్నప్పుడు ప్రజలు గుర్తుండిపోయే పాట ఇవ్వాలని కోరుకుంటారు. ప్రజల్లో మాపై ఉండే అంచనాల గురించి తెలుసు. మేము ముగ్గురం మళ్ళీ సయారాలో ధన్ కోసం జతకట్టాం. ఈ ట్రాక్ మాకు చాలా ప్రత్యేకమైనది. ప్రేమలో, జీవితంలో జరిగే పోరాటాన్ని జరుపుకునే పాట. జీవితం పూల పాన్పు కాదు. ధన్ అనే పాట స్ఫూర్తిని నింపేలా ఉంటుంది అని మోహిత్ సూరి అన్నారు. సయారా నుంచి ఇప్పటి వరకు రిలీజ్ చేసిన నాలుగు పాటలు చార్ట్ బస్టర్‌లు నిలిచాయి. ఇక ఇప్పుడు ధన్ అనే పాటను రిలీజ్ చేయబోతోన్నారు. యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మాణంలో మోహిత్ సూరి దర్శకత్వంలో ఈ చిత్రం రాబోతోంది.



# హార్మోన్లు సమతుల్యంగా ఉండాలంటే.. !

హార్మోన్ల అసమతౌల్యత.. ప్రస్తుతం చాలామంది మహిళలు ఎదుర్కొంటున్న సమస్య ఇది. అతిగా బరువు పెరగడం, నిద్ర పట్టకపోవడం, బద్ధకంగా అనిపించడం, రుతు సంబంధిత సమస్యలు.. మొదలైనవన్నీ హార్మోన్ల అసమతౌల్యతకు కారణాలు కావచ్చు. అయితే శరీరంలో వివిధ రకాల హార్మోన్లన్నీ సవ్యంగా విడుదలైనప్పుడే ఆరోగ్యంగా ఉండగలుగుతాం. మరి ఇందుకోసం నిపుణులు సూచించే కొన్ని సలహాలేంటో తెలుసుకుందాం..



**ఏడెనిమిది గంటల నిద్ర..** నిద్రలేమితో కూడా హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. కాబట్టి రోజుకి కనీసం 7-8 గంటలు నిద్రపోవడం అలవాటు చేసుకోవాలి. అలాగే హార్మోన్లు సమతుల్యంగా ఉంటే శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. అంతేకాకుండా ఎలాంటి ఆరోగ్య సమస్యలూ దరిచేరవు.

**వ్యాయామం చేయాలి..** హార్మోన్ల అసమతుల్యత ఏర్పడినప్పుడు వాకింగ్, స్విమ్మింగ్.. లాంటి వ్యాయామాలు చేయాలి. ఇలా చేయడం వల్ల కొద్ది కాలంలోనే ఈ సమస్యను దూరం చేయవచ్చు ఎలాంటి వ్యాయామాలు చేయాలన్న విషయంలో నిపుణులను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి.

**ఆహారంలో విషయంలో..** హార్మోన్లను సమతుల్యంగా ఉంచుకోవడానికి.. మన తీసుకునే ఆహారంలో కార్బొహైడేట్లు, కొవ్వులు, ప్రొటీన్లు తగినంత మేర ఉండేలా చూసుకోవాలి. రోజు రెండుమూడు రకాల కూరగాయలు, పండ్లు తీసుకోవాలి. ముఖ్యంగా ఆకుకూరలు.. ఎందుకంటే వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తంలోని ఇన్సులిన్ స్థాయిని సమన్వయ పరుస్తుంది. అలాగే ఫైబర్ అధికంగా ఉండే బొప్పాయి యాపిల్, జామ పండ్లను ఎక్కువగా తినాలి.



**కొబ్బరినూనెతో..** హార్మోన్లపై కొబ్బరి నూనె ప్రభావం చాలానే ఉంటుంది. శరీరంలో వివిధ హార్మోన్లు ఉత్పత్తి కావడానికి కొబ్బరి నూనె కూడా ఉపయోగపడుతుంది. అంతేకాదు.. దీన్ని ఆహారంలో భాగంగా తీసుకుంటే బరువు తగ్గే అవకాశం కూడా ఉంటుంది.

**వెజిటబుల్ ఆయిల్స్...** మన శరీరంలో కొవ్వుల పాత్ర చాలానే ఉంది. శరీరంలో హార్మోన్ల ఉత్పత్తికి, వివిధ కనాలు తిరిగి నిర్మితమవడానికి కొవ్వులు ఎంతో ఉపయోడపతాయి. ఈ క్రమంలో వెజిటబుల్ ఆయిల్స్‌లో పాలీశ్చాచురేటెడ్ కొవ్వులు అధిక మొత్తంలో ఉంటాయి. కాబట్టి వంటకాల్లో ఈ నూనెల్ని వాడటం మంచిది.



**కాఫీ..** అలవాటైందనో లే ఇష్టమనో కొందరు పదే పదే కాఫీ తాగుతుంటారు. కానీ కాఫీ ఎక్కువగా తాగకూడదు. ప్రత్యేకించి గర్భవతిగా ఉన్నప్పుడుకాఫీ తాగితే కొన్ని సందర్భాల్లో అది ఆరోగ్యం పైన దుష్ప్రభావం చూపించే ప్రమాదమూ లేకపోలేదు.

**టాక్సిన్స్‌కి దూరంగా..** ఇంట్లో వివిధ వస్తువులను శుభ్రం చేయడానికి ఉపయోగించే రసాయనాలు, క్రిమి సంహారక మందులు, ప్లాస్టిక్ మొదలైన వాటిలో విష పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి సాధ్యమైనంత వరకు ఇలాంటి వాటిని ఉపయోగించకపోవడమే ఉత్తమం. □

# తనలాంటి వారికి అండగా నిలుస్తూ..



**మనలో ఎంతో మంది.. చేతికి చిన్న గాయమైతేనే బెంబేలెత్తిపోతారు. కానీ, ఆడిపాడాల్సిన వయసులో మస్క్యులర్ డిస్ట్రఫీ వ్యాధిబారిన పడి చక్రాల కుర్చీకే పరిమితమైనా కుంగిపోలేదు శోభారాణి. తనకు ఎదురైన ఈ కష్టాన్ని ధైర్యంగా అధిగమించడమే కాదు.. తోటి వారికీ అండగా నిలవాలనుకున్నారు. అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ (ఎఆర్‌డివో) పేరుతో సంస్థను ఆరంభించి సేవలందిస్తున్నారు.**


గొప్ప రోజులంటూ ప్రత్యేకంగా ఉండవు. ప్రతిరోజునీ మనమే గొప్పగా మార్చుకోవాలి. అంటూ అమ్మానాన్నలు చెప్పిన మాటలే నాకు స్ఫూర్తి. మాది నూజివీడు సమీపంలోని ఈదర. సామాన్య మధ్యతరగతి కుటుంబం. అమ్మ జ్యోతి, నాన్న లక్ష్మయ్యలకు మేం ఇద్దరం ఆడపిల్లలం. అయ్యో ఇద్దరు అమ్మాయిలేనా అని అందరూ నిట్టూరుస్తున్నా.. వాళ్లు మాత్రం మమ్మల్ని ఉన్నతంగా చూడాలని కలలు కనేవారు. అయితే, అన్నీ మనం అనుకున్నట్లు జరగవు కదా! అప్పటికి నాకు పన్నెండేళ్లు. రెక్కలు విప్పుకొన్న ఆలోచనలతో భవిష్యత్తు లక్ష్యాలను సిద్ధం చేసుకుంటున్నా. అప్పుడప్పుడూ కింద కూర్చుని లేవలేకపోయేదాన్ని. నడుస్తూ కిందపడిపోయే దాన్ని. మొదట్లో అది బలహీనత అనుకున్నాం. ఈ వ్యాధి తీవ్రతను గుర్తించలేక పోయాం. చాలా రోజులు ఇదే పరిస్థితి కొనసాగేసరికి కుటుంబ సభ్యులు విజయవాడలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పెద్దయ్యే కొద్దీ ఆరోగ్యం మెరుగుపడుతుందని అక్కడి వైద్యులు చెప్పారు. కానీ రోజులు గడుస్తున్నా ఫలితం కనపించలేదు. ఇక లాభం లేదనుకుని హైదరాబాద్‌లోని నిమ్స్‌కి వెళ్లాం. అక్కడి వైద్యులు పరీక్షించి దీన్ని కండరాల బలహీనత (మస్క్యులర్ డిస్ట్రఫీ)గా నిర్ధరించారు.

**అవగాహన లేదని తెలిసి..** అలాంటి వ్యాధి ఒకటుంటుందని విన్నది కూడా అప్పుడే. పైగా నివారణకు మందుల్లేవని తెలిసి ఇంటిల్లిపాదీ షాక్‌కి గురయ్యాం. ఇదొక అరుదైన జన్యుపరమైన దీర్ఘకాలిక వ్యాధి వయసుతో సంబంధం లేకుండా ఎవరికైనా రావొచ్చు. ఈ వ్యాధిబారిన పడ్డవారు. ఇతరుల సాయం లేకుండా ఏ పనులు చేసుకోలేరు. అప్పటివరకూ ఉన్నదాంట్లో సంతృప్తిగా జీవించిన మా కుటుంబ సభ్యులకు కష్టాలు మొదలయ్యాయి. ఏ పాపం చేస్తే ఇలా జరిగిందో అన్న ఇరుగుపొరుగువారి మాటలూ చెవిన పడ్డాయి. దీనికి తోడు అందరిలా చలాకీగా ఉండలేకపోతున్నానే బాధ.. దీంతో డిప్రెషన్‌కి లోనయ్యా, ఆత్మహత్య ఆలోచనలూ వెంటాడాయి. ఆ మయంలో ఫేస్‌బుక్ ద్వారా మస్క్యులర్ డిస్టఫీ బాధితులు కొందరితో మాట్లాడా. వారంతా నాకంటే ఎక్కువ సమస్యలతో ఉన్నారని అర్థమైంది దీంతో నా కాళ్లమీద నేను నిలబడటమే కాదు. నాలాంటి వారందరికీ సాయం చేయాలనే నిర్ణయానికి వచ్చా. దీనికోసమే 2019లో అమరావతి రేర్ డిజీజెస్ ఆర్గనైజేషన్ (ఎఆర్‌డివో)ను స్థాపించాను. దీనిలో సుమారు 400 మంది బాధితులున్నారు. అరుదైన ఈ మస్క్యులర్ డిస్ట్రఫీపై అవగాహన కల్పిస్తున్నా. మెరుగైన వైద్య సదుపాయాలు అందేలా చూస్తున్నా. నిరుపేదలకు ప్రభుత్వ సహాయం కోసం ప్రయత్నించడం వంటివీ చేస్తూ.. ఈ వ్యాధి బారిన పడిన కుటుంబాలకు అండగా ఉంటున్నా. ముఖ్యంగా బ్రైట్ బిగినింగ్స్ ఎడ్యుకేషన్ అనే ప్రోగ్రామ్ డిజైన్ చేసి మస్కులర్ డిస్ట్రఫీ బాధిత చిన్నారులకు చదువులు చెప్పిస్తున్నాం. నిరుపేదలకు ఉచితంగా ఫిజియోథెరపీ సెషన్స్ నిర్వహిస్తున్నాం. దాతల సాయంతో ఈ వ్యాధిగ్రస్తులకు బ్యాటరీ వీల్ ఛైర్లనూ అందించా. వందల మందికి జెనెటిక్ పరీక్షలు చేయించాం. ఇవేకాదు భవిష్యత్తులో ఓ రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటుచేయాలనే ప్రణాళికలో ఉన్నా. నాలుగు గోడల మధ్య కుంగిపోతున్న వారి జీవితాల్లో వెలుగు నింపాలన్నదే నా లక్ష్యం. □



# 'ఫేషియల్ కప్పింగ్'తో యవ్వనంగా !

వయసు పెరిగినా అందం తరిగిపోకూడదనే అందరూ కోరుకుంటారు. ఈ క్రమలోనే పలు చికిత్సలు తీసుకోవడంతో పాటు ఇంటి చిట్కాలూ పాటిస్తుంటారు. అయినా కొందరికి చిన్న వయసులోనే ముఖంపై ముడతలు, గీతలు.. వంటివి ఏర్పడు తుంటాయి. ఇలాంటి వృద్ధాప్య ఛాయల్ని దూరం చేయడంలో 'ఫేషియల్ కప్పింగ్' పద్ధతి చక్కగా దోహదం చేస్తుందంటున్నారు సౌందర్య నిపుణులు.



బాడీ కప్పింగ్‌ను పోలి ఉన్నా. ఎన్నో విధాలుగా అందాన్ని ద్విగుణీకృతం చేసే ఈ పద్ధతిని పాటించే అమ్మాయిల సంఖ్య క్రమంగా పెరుగు తుందంటున్నారు. మరి, ఏంటీ ఫేషియల్ కప్పింగ్? సౌందర్య పోషణలో దీని పాత్రేంటి? తెలుసుకుందాం..



**బాడీ కప్పింగ్..** చాలామందికి తెలిసిన పద్ధతే! శారీరక నొప్పుల్ని దూరం చేసుకునేందుకు చాలామంది ఈ చికిత్స తీసుకుంటారు. 'ఫేషియల్ కప్పింగ్' కూడా ఇలాంటిదే! కానీ దీని ప్రయోజనాలు వేరుగా ఉంటాయి. చర్మానికి రక్తప్రసరణను పెంచి పునరుత్తేజితం చేసే ఈ సౌందర్య థెరపీతో వృద్ధాప్య ఛాయల్ని దూరం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. బాడీ కాప్పింగ్‌లో భాగంగా శరీరంపై కప్స్ అమర్చుకున్నప్పుడు మచ్చలు పడే అవకాశం ఎక్కువగా ఉన్నప్పటికీ. ఫేషియల్ కప్పింగ్‌లో ఈ సమస్య ఉండకపోవచ్చంటున్నారు.

✦ కప్పింగ్‌లో మాదిరిగానే ఫేషియల్ కప్పింగ్‌లోనూ సిలికాన్, గ్లాస్ మెటీరియల్‌తో రూపొందించిన వివిధ రకాల కప్స్ ఉపయోగిస్తారు. అయితే ఇవి కాస్తమృదువుగా ఉండడం వల్ల చర్మంపై మచ్చలు పడే అవకాశం చాలా తక్కువంటున్నారు నిపుణులు. ఫేషియల్ కప్పింగ్ కోసం ప్రత్యేకమైన కిట్స్ కూడా మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిని ఉపయోగించి ఫేషియల్ కప్పింగ్ ఎలా చేసుకోవాలో తెలుసుకుందాం.



✦ముందుగా ముఖాన్ని శుభ్రం చేసుకొని కాస్త తేమగా ఉండేలా తుడుచుకోవాలి.

✦ ఇప్పుడుచేతులు, మునివేళ్లతో ముఖంపై కాసేపు మర్దన చేసుకోవాలి. కొన్ని ఫేస్ ఆయిల్/ సీరమ్‌ని కూడా వాడచ్చు. దీనివల్ల కప్ మచ్చలు చర్మంపై పడకుండా జాగ్రత్తపడచ్చు.

✦. గడ్డం వల్ల నుంచి కప్పింగ్ థెరపీ మొదలుపెట్టాలి. గడ్డం వద్ద చిన్నకప్‌ని అమర్చుకోవాలి. కాసేపటి తర్వాత నోటి చుట్టూ అక్కడక్కడా కప్‌ని కొన్ని నిమిషాల చొప్పున అమర్చుకోవాలి. ఇలా ఆపై బుగ్గలు, నుదుటి వరకూ దశల వారీగా కప్‌ను అమర్చుకొని తొలగించుకోవాలి.

✦. బుగ్గలు, నుదురు వంటి విశాలమైన ప్రదేశాల్లో పెద్ద కప్స్‌ని కూడా ఉపయోగించచ్చు. ఇలా అవసరమైన ముఖ భాగాల్లో కప్పింగ్ చేసుకోవాలి.

✦. ముందుగా ఫేస్ ఆయిల్/సీరమ్ రాసుకున్న వాళ్లు కప్పింగ్ పూర్తయ్యాక ముఖం శుభ్రం చేసుకొని తడి పొడిగా ఉండేలా తుడుచుకోవాలి. ఆయిల్/సీరమ్ రాసుకోని వారు గోరువెచ్చటి నీటిని ముఖంపై చల్లుకొని తుడుచుకుంటే సరిపోతుంది. దీని వల్ల చర్మ రంధ్రాలు తెరుచుకొని శ్వాసిస్తాయి. ఫలితంగా అందం ఇనుమడిస్తుంది.

✦ ఆపై మీ బ్యూటీ రొటీన్‌ని యథావిధిగా కొనసాగించచ్చు. ఫేషియల్ కప్పింగ్.. సౌందర్య పోషణలో భాగంగా ఉపయోగించే పదార్థాల్ని చర్మం మరింతగా శోషించుకునేలా ప్రేరేపిస్తుంది. అవగాహన ఉన్న వారు ఫేషియల్ కప్పింగ్‌ని ఇంట్లోనే స్వయంగా చేసుకోవచ్చు. లేదంటే నిపుణులు ఎందుకంటే సరైన పద్ధతిలో దీన్ని పాటించినప్పుడు సత్ఫలితాలు పొందవచ్చుంటున్నారు. □

# ఇలా చేస్తే బూజు పట్టవు !

వర్షాకాలంలో తడిదనం, గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల వంటింటో ఉండే కొన్ని రకాల పదార్థాలు, స్నాక్స్.. వంటివి బూజు పడుతుంటాయి. ఇలా జరగకూడదంటే వాటిని నిల్వ చేసే విషంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాంరండి.



◆. బయటి నుంచి కొని తెచ్చుకున్న స్నాక్స్ చాలవరకు ప్యాకెట్లలో పిల్వ చేస్తారు. అయితే వీటిని ఒక్కసారి తెరిచాక.. వాటిని అలాగే వదిలేస్తే.. అవి మెత్తగా అయిపోతాయి కొన్ని కొన్ని స్నాక్ ఐటమ్స్ జూజు పడతాయి కదా! కాబట్టి సాక్స్ ఇంట్లో చేసినా, బయటి నుంచి తెచ్చుకున్నా గాలి చొరబడని గాజు జార్లలో నిల్వ చేయడం మంచిది.



◆ వంటింట్లో నీటి వినియోగం ఎక్కువగా ఉండడం, తడిదనం వల్ల ఆ వాతావరణం ఎప్పుడూ తేమగా ఉంటుంది. తద్వారా క్రిములు, ఫంగస్.. వంటివి వృద్ధి చెందే ప్రమాదం ఉంది. కాబట్టి నిల్వ చేసే పదార్థాలు, నితానయవసర సరుకుల్ని తేమ లేని చోట భద్రపరచాలి. అలాగే తేమ చేరకుండా మధ్యమధ్యలో, కప్‌బోర్డ్ మూలల్లో సిలికాజెల్ ప్యాకెట్లను ఉంచాలి.

◆ తేమకు ఉప్పు, చక్కెర.. వంటివి గడ్డ కడతాయి. కాబట్టి ఈ రెండూ కలగలిసిన స్నాక్స్‌ని రెండు ఒకచోట నిల్వ చేయకుండా విడివిడిగా భద్రపరచడం వల్ల రుచి కోల్పోకుండా, మెత్తబడకుండా జాగ్రత్త పడచ్చు.

✦. తినగా మిగిలిన చపాతీలు, వేపుళ్లను అల్యూమినియం ఫాయిల్స్ లో ప్యాక్ చేసి నిల్వ చేయడం వల్ల వాటి రుచి కోల్పోకుండా జాగ్రత్త పడవచ్చు.

✦. గోధుమ పిండి, శెనగపిండి.. వంటివి తేమ తగిలితే పాడవుతాయి. కాబట్టి వాటిని గాలి చొరబడని గాజు సీసాలో భద్రపరచి.. అందులో కొన్ని బిర్యాని అకుల్ని వేయాలి. తద్వారా ఈ ఆకులు ఏమాత్రం తేమ ఉన్నా పీల్చేసు కుంటాయి. □

# కొబ్బరి పచ్చడి ప్రీమిక్స్

ఇడ్లీ, వడ, దోశ. ఏ టిఫిన్‌లోకి అయినా కొబ్బరి చట్నీ ఉంటే ఇక చెప్పాల్సిందే.. అమృతంలా ఉంటుంది. ఈ చట్నీ ప్రీమిక్స్ చేసుకుందామా...



కొబ్బరి చట్నీ కోసం.. ఎండు కొబ్బరి తురుము కప్పు, డెసికేటెడ్ కొబ్బరి (చెమ్మలేని ఎండు కొబ్బరి) పావు కప్పు, పుట్నాల పప్పు టేబుల్ స్పూన్, నూనె లేకుండా వేయించిన పచ్చిమిరపకాయలు 2, పంచదార టేబుల్ స్పూన్, సిట్రిక్ యాసిడ్ చిటికెడు, ఉప్పు రుచికి తగినంత, ఆవాలు, మినపప్పు, జీలకర్ర, ఇంగువ పావు చెంచా, నూనె 2 చెంచాలు తీసుకోవాలి. ఎలా చేయాలంటే వీట నిషేధం మిక్సీ జార్లో వేసి గ్రైండ్ చేయాలి. కడాయిలో నూనె కాకనిచ్చి ఆవాలు, మినపప్పు, జీలకర్ర, కరివేపాకు, ఇంగువలతో తాలింపు వేసి గ్రైండ్ చేసిన మిశ్రమంలో కలపాలి. డెసికేటెడ్ కొబ్బరిని కూడా జోడించాలి. ఈ పొడర్ను తడి లేని సీసాలో భద్రం చేసుకోవాలి. చట్నీ కావాల్సినప్పుడు రెండు చెంచాల ప్రేమిక్స్‌లో కాస్త పెరుగు జతచేస్తే సరిపోతుంది. ఉరుకుల పరుగుల జీవితంలో పచ్చడి చేసేంత వెసులుబాటు లేనప్పుడు ప్రీమిక్స్ ఉంటే ఎంచక్కా క్షణాల్లో పనైపోతుంది. □

# డబ్బు గురించి చెబుతున్నారా?

తమ పిల్లలు తమ పిల్లలు మంచి ప్రయోజకులు కావాలని ప్రతి తల్లిదండ్రులు కలలు కంటారు. చెమటోడ్చి ఉన్నత చదువులు చదివిస్తుంటారు. అయితే పిల్లలు ప్రయోజకులుగా మారాలంటే చదువుతో పాటు ఆర్థిక క్రమశిక్షణ కూడా ఎంతో అవసరం అంటున్నారు. నిపుణులు. ముఖ్యంగా అమ్మాయిలకు చదువుతో పాటు ఆర్థికపరమైన విషయాల గురించి కూడా చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించాలని చెబుతున్నారు.

**అమ్మాయితో చర్చించండి..** ఇటీవలి కాలంలో పరిస్థితులు మారుతున్నా.. మన దేశంలో ఇప్పటికీ చాలామంది మహిళలు ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకునే విషయంలో తమ తండ్రులు, భర్తలు, సోదరులపై ఆధారపడతారు. అందుకే ఆర్థిక విషయాల్లో సొంతంగా తమ నిర్ణయాలు తాము తీసుకునేలా ఆడపిల్లల్ని తీర్చిదిద్దుకోవడం అవసరం. దీనికోసం ఇంట్లో జరిగే ఆర్థిక చర్చల్లో వారిని భాగం చేయండి. ఫలితంగా వారికి ఆర్థిక ప్రణాళిక, పన్నులు, ఖర్చులు వంటి వివరాలపై అవగాహన వస్తుంది. ఆర్థికపరమైన విషయాల గురించి మీ అమ్మాయితో చర్చించండి. అలాగే ఉద్యోగం వచ్చాక కూడా పొదుపు చేసేలా, సొంతంగా చిన్న మొత్తాల్లో పెట్టుబడులు పెట్టేలా. వారిని ప్రోత్సహించండి. ఫలితంగా ఆర్థికపరమైన విషయాల్లో ఎవరిపైనా ఆధారపడకుండా సొంతంగా నిర్ణయాలు తీసుకోగలుగుతారు.



**డబ్బు విలువ తెలుసా? ...** ఈ రోజుల్లో చాలామంది తల్లిదండ్రులు పిల్లల ఆనందం కోసం విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేయడం వారికి అడిగిందల్లా కొనివ్వడం. ఫలితంగా వారికి డబ్బు విలువ తెలియకుండా పోయే అవకాశం ఉంటుంది. ఇది వారి భవిష్యత్తుకు ఏమాత్రం మంచిది కాదు. కాబట్టి, పిల్లలకు చిన్నప్పటి నుంచే డబ్బు విలువ తెలిసేలా ఉండాలి నిపుణులు. దీనికోసం వారు చేయగలిగే కొన్ని పనులను అప్పగించండి. సరిగా చేస్తే బహుమతిగా కొంత నగదు ఇవ్వండి. ఒకవేళ పనిలో నాణ్యత లేకపోతే తక్కువ డబ్బు ఇవ్వండి. దీనివల్ల డబ్బులు సులభంగా రాదనే విషకుల వారికి అర్థమవుతుంది. ఫలితంగా వారు డబ్బుకు విలువివ్వడం. మొదలు పెడతారు.

**"ఆ వ్యత్యాసాన్ని తెలియజేయండి..** ఆశకి, అవసరానికి మధ్య ఎంతో వ్యత్యాసం కంటుంది. అది తెలిస్తే ఎవరైనా తమ ఖర్చులను అదుపులో పెట్టుకోవచ్చంటున్నారు నిపుణులు తల్లిదండ్రులుగా మీ పిల్లలకు ఇదే విషయాన్ని చెప్పండి. ఇలా చేయడం వల్ల వారు చేసే ఖర్చును వారే అదుపులో పెట్టుకునే అవకాశం ఉంటుంది. దీనికోసం మీ అమ్మాయి ఏదైనా వస్తువు కొనమని అడిగితే అది తప్పనిసరిగా లేకపోయినా పర్లేదా? అని అడిగిన నిర్ణయం తీసుకోండి. ఇదే పద్ధతిని మీ అమ్మాయికి క్రమంగా అలవాటు చేయండి. ఈవిధంగా ఆలోచించడం వల్ల వారు భవిష్యత్తులో బలమైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోగలుగుతారు. □

# సేవయే అసలైన ఆరాధన

ఆధ్యాత్మికం



**ఒకింట్లో** అరవై ఏళ్ళ స్త్రీ ఆవిడ కొడుకు, కోడలుండేవారు. వారు కొంత ఆస్థిపరులే. ఒకసారి పెద్దావిడకు జబ్బు చేసింది. ఆమె కోడలు తన భర్తతో 'ఏమండీ! అత్తమ్మగారి ఆరోగ్యం మనం పుణ్యక్షేత్రాలు వెళ్లి అక్కడ దేవాలయాలల్లో పూజలు చేసి, దేవుళ్ళకు దండం పెట్టి, ప్రార్థిద్దాం, ఆమె కోలుకొంటుంది, అని చెప్పింది. అవును నీ ఆలోచన బాగుంది, మా అమ్మ ఆరోగ్యం కొరకు ఎన్ని కష్టాలు నష్టాలు కల్గినా సరే, అన్నాడు ఆమె భర్త ఒక పనిమనిషినిపెట్టి 'టైం సరిగాన మా అమ్మకు టిఫెన్ పెట్టు, భోజనం ఇవ్వు' అన్నాడు కొడుకు కోడలు చాలా శ్రద్ధగా, ఇదో లక్ష్మీ ప్రొద్దున, మధ్యాన్నం, రాత్రి ఏఏ మాత్రలు ఇవ్వాలో జాగ్రత్తగా చూసి ఇవ్వు, మరువద్దు, నిన్ను నమ్మి నీ చేతిలో మా అత్తమ్మను పెట్టి పోతున్నాం, త్వరగా వస్తాం అని చెప్పింది. కొడుకు కోడలు యాగంటి. మహానంది, అహోబిలం వెళ్ళి అన్ని దేవాలయాల్లో పూజలు చేయించి, దేవుళ్ళకు మొక్కి వారంరోజుల తర్వాత వచ్చారు. పెద్దావిడ ఆరోగ్యం ముందుకంటే క్షీణించింది. ఇక శ్రీశైలం, యాదగిరి గుట్టకు, విజయవాడ కనుకదుర్గమ్మ వద్దకు వెళ్ళి వచ్చారు. పెద్దావిడ ఆరోగ్యం ఇంకా క్షీణించింది. కలియుగ దైవం వేంకటేశ్వరుడు కరుణిస్తాడని తిరుపతికి, దగ్గర్లోనే వున్న కాళహస్తికి వెళ్ళి పూజలు చేయించి వచ్చారు. కొద్ది రోజులకే పెద్దావిడ కన్నుమూసింది. ఆవిడ ఆస్తికలను తీసుకొని కాశికి, గయకువెళ్ళి కర్మలు చేయించి వచ్చారు. పెద్దావిక వద్దే కొడుకు, కోడలుండి భక్తి శ్రద్ధలతో ఉండి, తీర్థం ఇచ్చి, ఔషదాలిచ్చి సేవలు చేసింటే, దైవం మెచ్చేది, వారి కోరికను తీర్చి ఉండేది. సేవే నిజమైన ఆరాధన.

- రాచమడుగు శ్రీపవాసులు

# సేవలో మహిళలు ముందు !



విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు సేవ చేయడానికి ముందుండేది ఆడవాళ్లే. సామాజిక కార్యకర్తలుగా, హెల్త్‌కేర్ వర్కర్లుగా పనిచేసే వాళ్లలో 70 శాతం మంది మహిళలూ, అమ్మాయిలేనట. అయితే, 50 శాతం మహిళలకు కృషికి తగ్గ గుర్తింపు, ఫలితం అందడం లేదట. ఏది ఏమైనా.. అమ్మ ప్రేమను కుటుంబానికే కాదు, సమాజానికి అందించడంలోనూ మనకు మనమే సాటి! □

# ఫస్ట్ మ్యాచ్‌లోనే ఫస్ట్ ఓవర్ మెయిడెన్

## తారెత్తించిన 8 మంది భారత్ బౌలర్లు


ఆశిష్ నెహ్రా


భువనేశ్వర్ కుమార్


జయదేవ్ ఉనద్కట్


షమీ


ముకేష్ కుమార్


ప్రవీణ్ కుమార్


సుదీప్ త్యాగీ


టిను యోహాన్నన్

**న్యూఢిల్లీ:** వన్డే అంతర్జాతీయ క్రికెట్‌లో మెయిడెన్ ఓవర్ వేయడం అరుదుగా జరుగుతుంది. ఒక బౌలర్ తన కెరీర్‌లోని తొలి వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లోనే తన తొలి ఓవర్ మెయిడెన్ వేస్తే అది అతనికి గొప్ప విజయం. వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన తొలి ఓవర్‌నే మెయిడిన్‌గా వేయడం. క్రికెట్ చరిత్రలో అరుదైన రికార్డులలో ఒకటి. ఒక ఓవర్‌లో బౌలర్ ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా వేస్తే, దానిని మెయిడిన్ ఓవర్ అంటారు. బౌలర్ తన అంతర్జాతీయ కెరీర్‌ను తొలి ఓవర్‌లోనే మెయిడిన్‌తో ప్రారంభించడం అనేది కేవలం గణాంకం కాదు, అతనిలో ఉన్న మానసిక బలం, ఒత్తిడిని తట్టుకుని నిలబడే సామర్థం, అత్యుత్తమ ప్రదర్శన చేయాలనే నిబద్ధతను తెలియజేస్తుంది. భారత క్రికెట్ చరిత్రలో 8 మంది పేస్ బౌలర్లు తమ అరంగేట్రం వన్డే మ్యాచ్‌లో తొలి ఓవర్‌లోనే మెయిడిన్ వేసి అరుదైన రికార్డులను సృష్టించారు. వీరిలో భారత మాజీ పేసర్ ప్రవీణ్ కుమార్, 2007 నవంబర్ 30న పాకిస్థాన్‌తో జరిగిన తన వన్డే అరంగేట్రంలో తొలి ఓవర్‌నే మెయిడిన్ వేశాడు. స్వింగ్ బౌలింగ్‌కు పేరుగాంచిన ప్రవీణ్, ఈఘనతతో తన అంతర్జాతీయ కెరీర్‌ను ఘనంగా ప్రారంభించాడు. భారత సీనియర్ పేసర్ ఆశిష్ నెహ్రా కూడా ఈ జాబితాలో ఉన్నాడు. 2001 జూన్ 24న జింబాబ్వేపై అరంగేట్రం చేసిన నెహ్రా, తన తొలి ఓవర్‌ను మెయిడిన్‌గా వేసి అందరినీ ఆకట్టుకున్నాడు. భారత బౌలింగ్ విభాగంలో కీలక ఆటగాడైన భువనేశ్వర్ కుమార్ 2012 డిసెంబర్ 30న పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో తన వన్డేలో అరంగేట్రం చేసి, తొలి ఓవర్‌నే మెయిడిన్‌గావేసి రికార్డు సృష్టించాడు. అతని స్వింగ్ బౌలింగ్ బ్యాట్స్‌మెన్‌లకు సవాల్‌గా మారింది. అలాగే భారత ప్రస్తుత ప్రధాన పేసర్లలో ఒకరైన మొహమ్మద్ షమీ, 2013 జనవరి 6న పాకిస్థాన్‌పై తన వన్డే అరంగేట్రం చేసి, తొలి ఓవర్‌ను మెయిడిన్‌గా పూర్తి చేశాడు. అతని పేస్, సీమ్ బౌలింగ్ సామర్థం అప్పుడే వెలుగులోకి వచ్చింది. ఇక ఎడమచేతి వాటం పేసర్ జయదేవ్ ఉనద్కత్, 2013 జూలై 24న జింబాబ్వేతో జరిగిన వన్డే అరంగేట్రంలో తొలి ఓవర్‌ను మెయిడిన్‌గా వేశాడు. ఇటీవలి కాలంలో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ముకేశ్ కుమార్ 2023 జూలై 27న వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో తన వన్డే అరంగేట్రం చేసి, తొలి ఓవర్‌నే మెయిడిన్‌గా వేశాడు. ఇది అతని బౌలింగ్ సామర్థ్యాన్ని తెలియజేసింది. 2009 డిసెంబర్ 27న శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో సుదీప్ త్యాగి వన్డే అరంగేట్రం చేసి, తొలి ఓవర్‌ను మెయిడిన్‌గా వేశాడు. అలాగే భారత ఫాస్ట్ బౌలర్ టిను యోహాన్నన్ మే 29, 2002న వెస్టిండీస్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో అరంగేట్రం చేశాడు. తన తొలి వన్డే కెరీర్‌లో మెయిడెన్ ఓవర్ వేశాడు.




# నేటి నుండి ఇంగ్లండ్ రెండో టెస్ట్

## టీమ్ ఇండియాలో ఛేంజింగ్స్

### మూడు పెద్ద మార్పులతో బరిలోకి

**న్యూఢిల్లీ:** శుభ్‌మాన్ గిల్ నేతృత్వంలోని భారత్ ఇంగ్లాండ్‌తో జరిగే రెండో టెస్ట్ కోసం ప్లేయింగ్ 11 లో మూడు పెద్ద మార్పులతో బరిలోకి దిగనుంది. 2025 అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా భారత్ మరియు ఇంగ్లాండ్ మధ్య రెండవ టెస్ట్ మ్యాచ్ బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ స్టేడియంలో ఈ నెల 2 నుండి 6 వరకూ జరగనుంది. భారత్ మొదటి టెస్ట్‌లో 5 వికెట్ల తేడాతో ఓడిపోవడంతో ఇంగ్లాండ్ ప్రస్తుతం 1-0తో ఆధిక్యంలో ఉంది. మొదటి మ్యాచ్‌లో ఓటమి పాలైన టీమ్ ఇండియా రెండో మ్యాచ్‌లో ప్లేయింగ్ 11లో కొన్ని మార్పులు చేస్తూ బిసిసిఐ నిర్ణయించింది. జస్‌ప్రీత్ బుమ్రా ఈ మ్యాచ్‌లో పాల్గొంటాడా లేదా అనే దానిపై ఇంకా సస్పెన్స్ ఉంది. దీనితో పాటు, ప్లేయింగ్ 11లో కొత్త ఆటగాడి ప్రవేశం కూడా ఖాయం. ఇంగ్లాండ్‌తో జరిగే రెండో టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా ఇద్దరు స్పిన్నర్లను ఎంపిక చేయనుంది. రెండో టెస్ట్ కోసం కుల్దీప్ యాదవ్ లేదా వాషింగ్టన్ సుందర్ ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. లేకుంటే రవీంద్ర జడేజాను బెంచ్ మీద ఉంచవచ్చు. మరియు కుల్దీప్ మరియు వాషింగ్టన్ ఇద్దరూ ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో పాల్గొంటారు. అలాగే నితీష్ కుమార్ రెండో టెస్టులో పాల్గొనడం వల్ల మొదటి టెస్టులో ఆడిన షాదుల్ ఠాకూర్ ఈ మ్యాచ్‌కు దూరంగా ఉండే అవకాశం ఉంది. భారత పేస్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా పనిభారం నిర్వహణ కారణంగా రెండవ టెస్ట్ మ్యాచ్‌కు దూరమయ్యే అవకాశం ఉంది. ఈ స్పీడ్‌స్టర్ తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టాడు. అయితే, అతను మూడవ టెస్ట్‌లో పాల్గొనే వీలుంది.

# ఫిఫా ప్రపంచ కప్..

## క్వార్టర్ ఫైనల్స్‌కు ఫ్లూమినెన్స్

### 2-0తో ఇంటర్ మిలన్ ఓటమి




**న్యూఢిల్లీ:** ఫిఫా ప్రపంచ కప్-2025 టోర్నమెంట్‌లో ఫ్లూమినెన్స్ 2-0తో ఇంటర్ మిలన్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. బ్యాంక్ ఆఫ్ అమెరికా స్టేడియంలో మంగళవారం జరిగిన ఫిఫా క్లబ్ వరల్డ్ కప్‌టోర్నీలో యుఇఎఫ్ఎ ఛాంపియన్స్ లీగ్ ఫైనలిస్ట్‌లు ఎఫ్‌సి ఇంటర్నేజియోనేల్ మిలానోకు, ఫ్లూమినెన్స్‌కు మధ్య ఉత్కంఠ పోరు నెలకొంది. ఈ టోర్నీలో బ్రెజిలియన్లు ఆఆటలో ఆకట్టుకున్నారు. మ్యాచ్ ప్రారంభంలోనే కానో మొదటి గోల్ సాధించాడు. ఆ తర్వాత, ఫ్లూమినెన్స్ రెండో గోల్ చేసి, ఇంటర్ మిలాన్‌ను ఓడించింది. ఫ్లూమినెన్స్ కెప్టెన్ థియాగో సిల్వా గాయం మధ్య కూడా ఆడి క్లబ్ వరల్డ్ కప్‌లో తన జట్టుకు చెప్పుకోదగ్గ విజయాన్ని అందించాడు. ఇంటర్ ఫేవరెట్‌గా ఉన్నప్పటికీ, వారు చివరి 16లో ఇంటర్‌ను 2-0 తేడాతో ఓడించారు. ఆప్టా సూపర్ కంప్యూటర్ ఇంటర్‌కు ముందుకు సాగడానికి 84.4 శాతం అవకాశం ఇచ్చింది, అయితే ఫ్లూమినెన్స్‌కు 15.6 శాతం అవకాశం మాత్రమే ఉంది. ఇంటర్ జట్టు హాఫ్ టైం తర్వాత తమ లయను కనుగొనడంలో ఇబ్బంది పడింది, ఫ్లూమినెన్స్ హెర్క్యులస్ చివరి గోల్ చేయడంతో వారి విజయాన్ని నిర్ధారించింది. అంతకు ముందు, జర్మన్ కానో జాన్ అరియాస్ ఇచ్చిన డిఫ్లెక్ట్ క్రాస్‌ను యాన్ సోమర్ దాటించి హెడ్డింగ్ చేసి ఫ్లూమినెన్స్‌కు తొలి ఆధిక్యాన్ని అందించాడు. ఇంటర్ కంటే తక్కువ పొజిషన్ కలిగి ఉన్నప్పటికీ (68), ఫ్లూమినెన్స్ లక్ష్యంపై నాలుగు షాట్లు మరియు రెండు పెద్ద అవకాశాలతో వారిని సమం చేసింది.

# తన్వికి వరల్డ్ నంబర్ 1 కిరీటం

## బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ ర్యాంకింగ్స్




**న్యూఢిల్లీ:** జూనియర్ మహిళల సింగిల్స్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి 16 ఏళ్ల తన్వి శర్మ ప్రపంచ నంబర్ 1 స్థానానికి చేరుకుంది. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఈ స్థానం దక్కింది. 2025 యూఎస్ ఓపెన్ సూపర్ 300లో ఆమె అద్భుతమైన ప్రదర్శన చేసిన కొద్ది రోజులకే తన్వీ అగ్రస్థానానికి చేరడం విశేషం. అక్కడ ఆమె యునైటెడ్ స్టేట్స్‌కు చెందిన బీవెన్ జాంగ్ కంటే రన్నరప్‌గా నిలిచింది. ప్రస్తుతం తన్వీ 14 టోర్నమెంట్లలో 19,730 పాయింట్లను కలిగి ఉంది. ఇదే సమయంలో థాయిలాండ్‌కు చెందిన అన్యాపట్ ఫిచిట్ ప్రీచాసక్‌ను ప్రపంచ నంబర్ 1 స్థానం నుండి తొలగించారు. అంతేకాకుండా యూఎస్ ఓపెన్ సూపర్ 300లో ఆమె సాధించిన విజయాలు తన్వీ సీనియర్ మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో పెద్ద పై స్థానానికి ఎగబాకేందుకు కూడా సహాయపడ్డాయి. సీనియర్ మహిళల వరల్డ్ ర్యాంకింగ్స్‌లో ఆమె 16 స్థానాలు ఎగబాకి ఇప్పుడు 50వ స్థానంలో ఉంది. సీనియర్ స్థాయిలో, శర్మ ప్రస్తుతం 30,160 పాయింట్లతో భారతదేశంలో ఆరవ అత్యధిక ర్యాంక్ పొందిన క్రీడాకారిణి. ప్రపంచ 17వ స్థానంలో ఉన్న పివి సింధు, ప్రస్తుతం మహిళల సింగిల్స్ షట్లర్‌లో అత్యధిక ర్యాంక్‌ను కలిగి ఉన్నారు. ఇక పురుషుల సింగిల్స్ సీనియర్ ర్యాంకింగ్స్‌లో ఆయుష్ శెట్టి మూడు స్థానాలు మెరుగుపరుచుకుని ఇప్పుడు ప్రపంచ ర్యాంక్‌లో 31వ స్థానంలో ఉన్నాడు. గత వారం జరిగిన యూఎస్ ఓపెన్ సూపర్ 300లో కూడా అతడు అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు.

# టి20 ర్యాంకింగ్‌లో మూడో స్థానంలో స్మృతి



**న్యూఢిల్లీ:** భారత కెప్టెన్ స్మృతి మంధాన తాజా ఐసిసి మహిళల టి20 ప్లేయర్ ర్యాంకింగ్స్‌లో భారీపెరుగుదలను నమోదు చేసింది. ఇంగ్లాండ్‌పై ఆమె సెంచరీ తర్వాత ఆమె కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్‌ను సాధించింది. స్మృతి 62 బంతుల్లో 112 పరుగులు చేసి 97 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేసింది, దీంతో ఆమె మూడో స్థానానికి చేరుకుని కెరీర్‌లో అత్యుత్తమంగా 771 రేటింగ్ పాయింట్లు సాధించింది. టి20 బ్యాట్స్‌మెన్‌లలో నంబర్ 1 ర్యాంక్ క్రీడాకారిణి బెత్ మూనీ కంటే 23 పాయింట్ల దూరంలో ఉంది. ఓపెనింగ్ పార్టనర్ షఫాలివర్మకూడా బ్యాటింగ్ చార్టులో పెరుగుదలను సాధించింది. అదే మ్యాచ్‌లో 20 పరుగులు చేసి 13వ స్థానానికి చేరుకుంది. ఇంతలో, హార్లీన్ డియోల్ 43 రన్స్ చేయడంతో ఆమె బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 86వ స్థానానికి తిరిగి ప్రవేశించింది. ఇంగ్లాండ్ కెప్టెన్ నాట్ స్కైవర్‌బ్రంట్ 42 బంతుల్లో 66 రన్స్ చేసి అత్యధిక స్కోరు సాధించిన తర్వాత తాజా ర్యాంకింగ్స్‌లో మరో స్థానాన్ని సంపాదించుకుంది. ఆమె 20 రేటింగ్ పాయింట్లు పొంది కెరీర్‌లో అత్యుత్తమ మొత్తం 663ని చేరుకుని తొమ్మిదవ స్థానాన్ని నిలుపుకుంది. ఇక టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో పాకిస్తాన్‌కు చెందిన సాదియా ఇక్బాల్ నంబర్ 1 బౌలర్‌గా కొనసాగుతోంది. అయితే టాప్ 10 ఆటగాళ్ల మధ్య కేవలం 44 రేటింగ్ పాయింట్లు మాత్రమే ఉన్నాయి. ఇక తొలి మ్యాచ్‌లోనే 4 వికెట్లు తీసి 450వ స్థానంలో ర్యాంకింగ్స్‌లోకి భారత్‌కు చెందిన శ్రీ చరణి ప్రవేశించింది. వెస్టిండీస్ మరియు దక్షిణాఫ్రికా మధ్య ఇటీవల ముగిసిన టీ20 సిరీస్ చివరి మ్యాచ్‌లో తన అద్భుతమైన అర్ధ సెంచరీ తర్వాత రైజింగ్ స్టార్ మియాన్ స్మిట్ బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో 76వ స్థానానికి ఎగబాకింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.